# హెలికాప్టర్లు కిందకి దిగి వచ్చేసాయి

## రచయిత: ఇందిరా పార్థసారథి

## మూలం: తమిళం

## అనువాదం: ఏండీ సుందరేశన్

# Source

**Helicoptergal Keezhe Irangivittana (Novel)**
**by Indira Parthasarathy**
**Kizakku First Edition: June, 2006**
**ISBN: 978-81-8368-137-7**

**I gratefully acknowledge with thanks the permission from the author to translate his novel into Telugu and to Srimathi Padmavathi Ramanathan, the author's daughter, for granting permission to post this novel as an EBook on a website.**

**Andy Sundaresan**

# హెలికాప్టర్లు కిందకి వచ్చేసాయి

## 1

తిలకం తొందర పడుతోంది. "ఏమిటి ఇలా ఊరికే కూర్చున్నారు? . . . బయలుదేరడం ఎప్పుడు?"

పుస్తకం చదువుతున్న అమృతం తలెత్తి, ఆమెను తేరిపార చూసాడు.

తిలకంకి నల్లబాటిన ఛాయ. మరి ఎందుకిలా ఆమె మొహాన్ని కొట్టవచ్చే జిగేలుమనే రంగులు ఎంచుకుంటోంది? ఒక ఎరుపు రంగు చీరని తొందర తొందరగా చుట్టబెట్టుకుంది. గడ్డగడ్డగా ఆమె పూసుకున్న పౌడరు మొహాన్ని పాడుచేస్తోంది; నుదుటమీదున్న పెద్ద కుంకుమ బొట్టునుంచి చెమట కారుతూ ముక్కుమీద వాలుతోంది.

"ఏమిటలా చూస్తున్నారు? బయలుదేరండి, నాటకంకి టైమయింది . . . "

అవును, బయలుదేరవలసిందే, మరేం దారి లేదు. తనకిష్టం లేదని చెప్తే ఆమె వదలదు. నాటకం ఎలా ఉంటుందని అతనికి తెలుసు. కళాత్మక అభిరుచి లేని భార్యకి భర్తగా ఉండడం ఎంత పెద్ద త్యాగం!

అసలు పెళ్ళి అనే మాట వస్తే పరస్పర త్యాగాలనే కదా అర్థం? తిలకంని అడిగితే ఒక శ్వాసలో అంతా ఒలకబోస్తుంది: "మీరేం తక్కిన వాళ్ళలాగ ఉన్నారా? నాకెది ఇష్టమో మీకు నచ్చనే నచ్చదు! ఎప్పుడు చూసినా నోరెత్తని స్వాములవారులాగ ఒక పుస్తకం పట్టుకొని కూర్చుంటారు! 'ఎక్కడైనా వెళ్దాం' అని అడిగితే బలి పీటంకి వెళ్తున్న మేకలాగ వస్తారు . . . హూం . . . 'పెళ్ళాంతో వెళ్తున్నాం!' అనే ఉత్సాహం రవంతైనా కనిపించదే?"

అమృతం మేజామీదున్న కారు తాళంచెవిని తీసుకున్నాడు; తిలకం కిటికీలు, గదుల తలుపులు మూయడానికి పూనుకుంది.

అమృతం మేడమెట్లు దిగి షెడ్డులో ఉన్న కారుని బయటకి తీసుకొని వచ్చాడు.

"Good morning, Uncle Ji . . . !"

ఎదురింటి సర్దార్జీ మనవరాలు, పుష్టిగా పెరిగిన నాలుగేళ్ళ పిల్ల - ఫోటో పోటీ కోసమే పెరుగుతున్నట్టు - కనిపించింది.

"Good morning, Shamma . . ." అని అంటూ అమృతం ఆమె భుజం తట్టాడు. ఆ పిల్ల తన చిన్ని చేతులు చాటి అతనికి చూపించిన తరువాత, కారు తలుపు తీసి, భుజం తట్టగానే, లోపలికి వచ్చి అతని ఒడిలో కూర్చుంది.

"Good morning, Auntie . . . "

అమృతం తిరిగి చూసాడు. తిలకమూ వచ్చేసింది.

తిలకం పాపను అతని దగ్గరనుంచి తీసుకొని ముద్దాడింది - ఇద్దరి బుగ్గలూ జతగా కొన్ని నిమిషాలు అదుముకుమ్మాయి.

పాపం, తిలకం! తనకని పిల్లలు లేకపోవడం ఆమెకు బాధగా ఉంది. పెళ్ళయి పన్నెండు సంవత్సరాయ్యాయి, ఒక ఆపరేషన్ చేసుకుంటే తిలకం గర్భం దాల్చవచ్చునని డాక్టర్లు చెప్పారు. కాని తిలకం ఆపరేషన్ అనే మాట వినగానే భయపడి, అసలు పిల్లలే వద్దని నిర్ణయించింది.

పాప తిలకం కౌగిలిలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టు కనిపించింది. "పాపని వదిలేయ్ . . . దాన్ని కిందకి దింపేయ్!" అని అమృతం భార్యని హెచ్చరించాడు.

తిలకం పట్టు వదలగానే పాప పరుగెత్తుకొని తన ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"నేనొక గొడ్రాలు. మీరది నాకు గుర్తు చెయ్యాలా ఏమిటి?"

"నిన్నెవరే గొడ్రాలని అన్నారు? పిచ్చి మాటలు మానుకో . . . ఇలాగ మాటమాటికీ చిన్నబుచ్చుకోవడం మంచిది కాదు."

తిలకం కారు వెనక తలుపు తెరచి, కూర్చుంది.

“రా, ఇక్కడ ముందు వచ్చి కూర్చో!”

“నేను గొడ్రాలుని. నాకు మంద బుద్ధి. మరి ఎన్ని విధాలుగా నన్ను వర్ణిస్తారో, అవన్నీ వినడానికి నేను రెడీగా ఉన్నాను . . . సరేనా?”

అమృతం మరేం అనక కారు స్టార్ట్ చేసాడు.

నాటక రంగస్థలం వీళ్ళు ఉన్న కిద్వాయ్ నగరంకి ఎక్కువ దూరంలో లేదు. కాని అవాళ ఆదివారం, I.N.A. సూపర్ బజార్ కిక్కిరిసి ఉంది. వీళ్ళ కారు చాలా చోట్ల, రహదారిలో అనుమతికోసం ఆగి, ఆగి, చివరకు తన గమ్యం చేరుకున్నప్పుడు సమయం ఆరు గంటలైపోయింది.

తిలకం దారంతా గొణుకుతూనే ఉంది. “మనం ముందే బయలుదేరి ఉండాలి, మీతో నాటకంకి వస్తే ఇదే గొడవ! మీకసలు నాటకం అంటే ఇష్టం లేదు! . . . చూడండి, ఇవాళ మనం తప్పకుండా ఒక సీను miss చేస్తాం!”

“ఐతేనేం, అదేం పెద్ద ప్రశ్న కాదు . . . ఈ నాటకాలు మనం ఎప్పుడైనా చూడవచ్చు!” అన్నాడు అమృతం.

తిలకం నోరెత్తలేదు. ఆమె మొహం చూస్తే ఆమె ధ్యానమంతా నాటకం గురించే అని బోధపడింది; ఆమెకు మరేం గుర్తూ లేదు.

‘ఏమో, ఎవరికి తెలుసు - ఇదొక జనరంజక నాటకం కాబోలు!” అని అమృతం కూడా ఆలోచించాడు. రకారకాల పట్టుచీరలు ధరించి స్త్రీలు గుంపులు గుంపులుగా టికెట్లు కొనడానికి వచ్చే ప్రజల్లో కనిపించారు. ‘ఇక టికెట్లు దొరకవు, మనం తిరిగిపోవలసిందే అనే ప్రమేయంకి చోటులేదు’ అని అమృతంకి బోధపడింది - తిలకం, ఇంతకు ముందే, క్రిందటి వారమే, టికెట్లు కొనేసింది.

నాటక స్థలంలో ఒక యువకుడు నాటకం ఐదు నిమిషాలముందు ఆరంభమైందని తిలకంకి చెప్పాడు.

దంపతులు లోపలికి వెళ్ళి తమ తమ సీట్లలో కూర్చున్నప్పుడు నాటకంలో - ఒక సన్నివేశంలో - ఒక ఇరవైయేళ్ళ అమ్మాయి, ఒక యాభైయేళ్ళ మగవాడు - ప్రేమ సల్లాపంలో - ఉన్నారు.

“ఇదేంటి, ఈ ముసలాడికి రొమాంటిక్ పిచ్చి వచ్చేసిందా?” అని అమృతం అడక్కుండా ఉండలేకపోయాడు.

“అతన్ని ముసలాడని అనకండి సార్! . . . ఈ నాటకంలో అతని వయసు ముప్పై ఐదు . . . ! ఇతనే ఈ నాటకం డైరెక్టరు, హీరో కూడా . . . ”

వెనక సీటులో ఉన్న ఎవరో ఒకతను ఈ సందేశం అందించారు; అందరూ నవ్వారు.

“మీ చర్చలూ, వ్యాఖ్యనాలు ఇక్కడ ఎవరికి కావాలి?” అని తిలకం ఎత్తిపొడిచింది.

అప్పుడే అమృతం రంగస్థలం మీదున్న అమ్మాయిని చూసాడు; పన్నెండేళ్ళ ముందు - ఇదే సమయంలో - గత కాల ఆ పాత దృశ్యాలు అతనికి జ్ఞాపకంలో వచ్చాయి.

** ** **

పోలికలో ఆమె అసలు నిత్యాలాగే ఉంది . . .

ఈమెకీ, నిత్యాకీ ఎటువంటి పోత్తు ఉండడం అసాధ్యం. నిత్యా ఒక బెంగాలివాడిని పెళ్లిచేసుకొని అమెరికాలో ఉంది; ఇదెవరు చెప్మా?

సూర్యకిరణాలు మొహంమీద వాలాయి, ఆమె నవ్వుతోంది . . .

అవును, అదే నవ్వు . . . అమృతం కళ్ళు మూసుకున్నాడు; దేహమంతా ఉల్లాసంలో వొణికింది.

అదే అతను ఆమెను ఆఖరిసారిగా చూడడం - పన్నేండేళ్ళముందు. తిలకం అమృతంకి మేనమామ కూతురు. అతని తండ్రి కొడుకు రాసిన ఉత్తరం నిర్లక్ష్యం చేసి, తనకు తానే అంతా నిర్ణయించి, పెళ్ళి జరిగే దినం, ముహూర్తం, ఒక టెలిగ్రాంలో అమృతంకి తెలియజేసారు. అమృతం నిత్యాని Connaught Palace లో కలుసుకొని తన తండ్రి చేసిన ఏర్పాటు గురించి చెప్పాడు.

“నేను నాన్నగారికి ఇప్పుడు టెలిగ్రాం ఇవ్వబోతున్నాను . . . ‘మనిద్దరం రిజిస్టర్ పెళ్ళి చేసుకుంటాం’ అని. ఏమంటావ్?”

నిత్యా పళ్ళెంలో ఉన్న కట్లెట్ని చెంచాతో తునకలు చేస్తూ, గుడ్డిపేటుగా అతన్ని చూసి నవ్వింది.

"ఏమంటావ్?"

"హూం . . ."

"రోమ్ నగరం మండుతోంది . . . నువ్వేమో . . . "

ఆమె నిదానం చూసి అమృతంకి ఒళ్ళు మండింది.

"మీ మాటలు వింటే నాకు నవ్వాలని ఉంది . . . "

"ఓ, ఇవేం ఎగతాళి మాటలా?"

"మన పెళ్ళి, వెంటనే, మనం ఇష్టం ప్రకారం జరగదు. నాకు తెలుసు, మా అమ్మ దీనికి యెన్నడూ సమ్మతించదు. మన కులగోత్రాల భేదం గురించి నేనిక్కడ ఏమీ చెప్పదలచుకోలేదు. మా నాన్నగారు పోయిన తరువాత నేనూ, అమ్మా, నా మేనమామ దయలో ఉంటున్నాం . . . అతనికి ఒక కొడుకు ఉన్నాడు . . . "

"అంటే మనిద్దరం ఒకరినొకరు కలుసుకోడమే పొరబాటు అన్న మాట . . . నీకీ వివరాలు ముందే తెలుసు, అవునా?"

"దయచేసి నా మాట వినండి . . . ఈ పెళ్ళి మీకు ఇష్టం లేదని మీ నాన్నగారికి ఒక టెలిగ్రాం ఇవ్వండి . . . మనం కొంచెం wait చేద్దాం . . . అసలు నా బావకి అతని మనసులో నాగురించి ఏముందో నాకు తెలీదు . . . అతనికి మరెవరైనా girl friends ఉండవచ్చు . . . "

"అంటే . . . నీ బావకి ఇంకొక అమ్మాయిమీద ప్రేమ కలిగేవరకూ మనం కాచుకొని ఉండాలన్నమాట!"

నిత్యా మళ్ళీ నవ్వడం చూసి అమృతం చిరచిరలాడాడు.

"దీనిగురించి మనం ఇప్పుడే నిర్ణయించాలి! Now or Never!"

నిత్యా ఏమీ అనలేదు; కళ్ళు మూసుకొని సోఫామీద వాలింది.

"భలే, నీకంతా మాజాగా ఉంది . . . " అమృతం కంఠధ్వని తీవ్రమైంది.

నిత్యా కళ్ళు ఇంకా మూసి ఉన్నాయి; తన చెయి వేలుని సంగీతం వినిపింటే దిశకి మళ్ళించింది.

అమృతం మౌనంగా ఆమెను తేరిపార చూసాడు.

"నాకు తెలుసు . . . "

ఇప్పుడు ఆమె పెదిమలు కదలాయి.

"మీకేం తెలుసు? . . . "

"నువ్వు చెప్పేది - నీ మేనమామ కొడుకు గురించి - అంతా పచ్చి అబద్ధం! నీ బాధ అంతా మన కుల గోత్రాలగురించే . . . అవునా?"

నిత్యా కళ్ళు తెరచింది. మొహం బాగా ఎఱ్ఱబారిపోయింది. మాటలు పట్టుగా, స్పష్టంగా వినిపించాయి.

"Don't be silly . . . "

"మరి, నీకెందుకు ఇంత కోపం? నేను చెప్పేది నిజం, అవునా?"

నిత్యా మళ్ళీ నవ్వింది. "నాకేం కోపం లేదు. నిందారోపణ అనే మాటకి వస్తే దానికి కనీసం కొంచెమైనా యోగ్యత ఉండాలి, అప్పుడే కోపం వస్తుంది. మీ ఫిర్యాదులో అలాగేమీ లేదు . . . నాకు ఆశ్చర్యంగా ఉంది . . . మీకెందుకు ఇంత inferiority complex?"

"సరేలే, ఇక మనం దీనిగురించి మరేం మాటాడవద్దు. మా నాన్నగారికి నా సందేశం ఏమిటో తెలుసుకున్నాను. For this relief, much thanks!"

"చూసారా? కోపంలోకూడా షేక్ స్పియర్ని వల్లించడం మనకి అలవాటైపోయింది!" అని నిత్యా నవ్వింది.

“నీ మనసులో ఏముందో నాకెప్పుడూ అర్థం కాదు!” అని అమృతం నిట్టూర్పు వదిలాడు.

“అదే నా బలం.”

“Dammit! అంటే మన ఇతిహాసాల్లో వచ్చే కథానాయకుడులాగ నేను బతిమాలాలి, అవునా?”

“You are wrong! అది Western tradition! మన ఆచారంలో కథానాయకి కథానాయకుడు, అతని తల్లిదండ్రులు, అమ్మమ్మ, నాన్నమ్మ కాళ్ళముందు పడి గింజుకోవాలి!”

“Hang your traditions! All small talk!

నిత్యా మళ్ళీ అతన్ని రెప్ప వాల్చకుండా చూసింది. ఒక చిరునవ్వుతో భుజాలు ఊపింది. అప్పుడే ఒక వెయిటర్ వచ్చి బిల్లు అందించాడు. వెంటనే నిత్యా బిల్లు అందుకొని తన చెయి సంచెని తెరచింది.

“ఇదేంటి, . . . కొత్తగా? . . . ” అని అమృతం చిరచిరలాడాడు.

“మరేం లేదు . . . లెక్క తీర్చేసాను!”

ఆ తరువాత ఆమెను చూడనేలేదు.

హాలులో అందరూ నవ్వుతున్నారు.

“నవ్వరేం? . . . ఆ అమ్మాయి ఎంత అద్భుతంగా నటిస్తోంది!” అంది తిలకం.

“ఏ అమ్మాయి? . . . ” అమృతం చుట్టుముట్టు తిరిగి చూసాడు.

“బాగుంది! . . . మీరు నాటకం చూస్తున్నారా లేక నిద్రపోతున్నారా?”

“నువ్వు నాటకంలో వచ్చే అమ్మాయి గురించి చెప్తున్నావా? నాకసలు నాటకం కథ బోధపడదు . . . ఇదేదే surrealistic లాగ ఉంది . . . ”

“ఎలాంటి stick ఐనా ఉండనీ . . . నలుగురుతో అనుసరించి మెలగడం మీరు నేర్చుకోవాలి . . . ”

అవును. ప్రజాస్వామ్య ప్రపంచంకి అదే సరైన వివేకం.

ఆ వివేకం తనకి సహజంగా లేదని అమృతంకి తెలుసు. నిత్యాకూడా తరచుగా అతనికి అదే చెప్పేది. చంద్రలోకంకి ప్రయాణం చేసే త్రాణ తనకుంది, కాని ఐదారుగురు ఉన్న చోట తనకి బిడియం.

ఒక సారి American Embassy లో జరిగిన ఒక విందుకి అమృతం నిత్యా వెళ్ళారు. అప్పుడు నిత్యా పది నిమిషాలకి ఒక మార్వారి నాట్యం ఆడి అందరినీ రంజింపజేసింది. ఆ తరువాత అందరితోనూ ఇంపుగా, సరసాగా, మాటాడింది. కాని అమృతం అక్కడ ఉన్న రెండు గంటలూ ఒక మూలన కూర్చొని, తన చుట్టూ పొంగివస్తున్న ఉత్సాహం, ఓరగా గమనించాడు. నిత్యా అతనికి ఒక మర్మం. ఆమెకు Eisenstein Principle, Hoyles-Narlikar సవరణలు గురించి వాదించడం తెలుసు; Playboy పాఠకుల మొహాలు ఎఱ్ఱబోయినట్టు మాటాడమూ తెలుసు.

విందు ముగించి ఇద్దరూ బయటకి వచ్చినప్పుడు నిత్యా అతనికి చెప్పింది: “అక్కడ ఉన్నవాళ్ళందరూ మీగురించి నన్ను అడిగారు.”

“ఏమని అడిగారు?”

“‘అతనేం మీకు కాపలావా?’ అని అడిగారు. మీరూ అలాగే కనిపించారు. ఒక మూల కూర్చొని ఒక గూఢచారిలాగ నన్ను చూస్తూ ఉన్నారు.”

“నాకూ ప్రజాస్వామ్యంకి పొత్తు లేదని నువ్వు తరచుగా చెప్పడం నాకు తెలుసు.”

“In fact, నాకదే ఇష్టం. Strong silent Man అని అర్థం!”

నిత్యా చాలాసార్లు అతనికి అలా చెప్పి ఉంది.

నిత్యాని ఆకర్షించిన ఆ 'ఒంటరిపాటు' ఆ తరువాత ఆమె విసుగుకి కారణమేమో? హోటల్లో ఆఖరిసారిగా కలుసుకున్నప్పుడు ఇద్దరిమధ్యా లేచిన అభిప్రాయ భేదంకి కారణం ఏమిటి? ఒక ముఖ్యమైన విషయం గురించి నిర్ణయించాలనే నిర్బంధంలో నిత్యా ఎందుకు వెనకాడింది? ఇంతకీ ఆమె తన బావని పెళ్ళాడలేదు; వాడెవరినో ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు. నిత్యాకూడా తనకి అదే చెప్పింది. తను తొందరపడినది బుద్ధిమాంద్యం అనవచ్చా?

అవును. బుద్ధిమాంద్యం అంటే అదే. లేకపోతే అభిరుచి లేని ఈ గుంపుతో కలిసి మాటిమాటికీ నవ్వుతున్న తిలకం పక్కన తను కూర్చోవలసిన అవస్థకి వేరే కారణం ఉందా ఏమిటి?

"అయ్యో, దేవుడా!" అని తిలకం అరిచింది.

"ఏమైంది నీకు?" అమృతం అడిగాడు.

"ఆ పిల్లవాడిని చంపడానికి ఆ విల్లన్ ఆ ఇంటిసే కాలుస్తున్నాడు! అది ఎంత నిజంగా చూపిస్తున్నారు!"

ఆ సినిమా కథ రాసినతన్నీ ఆ జ్వాలలో తోసి పారేయాలని అమృతంకి అనిపించింది. కథలో వచ్చే విల్లన్ పాపి కాదు. అది ఆ రచయితే.

అప్పుడు రంగస్థలంమీద ఒక యువతి నిలబడింది. పొడుగాటి కొప్పు తెరచుకుంది. మొహంలో నిర్లక్ష్యత, చూపులో ఒక మెరుపు. అసలు నిత్యాలాగే ఉంది.

"బాగా నటిస్తోంది" అంది తిలకం.

"ఈ అమ్మాయి పేరు నీకు తెలుసా?" అని అమృతం అడిగాడు.

"ఎవరికి తెలుసు?" అంది తిలకం.

"భానుమతి" అని ఎవరో వెనకనుంచి అన్నారు.

అమృతం తల తిప్పి చూసాడు; జవాబు చెప్పిన అమ్మాయికి ఇరవైయేళ్ళు ఉండవచ్చు.

"భాను నా స్నేహితురాలు . . . " అంది ఆమె.

"I see . . . "

"ఇంతకు ముందు ఈవిడ మరేం నాటకంలోనూ నటించలేదు కాబోలు," అంది తిలకం.

"లేదు . . . డిల్లీకి వచ్చి ఆరు నెలలే అయ్యాయి . . . ఇదే ఈవిడ నటించిన మొట్టమొదటి నాటకం . . . "

"She's very smart," అన్నాడు అమృతం. అది విని తిలకం కోపంతో భగ భగమని కళ్ళతో కాల్చున్నట్టు అతన్ని చూసింది. అది తెలిసినా అమృతం లెక్క చెయ్యలేదు.

"ఉద్యోగం చేస్తుందా? . . . చదువుతోందా?" అమృతం అడిగాడు.

"రేడియోలో పని చేస్తోంది . . . "

"ఇక చాలు . . . నాటకం చూడండి!" అని తిలకం గుసగుసలాడింది.

"సరే, నువ్వు చూసి రా . . . నేను బయట ఉంటాను . . ." అని చెప్పి అమృతం లేచాడు.

"కూర్చోండి . . . కొంత సేపట్లో . . . " ఆమె మాటాడుతూంటే ఆమె చెయిని ఎదిరించుతూ అమృతం బయటకి నడిచాడు.

# 2

నాటకం హాలు బయట ఇద్దరు ముగ్గురు విలేఖరులు నిల్చొనివున్నారు. ఢిల్లీలో జరిగే దక్షిణ భారత కళా ప్రదర్శన గురించి - అది ఏదైనా సరే - విమర్శలు దినసరి వార్తాపత్రికలలో వీళ్ళు రాస్తారు. ఆ బృందంలో మణితో అమృతంకి పరిచయం ఉంది.

"మీరెక్కడికి బయలుదేరారు?" అని అడిగారు మణి, పొగాకు నములుతూ.

"బయలుదేరలేదు. మా ఆవిడ లోపల ఉంది . . . " అన్నాడు అమృతం.

"అసలీ నాటకం వాళ్ళకోసమే కదా?" అన్నాడు మణి, నవ్వుతూ.

"అదేనా మీ విమర్శ?"

"అవును. బెంగాలీల మాటకొస్తే కొత్తకొత్తగా నాటక బృందాలు ఆరంభించినప్పుడు కొత్తకొత్తగా ఏమైనా చెయ్యాలని వాళ్లు ఆయాసపడతారు . . . కాని తమిళులు కొత్త నాటక బృందం స్థాపించడానికి కారణం పాత బృందంలో ఛాన్సు దొరకలేదనే మనో వేదన! ఇక నాటకం గురించి కొత్తగా ఏదీ చెప్పలేం . . . "

"కళాత్మక అభిరుచికి మాత్రం మనం కొంచెం ఎక్కువగానే స్త్రీలకి authority ఇచ్చేసాం . . . " అని అన్నారు పక్కనే ఉన్న ఒక కళ్ళద్దాల మనిషి.

"స్త్రీలంటే సంస్థాప నియమాల్లో మోటుగా నమ్మేవారన్న మాట . . . కాలేజీలో చాలీ-చాలని చదువు చదువుకున్న అమ్మాయిలు . . . " అన్నాడు అమృతం.

"బాగా చెప్పారు. ఇంకొక సంగతి. ఇంగ్లీషు నాటకమంటే, ప్రొఫసర్లు నిష్పక్షపాతంగా అన్ని విధాల కొలబద్దలతో దాని మంచి చెడ్డలు చూస్తారు. కాని తమిళ నాటకమంటే వాళ్ళు పెళ్ళాం పిల్లలలతో వచ్చి అమాయిక అభిరుచితో చూసి ఆనందిస్తారు. ఎంత శోచనీయం!"

"ఆశ్రయం ఇచ్చి కళకి దోహదం చేస్తున్నట్టు వాళ్ళ ఉద్దేశం" అని అంటూ అమృతం తిరిగిచూసాడు.

నాటకం ఐపోయింది. అందరూ హాలునుంచి బయటకి వస్తున్నారు.

"మణి సార్, మీరెందుకు బయట నిలబడ్డారు?" అని ఎవరో అడిగారు.

"అన్నం ఉడికిందో లేదో చెప్పడానికి ఒక మెతుకు . . . రెండు సీన్లు చూసాను, అది చాలదా?"

"నాటకం ఎలాగుంది?"

"First Class . . . Commonwealth Drama Festival కి పంపాలి."

"నిజంగానా?"

"అవును. నిజంగా చెప్తున్నాను. ఇప్పుడే ఈ విలేఖర్లతో మాటాడాను. ఇటువంటి Magnum Opus రాసినవాళ్ళు మనదేశంలో ఉన్నారని మీకు తెలుసా?"

ప్రశ్న అడిగినతను మరేం అనక వెళ్ళిపోయారు.

"మీరు మోతీబాఘ్ లో ఉన్నారు కదూ? మిమ్మల్ని మీ ఇంటిలో drop చేస్తాను" అన్నాడు అమృతం.

"No, thanks. నేను scooter లో వచ్చాను" అన్నారు అతను.

"నాటకం ఎంత బాగుంది! . . . మీరు పూర్తిగా చూడలేదు . . . " అని అడుగుతూ తిలకం వచ్చింది.

"చూసారా? Majority చూసి ఆనందించిన నాటకం ఇది. మరి మీరూ నేనూ ఆక్షేపిస్తే ఎలాగ? సరే, నేను వస్తాను . . . " అని మణి బయలుదేరాడు.

“నాకు దాహంగా ఉంది. తాగడానికి నీళ్ళు దొరుకుతాయా?” అని తిలకం అడిగింది.

“రా . . . అక్కడకి వెళ్ళి Coco Cola తాగుదాం” అన్నాడు అమృతం.

“అదేంటి . . . నన్ను పక్కన పెట్టుకొని ఆ అమ్మాయి smart, అదీ, ఇదీ అంటున్నారు, మీకు బాల్యం తిరిగి వచ్చేసిందా?” అని తిలకం Coco Cola తాగుతూ అడిగింది.

“బాల్యంలోనే అలాగ అడుగుతే తప్పు . . . ఇప్పుడు వయస్సు చెల్లిన అర్హత నాకు ఉందే?” అన్నాడు అమృతం.

“ఆ అర్హత మీకింకా రాలేదు. జాగ్రత్తగా ఉండండి. ‘నలబైలో కుక్కలాగ!’ అనే సామెత ఉంది.”

అక్కడ ఐదారుగురు గుమిగూడి ఉన్నారు. అందులో ముగ్గురు అమ్మాయిలు. తిలకం మాటలు వాళ్ళు తప్పక వినివుంటారు. ఏదో మాటాడుకుంటూ ఉన్నవారు, సంభాషణ ఆపి, తిలకం నిలబడిన దిశలో కళ్ళు మళ్ళించారు. అమృతం అవమానం భరించలేక తొందర తొందరగా కౌంటర్ లో డబ్బు చెల్లించి బయటకి నడిచాడు.

“మన జనులకి ఎప్పుడూ ఇదే అలవాటు! పొంచి వినడం అంటే ఎంత సరదా!” అని గొణుక్కుంటూ తిలకం అతని వెనుక వేగంగా వచ్చింది.

“నలుగురు విన్నట్టు బొబ్బలు పెట్టు, వాళ్ళు చెవులు మూసుకుంటారు!” అని అమృతం మండిపడ్డాడు.

“మీకెప్పుడూ నన్ను తిట్టాలి . . . నాతో రావడానికి మీకిష్టం లేదు . . . ఏమైనా చెప్పి నన్ను మందలించాలి . . . అవునా?”

అమృతం ఈ తగవుని పొడిగించవద్దని ఊరుకున్నాడు. తిలకం ఎప్పుడు గభీమని భగ్గుమంటుందో తెలీదు. అలాగేమైనా జరిగితే ఈ నాటకం చూడడానికి జనులు గుమిగూడుతారు.

అమృతం తన కారుని చేరుకున్నప్పుడు నాటకంలో నటించిన ఆ అమ్మాయి, ఇద్దరు ముగ్గురుతో, బాలు నిల్చొని ఉన్నారు,

“హలో, మిస్టర్ అమృతం వస్తున్నారు, అతన్ని అడుగుదాం!” అని బాలు వాళ్ళకి చెప్పి, అమృతంని చూసి చిరునవ్వు నవ్వారు.

“హలో, . . . ఏమిటి కావాలి?” అని అమృతం అడిగాడు.

“మీరు కిద్వాయ్ నగర్ వెళ్తున్నారుకదూ? ఈ అమ్మాయిని లక్ష్మీభాయ్ నగర్ లో drop చేస్తారా? తొందరగా వెళ్ళాలి. వాళ్ళ అమ్మగారికి అస్వస్థగా ఉంది . . . నాటకంలో నటించాలని వచ్చారు . . . దయ చేసి . . . ”

అమృతం బాలు ధరించిన badge చూసాడు.

“మీకీ ఈ డ్రామా బృందంతో పొత్తు ఉందన్నమాట!”

“ఇప్పుడు నేనే Vice President!” అన్నారు అతను, గర్వంగా.

“సరే, నాతో రానీ. . . ” అన్నాడు అమృతం; కారు వెనుక తలుపు తెరిచాడు. ఆ అమ్మాయి ఎక్కి కూర్చుంది.

తిలకం అమృతం పక్కన వచ్చి కూర్చుంది. ఆమె మౌనం చూసి అమృతంకి కొంచెం బాధ కలిగింది: తను వెంటనే ఏకీభవించినది ఆమెకు కోపమా?

“మిస్టర్ అమృతం, చాలా thanks . . . భానూ, వస్తానమ్మా . . . ”

భాను చిరునవ్వుతో తలూపింది.

తిలకం కారు తలుపుని హఠాత్తుగా మూయగానే అమృతంకి ఎలాగో అనిపించింది.

“కొంచెం మెల్లగా మూయకూడదూ?” అని అడిగాడు అమృతం.

దానికి తిలకం జవాబు చెప్పకపోవడం అతనికి ఆశ్చర్యం కలిగింది.

కారు Great Place దాటి వెళ్లే వరకూ ఎవరూ మాటాడలేదు. లేతగా దగ్గుతూ భాను అడిగింది: “మామీ, నాటకం ఎలా ఉంది?”

"హూం . . . నాటకమా? . . . బాగుంది . . . "

"మీకు నచ్చిందా?"

"అతనెక్కడ నాటకం చూసారు? ఏదో కోపంతో కూర్చొని ఉన్నారు."

"అలాగా?"

"నాటకం hopeless . . . నువ్వు . . . మీరు బాగా నటించారు . . . "

"పరవాలేదు . . . 'నువ్వు' అనే అనండి . . . "

"అదేంటమ్మా నువ్వు మేకప్ కూడా తీయకుండా బయలుదేరావ్? అంత తొందరగా వెళ్ళాలా?" అని తిలకం అడిగింది.

"అవునండీ, అమ్మ ఒంటరిగా ఉంది . . . జబ్బుగా ఉంది . . . "

"మీ నాన్నగారు ఎక్కడ పని చేస్తున్నారు?"

"నాకు నాన్నగారు లేరు. మీరన్నది నిజం. నేను మాట ఇచ్చినందువల్ల ఇవాళ నటించాను. ఇవేం నాటకాలు! పిచ్చితనం అంటే ఇవే . . . "

'What a smart girl!' అని అమృతం మనసులో చెప్పుకున్నాడు. 'నాన్నగారు లేరు' అని చిక్కగా చెప్పేసి సంభాషణని వేరే దిశలో ఎంత చమత్కారంగా మళ్ళించుతోంది!

"మా ఆయన నాటకం hopeless అంటున్నారు. నువ్వూ పిచ్చితనం అంటున్నావ్ . . . మరెందుకు నువ్వు నటించడానికి సమ్మతించావ్?" అని తిలకం అడిగింది.

"మనకి ఇష్టంలేని పనులు ఎన్నో చేస్తాం. అందులో ఇదీ ఒకటి అనుకోండి."

" 'ఇష్టంలేని పనులు' అంటే ఏమిటి అర్ధం?" అమృతం అడిగాడు.

భాను కొంచెంసేపు మాటాడలేదు. తరువాత నవ్వుతూ "నాకు మిమ్మల్ని అడగాలని ఉంది . . . కాని . . . " అని ఆరంభించింది.

"ఎందుకు కాని . . . "

"మీకు కోపం రావొచ్చు . . . "

భాను ఏం అడుగుతుందని అమృతం తారుమారయ్యాడు. కాని ఆమె ఏదైనా అడిగితే తిలకంకి కోపం రావచ్చు. అందువలన అతను భానుని ప్రోత్సాహించలేదు; ఊరుకున్నాడు.

"అతనికేం కోపం రాదులే . . . అడుగు" అని తిలకం ప్రోత్సాహించింది.

"మీరూ ఈ నాటకం hopeless అంటున్నారు . . . ఇది మీకు ముందే తెలుసని నా ఉద్దేశం. మరి మీరెందుకు ఈ నాటకం చూడడానికి వచ్చారు?"

"నేను పిలిచాను, అందుకోసం వచ్చారు." తిలకం కంఠస్వరం సాధికారంగా మ్రోగింది.

అమృతం కారు లైటు వేసాడు. అద్దం ద్వారా చూసాడు. భాను మొహంలో చిరునవ్వుతోబాటు గీటు, ఆత్మవిశ్వాసం వలన ఏర్పడిన ఉదాసీనత చోటుచేసుకున్నాయి.

గభీమని ఒక ఆలోచన అతనిలో లేచింది: ఆ వెనక సీటులో నిత్యా కూర్చొని నవ్వుతోందా? ఒకసారి అతనూ నిత్యా అభిరుచి గురించి వాదించినది జ్ఞాపకంలో వచ్చింది.

డిల్లీ Red Fort పక్కన ఉన్న ఒక చిన్న దుకాణంలో కూర్చొని చోలే తినాలని నిత్యా హఠం చేసింది. "దేవుడా, ఇదేనా నీ taste? అని అమృతం అడిగాడు.

“మీకేం అభిరుచి ఉందో లేదో, కల్పనా శక్తి రవంతైనా లేదు. Red Fort కి నేపథ్యంలో తింటే  ఎంత మజాగా ఉంటుందో తెలుసా?”

“సరేలే,  నువ్వు తిను . . . నాకు వద్దు . . . ”

అమృతంకి ఆ ఘటన జ్ఞాపకంలో వచ్చింది; ఇప్పుడు నిత్యా ఏమంటుంది?

“గుర్తుందా, ‘అభిరుచి’, ‘అభిరుచి’, అని మీరు పదే పదే పాడేవారు . . . మరి ఏ అభిరుచితో మీ భార్యను ఎంచుకున్నారు? . . . I am sorry, మీ భార్యే మిమ్మల్ని ఎంచుకున్నారనిపిస్తోంది, అవునా?”

అమృతం లైటు ఆర్పాడు.

“ఏమిటిది, లైటు ఆర్పుతున్నారు, వెలిగిస్తున్నారు? . . . ” అని తిలకం అడిగింది.

“మనం ఎన్నో పనికిరాని పనులు చేస్తున్నాం. అందులో ఇదీ ఒకటి . . .” అన్నాడు అమృతం.

భాను కిసుక్కున నవ్వేసింది; అది కొంచెం ఎక్కువే అని అమృతంకి అనిపించింది.

“మీరిచ్చిన  జవాబులో ఏం హాస్యం ఉందో నాకు అర్థం కావటంలేదు” అంది తిలకం.

“నాకూ అర్థం కావటంలేదు,” అన్నాడు అమృతం.

“Auntie చాలా స్పష్టంగా మాటాడుతున్నారు, అది నాకు నచ్చింది” అంది భాను.

“అంటే నేను బాహటంగా మాటాడడం లేదా?” అని అమృతం అడిగాడు.

“దానిగురించి నాకు దృఢంగా తెలీదు.”

మళ్ళీ కారు లైటు వెలిగించి ఆమె మొహం చూడాలని అమృతంకి అనిపించింది, కాని అతను అలాగ చెయ్యలేదు. ఇటువంటి సమయాల్లో నిత్యాకూడా భానులాగేజవాబు చెప్పివుంటుంది.

ఇప్పుడు అతనికి ఇంకొక సంగతి జ్ఞాపకంలో వచ్చింది. కొన్ని రోజులముందు ఈ డ్రామా బృందంలో చేరిన కేశవన్ చెప్పిన సంగతి ఈ ఆమ్మాయిగురించే అయివుండాలి: “మద్రాసునుంచి ఒక అమ్మాయి కొత్తగా వచ్చింది. ఎంత అద్భుతంగా నటిస్తోందో తెలుసా? దాని అమ్మకాడా నటిస్తోంది . . . కూతురు తల్లిని మించేసింది!” మరి, ఆ తల్లి ఇవాళ ఎందుకు రాలేదు? ఓ, మరిచిపోయాను, ఆవిడకి అస్వస్థతగా ఉంది అన్నారుకదూ!

“మీ అమ్మ కూడా నటిస్తారు కదూ?” అని అమృతం అడిగాడు.

“అవును. మీకెలా తెలుసు? ఈ నాటకంలో మా అమ్మకికూడా నటించడానికి ఛాన్సు ఇచ్చారు. కాని జబ్బుగా ఉంది . . . అమ్మ నటిస్తుందని మీకెవరు చెప్పారు?”

“వినికిడి . . . ”

“మీకెవరు చెప్పారు? ఇంతవరకూ మీరు నాకు చెప్పనేలేదే?” అని తిలకం అడిగింది.

అమృతం ఏమీ అనక ఊరుకున్నాడు. కారు తుగ్లక్ మార్గంలో ప్రయాణం చేస్తోంది. ఎదుట దిశనుంచి  సైకిలులో వస్తున్న ఒక పిల్లవాడు కారుముందు వచ్చి పడ్డాడు. గభీమని బ్రేకు వేసి అమృతం కారు ఆపిన వేగంలో తిలకం అతనితో ఢీకొట్టింది. కారునుంచి దిగివచ్చి, అమృతం బెదిరిపోయి నిల్చొనివున్న బాలకుని వీపుమీద తట్టాడు. మంచి వేళ, సైకిలు తప్పించుకుంది. పిల్లవాడుకీ గాయం లేదు.

*“మాఫ్ కీజియే . . . ”*

*“ఠీక్ హై, చలో . . . ”*

అమృతం తిరిగి కారు సీటులో కూర్చోగానే తిలకం అతన్ని మందలించింది.

“మీరేంటి ఆ అబ్బాయి వీపుని తట్టుతున్నారు - చెంపమీద జోరుగా వాయించకుండా?”

“చూసావుగా వాడి మొహం - జడుపులో వాడికి సగం ప్రాణం పోయింది!”

“ఇతరులంటే మీకెప్పుడూ దయ, జాలి . . . నామాట కొస్తే ఏమీ రాదు . . . ”

తిలకం జాడగా ఏమంటోంది? తను భానుతో ఆమె ఇంటికి వెళ్ళడం తిలకంకి ఇష్టం లేదా?

“నేనడిగిన ప్రశ్నకి మీరింకా జవాబు చెప్పలేదు” అని తిలకం అడిగింది.

“ఏం ప్రశ్న? ‘ఎందుకు జాలి?’ అని అడుగుతున్నావా?”

“అవును . . . ఆ తర్వాత వాళ్ళ అమ్మకూడా నటిస్తారని మీకెవరు చెప్పారు? మీరెందుకు నాకు చెప్పలేదు?” అని తిలకం అడిగింది.

## 3

“బాగుంది! నేను విన్నదంతా నీకు చెప్పాలన్నమాట! . . . ” అని అమృతం చిరచిరలాడాడు.

తిలకం తన్ను కోపంతో చూస్తోందని అమృతంకి తెలిసింది. కాని అతను ఆమెను తిరిగి చూడలేదు.

సఫ్దర్ జంగ్ విమాన నిలయం దాటి, లక్ష్మీభాయ్ నగర్ ఆరంభించే సంధిలో ఎఱ్ఱ దీపం చూసి అమృతం కారు ఆపాడు.

“లక్ష్మీభాయ్ నగరంటే ఇక్కడే దిగాలి” అని తిలకం అంది. భానుని ఆమె ఇంటి దగ్గర విడిచిపెట్టడం తనకిష్టం లేదని ఆమె అంటోందని తెలిసింది.

“సరే, నేను ఇక్కడ దిగుతాను . . . ఇల్లు పక్కనే ఉంది . . . నడిచి వెళ్తాను” అంది భాను.

“వొద్దు . . . నీ బ్లాక్ నంబరు చెప్పు . . . అక్కడ దింపుతాను” అన్నాడు అమృతం.

“No, please . . . మీకెందుకు శ్రమ? మీరిలా తిన్నగా కిద్వాయ్ నగర్ వెళ్ళవచ్చు. అవునా?”

“Stop arguing . . . నీ బ్లాక్ నంబరు చెప్పు! Green light వచ్చేస్తుంది . . . నా శ్రమ గురించి నువ్వేం బాధపడకు . . . ”

భాను కొంచెం జంకింది. తిలకం కాడా అదే చెప్తుంతని ఎదురుచూసిందేమో?

తిలకం నోరు పెగల్లేదు.

అమృతం మండిపడ్డాడు: “చెప్పవమ్మా, కారుని ఎంతసేపు ఆపమంటావ్?”

“ఎడం పక్క వెళ్ళండి . . . C Block . . . ఇల్లు నంబరు 645 . . . ”

అమృతం కారుని ఎడం పక్క మళ్ళించాడు; ఇంతలో ఒక బస్సు వచ్చి తాకగానే అతను రవంతలో తప్పించుకున్నాడు.

“ఉత్సాహంలో మీరేం చేస్తున్నారో మీకు తెలుసా?” అన్ తిలకం ఎత్తి పొడిచింది.

“Don’t be silly . . . ” అమృతం చేతులు బిగువుగా steering wheel ని పట్టుకున్నాయి.

“ఇక్కడ ఆపండి . . . ” అంది భాను.

కారునుంచి దిగి భాను చిరునవ్వుతో శెలవు తీసుకుంది.

“Auntie, చాలా thanks! . . . ఆలస్యం ఐపోయింది. లేకపోతే మీరు మా ఇంటికి రావాలని అడిగివుంటాను . . .”

“దానికేంలే” అంది తిలకం.

“వస్తాను . . . అంకుల్!”

భాను తన్ను అంకుల్ అని పిలవడం అమృతంకి ఎలాగో అనిపించింది; మరేం అనకుడా అతను కారు స్టార్ట్ చేసాడు.

తిలకం నవ్వింది. ఆమె కోపంగా ఉందని అనుకున్న అమృతంకి ఆమె నవ్వు వింతగా కనిపించింది. ఆమెను తిరిగి చూసాడు.

“ఆమె అంకుల్ అని పిలుస్తే పొరబాటు కాదు. మీకిప్పుడు నలభై నిండాయికదూ?”

“అవును మరి. నువ్వు ఆంటీ అవుతే నేను అంకుల్ కదా? అందుకు నవ్వెందుకు?”

“కోపం వద్దు. మనకిష్టం ఉన్నా లేకపోయినా వయస్సు చెల్లడం ఆగదు.”

తిలకం కొత్త దాడి అతనికి బోధపడలేదు. ఇల్లు చేరేవరకూ అతని మరేం అనలేదు.

ఇల్లు చేరగానే అమృతం ఆమెను ఎత్తి పొడిచాడు: “నువ్వు ఇవాళ జడ్డిలాగ ఏమేమో మాటాడుతూ ఉన్నావ్ . . . ఆ అమ్మాయి మనసులో నీ గురించి ఏమనుకుంటుందో ఆలోచించావా?”

“ఏమనుకుంటే నాకేం? నేను జీవించేది ఇతరులకోసం కాదు . . . ”

“All right . . . All right . . . ” అని అంటూ, సోఫా మీద వాలి, అమృతం రెండు చేతులతో తలవెనుక ఆనుకున్నాడు.

“మీరెప్పుడూ ఇలాగ భగ్గుమనడం నేను చూడలేదు. మీకేమైంది ఇవాళ?” ‘ఇవాళ’ అని అన్నప్పుడు తిలకం కొంచెం నొక్కి మాటాడింది.

అమృతం కళ్ళు మూసుకున్నాడు.

ఆ రాత్రి అతను నిద్రపోలేదు. తిలకంకి ఏమైంది? దానికి ఎవరితోనూ స్నేహం రెండురోజులకి మించి ఉండదు. పెళ్ళయి, పన్నేండేళ్ళ తరువాతకూడా పిల్లలు పుట్టలేదన్న కారణం ఆమెను cynic గా చేసేసింది. ఆమె ఏం చెప్పినా, ఏం చేసినా, తన యంత్ర జీవితం సాగుతోంది. కాని ఎన్ని రోజులు ఈ బుకాయింపు సాధ్యం? తిలకం అన్నది నిజం. ‘ఇవాళ’ తనకేమైంది?

నిత్యాగురించి అమృతం తిలకంకి ఏమీ చెప్పనేలేదు. తను పుట్టిన కారణమే అమృతంని పెళ్ళిచేసుకోవడానికే అనే భావనతో, అతన్ని మరేవిధంగానూ ఊహించలేక, ఊహించడానికి ధైర్యం లేని యిరుకైన వృత్తంలో తిలకం తన్ను బందించుకుంది. నిత్యాగురించి చెప్పకపోవడమే తను ఆమెకు చెయ్యవలసిన న్యాయం అని అమృతం మనసులోనూ ఉంది. కాని ఇప్పుడు, గభీమని, ఆమెకు చెప్పాలనిపించింది; అమృతం తిరిగి చూసాడు.

తిలకం నిద్రపోతోంది. తిలకంలో అందం లేదు, వికారమూ లేదు; తనెవరికీ లొంగకూడదు అనే భావనతో అజాగ్రత్తమైన ఉత్సాహంతో పెరిగిన దేహం. పిల్లలు పుట్టలేదన్న కారణం వలన కాబోలు - ఆమె మొహం పసిపాపలాగ కనిపిస్తోంది; అది ప్రకృతి చేసిన పరిహారం.

నిత్యా మంచి అందగత్తె. అది తను మరచిపోవడం అసాధ్యం, అదే తన దుర్భాగ్యం. ఆ భావన, హృదయంలో అట్టడుగున లేచి, ముల్లులాగ అమృతంని పొడిచింది.

ఆ అమ్మాయి భాను తిలకం దగ్గర శెలవు పుచ్చుకున్నప్పుడు తలని కొంచెం వొంచి, మాటాడినప్పుడు పళ్ళ వరుస, పెదిమలు చూస్తే అసలు నిత్యాలాగే ఉంది. తనింతవరకూ జీవించిన పన్నెండు సంవత్సరాలూ కలలుగా మారిపోవాలనే ఊహతో అమృతం కొంచెం సేపు సంచారం చేసాడు. అప్పుడే తిలకం గురక లేతగా వినిపించింది.

మంచెనుంచి దిగి అమృతం వసారాకి నడిచాడు. ఎక్కడ చూసినా చీకటి . . . మౌనం భారంగా ఉంది . . . డిల్లీ నగరంని పాములాగ చుట్టుకున్న Ring Road దూరంలో కనిపించింది; వరుస వరుసగా ఆసుపత్రి భవనాలు కనిపించాయి. వాటి లోపల ఎంతమంది బాధపడుతున్నారో, మూలుగుతున్నారో ఎవరికి తెలుసు? ఆకాశంని గంభీరంగా తాకుతూ అవి మౌనంగా నిలబడి ఉన్నాయి.

“మీరేం చేస్తున్నారు అక్కడ?”

తిలకం లేచినట్టుంది. ఆమె కంఠస్వరం తీక్ష్ణంగా వినబడింది. అమృతం తలుపు మూసేసి లోపలికి వెళ్ళాడు.

“నిద్ర రాలేదు . . . ఉత్తికే నిల్చున్నాను . . . ”

“ఎవరిగురించి ఆలోచిస్తున్నారు?”

తిలకం సగం నిద్రలో, గోడని ఆనుకొని ఉంది. కాని ఆమె కంఠస్వరంలోని కటువు అతన్ని తాకింది.

అతను మంచెంమీద కూర్చున్నాడు.

"చెప్పమంటావా?"

"ఏంటి చెప్పమంటావా?"

"ఎవరిగురించి ఆలోచిస్తున్నానని?"

"నాగురించి అంటే పచ్చి అబద్ధం . . . "

"నీగురించి కాదు . . . "

"అంటే, మరెవరి గురించి?" ఆమె అతన్ని తిరిగి చూసింది. ఆమెకి ఇక నిద్ర రాదు. ఇప్పుడు కాకపోతే మరెప్పుడైనా ఆమెను లేపి చెప్పాలి, అవునా?

"నిన్ను పెళ్ళాడేముందు నాకు ఇంకొక అమ్మాయితో స్నేహం ఉండేది. ఆ అమ్మాయిగురించి ఆలోచించాను."

ఇలా అనగానే అమృతం మనసులో ఊరట కలిగింది.

"నిజంగానా?" తిలకం లేచి కూర్చుంది.

"ఇప్పుడు నేను అబద్ధం చెప్పే మూడ్ లో లేను . . . "

"ఆ Fan ని కొంచెం జోరుగా తిరగనీయండి . . . ఉక్కగా ఉంది . . . "

అక్టోబర్ మాసం చివరలో ఆమెకు ఉక్కగా ఉందంటే అది ఆమె దేహాన్ని బాధించదు. అమృతం Fan ని జోరుగా తిరగవేసి, "లైటు కావాలా?" అని అడిగాడు.

వొద్దని తిలకం తల ఊపింది. అమృతం మేజామీదున్న గడియారం చూసాడు; రేడియం వెలుతురులో మూడు గంటలని తెలిసింది.

"మీగురించి నేను గర్వపడేది ఈ సంగతి ఒకటే . . .  అదీ లేదన్నమాట . . . "

"ఏం సంగతి?"

"ఇంకొక అమ్మాయికి మీతో స్నేహం ఉంటుందని నేను ఆలోచించనే లేదు."

"నీ ఆలోచన ఎలాగున్నా అది నా పొరబాటు కాదు."

"మీరెందుకు ఇది నాకు ముందే చెప్పలేదు?"

"ముందే అంటే . . . ?"

"పెళ్ళైన వెంటనే . . . "

"చెప్తే ఏం చేసి ఉంటావ్?"

"మీ గురించి ఇన్ని రోజులూ నా మనసులో ఒక తప్పయిన ఉద్దేశం ఉందన్నమాట. గభీమని నిరాశ కలిగితే ఆ బాధ ఎలాగుంటుందో మీకు తెలుసా?"

తిలకం ఇలా వాదించడం అమృతం ఎదురుచూడలేదు. ఆమె ఏడ్చి, రభస చేస్తుందనే అతను భయపడ్డాడు. ఆమె తన మనసులోని అలజడిని వివరించి చెప్పడం అతనికి ఒక కొత్త అనుభవం. ఆమెను తేరిపారి చూసాడు.

"ఆమె ఎవరు?" తిలకం అడిగింది. ఆ కంఠస్వరంలోని నిబ్బరం చూసి అమృతంకి కొంచెం భయమూ కలిగింది.

"ఆమె ఇప్పుడు ఇక్కడ లేదు . . . అమెరికాలో ఉంది. పెళ్ళైనతరువాత నేను ఆమెను చూడలేదు."

"ఎవరి పెళ్ళి తరువాత?"

"మన పెళ్ళి తరువాత . . . నువ్వేంటి, లాయరులాగ నన్ను cross examination చేస్తున్నావ్?"

తిలకం మంచంనుంచి దిగింది. వసారా తలుపుదగ్గర నిలబడింది.

"అందుకేనా ఇన్నిరోజులూ మీరు నాతో సరిగ్గా మాటాడాడం లేదు?"

"దానికీ, దీనికీ ఏ పొత్తూ లేదు. మన పెళ్ళి తరువాత ఆమెను చూడలేదంటున్నాను. నువ్వు ఏమేమో అడుగుతున్నావ్ . . . "

"చూడకపోతేనేం? ఆమె జ్ఞాపకం మనసులో నిత్యమూ ఉంది. అది పెద్ద ద్రోహం."

తిలకం మళ్ళీ మంచంలో పడుకున్నాడు. "సరేలే . . . నిద్ర పో . . . రాత్రిపూట జగడం వద్దు."

"ఎందుకు ఇవాళ ఆమె జ్ఞాపకంలో వచ్చింది?"

అమృతం జవాబు చెప్పలేదు.

"నేను చెప్పనా?"

"ఏమిటి చెప్పనా?" అమృతం ఆమెను తిరిగి చూసాడు.

"ఇవాళ సాయంకాలం మీరు ఆ అమ్మాయిని ఇంటిలో దిగబెట్టారే - ఆ అమ్మాయి పేరు భానూ, కూనూ లేక మరేదో - ఆమె తల్లి మీ గతకాల ప్రియురాలు. అందుకే ఆమె తల్లి నటి అని మీకెలా తెలుసని అడగ్గానే మీకు అంత కోపం వచ్చేసింది . . . నాకిప్పుడు అంతా బోధపడింది."

"Nonsense . . . Stop it! . . . నువ్వేమంటున్నావ్? నీకేం పిచ్చి పట్టిందా?"

"మీకెందుకు ఇంత కోపం? నేను చెప్తున్నది నిజం అని మీ మనస్సాక్షికి తెలుసు. ఆమె అమెరికాలో ఉంది, ఆస్ట్రేలియాలో ఉంది అనేదంతా అబద్ధం . . . "

అమృతం మరేం అనక ఊరుకున్నాడు. తిలకం మాటలు విని, కోపంతో అతని దేహమంతా వొణికింది.

వసారా తలుపు తెరిచి బయట నిల్చున్నాడు.

ఇంతకు ముందు అతనికెప్పుడూ ఇంత కోపం రాలేదు.

తనకెందుకు ఇంత కోపం? లేనిది ఒకటి తిలకం కల్పించి చెప్పిందనా? భానుకి వయసు -ఇరవై, ఇరవైరెండు ఉండవచ్చు - అంటే ఆమె తల్లికి వయసు నలభైకి తగ్గువగా ఉండవచ్చు. ఆమెతో తనకి సంబంధం ఉందని తిలకం అన్నప్పుడు తనకి తన వయస్సు మీద కోపం వచ్చేసిందా? ఆ అమ్మాయి తన్ను 'అంకుల్' అని పిలవకూడదా? (పురు యువరాజుకి యయాతి యవ్వనం ఇచ్చినట్టు, తనకని ఏ యయాతి కనిపించలేదు!)

సృష్టిలో యౌవనం ఎంత మధురమైన ఘట్టం! అమృతంకి మొట్టమొదట నిత్యాని కలుసుకున్నది జ్ఞాపకంలో వచ్చింది. రీగల్ సినిమా థియేటర్ లో Three Coins in a Fountain చూసి అతను తిరిగివస్తున్నప్పుడు ఆమె బస్ స్టాపులో నిల్చొనివుంది. కరోల్ బాఘ్ లో తను బస చేస్తున్న ఇంటిలోనే - ఒక విభాగంలో - ఆమె తన తల్లితో ఉందని అతనికి తెలుసు. తరచుగా చూసినా ఎప్పుడూ ఆమెతో మాటాడలేదు.

అప్పుడు అమృతం దగ్గర స్కూటర్ ఉంది. ఆమెను అడిగాడు. ముందు జంకింది, తరువాత సరేనంది.

అప్పుడు తనొక యువకుడు. అందుకే నిత్యా జంకింది.

కాని, ఇవాళ భాను వెంటనే తనతో కారులో రావడానికి ఒప్పుకుంది. కారణం తన వయస్సుగురించి ఆమెకున్న నమ్మకం అన్నమాట . . . ఆమె ఎందుకు కొంచెం వెనుకాడలేదు? ఛీ, ఛీ, ఇవేం పిచ్చిమాటలు! . . . తిలకం పక్కనే ఉందిగా, ఆమె ఎందుకు జంకాలి?

ఆరోజు నిత్యాతో దారితోడు వెళ్లగానే నిత్యా అతన్నితన బసకి రమ్మని పిలిచింది. ఆమె తల్లి ఏమంటుందో అని అమృతంకి భయం. కాని నిత్యా అతన్ని పరిచయం చేసినతరువాత ఆ తల్లి సంతోషంతో స్వాగతం చెప్పింది.

“బస్ లో రావడమంటే నిత్యా రాత్రి పదిగంటలకే వచ్చివుంటుంది . . . .” అన్నారు ఆవిడ.

చాలా అభ్యుదయకరమైన కుటుంబం అని అమృతంకి అనిపించింది. నిత్యా నాన్నగారు పోయిన తరువాత ఆ కుటుంబంని నిత్యా మేనమామ కాపాడారు. అంతవరకూ Intermediate చదివిన నిత్యా తల్లి, M.A., Home Science పూర్తి చేసి డిల్లీలో ఒక కళాశాలలో ఉద్యోగం చేస్తున్నారు.

“ఇక్క డ భోంచేసి వెళ్ళండి,” అని ఆవిడ అన్నారు.

“వద్దండి . . . మీకెందుకు శ్రమ? . . . ”

“ No . . . No . . . మీరు నిత్యాతో మాటాడుతూ ఉండండి, ఒక నిమిషంలో అంతా రెడీ అవుతుంది.”

‘ఒక నిమిషం’ అర్ధగంటైంది. నిత్యా తనతో మాటాడుతూంటే ఆ అర్ధగంట ఒక నిమిషంలాగే తోచింది. నిత్యా ఏదో కంపెనీలో Receptionist గా పని చేస్తోంది. తనూ తరచుగా అమృతంని చూసినట్టూ, చాలా సార్లు అతనితో మాట్లాడాలని ఆలోచించినట్టూ చెప్పింది. అమృతం తన గురించి చెప్పాడు. “నేను Central Services Commission పరిక్షలన్నీ పాసయ్యాను, ఆఖరికి , ప్రభుత్వ సంస్థ అనే యంత్రంలో ఒక పల్లుగా ఉన్నాను” అని అతని మాటలు విని నిత్యా నవ్వింది. అది చూసి అమృతం ఆనందించాడు. నిత్యాకి హబీ ఫొటోగ్రఫీ. తను తీసిన కొన్ని ఫోటోలు చూపించింది. అమృతం “నాకు ప్రత్యేకంగా హాబీ అని అంటూ ఏదీ లేదు - అందమైన, సరసమైన విషయాలలో నాకు అభిరుచి ఉంది!” అని అనగానే నిత్యా మొహం ఎఱ్ఱబారింది.

ఆ రాత్రి భోంచేసి అమృతం ఇంటికి తిరిగివచ్చినప్పుడు పదకొండు గంటలైపోయింది.

## 4

నిత్యాని ఆమె ఇంటిలో దిగబెట్టి వచ్చిన ఆ రాత్రికీ ఈ రాత్రికీ ఎంత భేదం! జీవితమంటే మన కలలూ, అనుభవాలు కరిగిపోవాలా ఏమిటి? ఆనాటి కలగాని నిజమైవుంటే, ఈ రాత్రి తను ఇప్పుడు వసారాలో నిలబడి కలలు కనే నిర్బంధం జరిగివుండదు. ఘటన అనేది జ్ఞాపకంని చిత్రవధ చేస్తుంది. కల కలగానే ఉంటే ఎంత సుఖం! సూటిగా చూడడానికి బదులు రంగురంగుల అద్దలో చూస్తే వస్తువులు ఎంత అందంగా కనిపిస్తున్నాయి!

పన్నెండు సంవత్సరాలు తను గడిపినది నకిలీ జీవితం. తన అభిలాషని ధర్మంగా ఆనుసరించి జీవించని కపట నాటకం. సమాజంని విరోధించుకోకూడదు, సహకరించాలి అనే మనోభావంతో, శాంతి అనే సెపంమీద అబద్ధంతో రాజీపడిన తన దిక్కుమాలినతనం.

తన జీవితం ఇలాగే ముగించిపోవాలా?

అప్పుడు అతనికి తిలకం వెక్కు వినిపించింది: తనే ఏడవాలి. ఆమె ఎందుకు ఏడుస్తోంది?

అతని ఎదుట ఆకాశంని ఆవరించుకున్న భవనాలు మాయమయ్యాయి. ఎక్కడ చూసినా చీకటి. మనసు శూన్యమైపోయింది.

** ** **

తిలకం తన చుట్టూ మౌనం అనే గోడని నిర్మించుకుంది. అమృతం దాన్ని దాటి వెళ్ళడానికి ప్రయత్నించలేదు. ఇలాగే ఒక వారం గడిచిపోయింది.

అవాళ, మాసంలో రెండవ శనివారం. రవీంద్ర భవనంలో అఖిల భారత చిత్ర ప్రదర్శన జరుగుతోంది. వెళ్ళి చూద్దామని అమృతం నిశ్చయించాడు. ‘తిలకంని రమ్మని పిలుద్దామా?’ అని ఆలోచించాడు. ఆమెకు చిత్ర ప్రదర్శనలో అభిరుచి లేదని తెలుసు, కాని తన్ను పిలవకుండా అతను మాత్రం వెళ్ళాడని తెలిసిన తరువాత ఈ మౌనం సాగదు. ఆ తరువాతి రెండు రోజులూ తను చిత్రవధ అనుభవించడం తప్పదు.

తిలకం అన్నం వడ్డించినప్పుడు అమృతం చెప్పాడు: “నేను Art Exhibition వెళ్ళాలనుకుంటున్నాను . . . ”

తిలకం జవాబు చెప్పక ఒక చిన్న గిన్నెలో పెరుగు అందించింది.

"నీకు ఇష్టం అంటే రావొచ్చు . . . "

"నేను రాను . . . "

మంచి వేళ, తను అడిగి తిలకం రానని చెప్పేసింది. అమృతం మనసులో ఉత్సాహం చోటుచేసుకుంది. అదేసమయం ఆమెపై జాలి కూడా కలిగింది.

భోజనం చేసిన తరువాత అమృతం Art Exhibition కి బయలుదేరాడు.

కారులో తను కూర్చున్నప్పుడు మేడమీద నిలబడి కిటికీ ద్వారా తిలకం తన్ను చూస్తోందని అమృతం గ్రహించాడు.

'నేను మళ్ళీ పిలుస్తానని ఆమె మనసులో ఉందా? పిలుస్తే వచ్చేస్తుందేమో?' అనే భయంతో ఆమెను తిరిగి చూడకుండా అమృతం కారు స్టార్ట్ చేసేసాడు.

'అఖిల భారత ప్రదర్శన' అని ప్రచారం చేసారుగాని చాలా రాష్ట్రాలనుంచి చిత్రలేఖనలు రాలేదు. కళలోనూ ఈ పాడు రాజకీయం కుట్ర లేకపోలేదు. ప్రసిద్ధ చిత్రకారులు ఇందులో కలుసుకోలేదు. అఖిల భారత ప్రదర్శనని ఏర్పాటు చేసినది ప్రభుత్వమే. కాని ప్రభుత్వ కమిటీలో ఉన్న సభ్యులకి తమ యోగ్యత, కళానైపుణ్యం గురించి ఏమీ తెలియదని ఈ చిత్రకారుల ఉద్దేశం. ఏవో కొన్ని తప్పిస్తే ప్రదర్శనలో ఉన్నవన్నీ చూడడానికి సగటుగానే కనిపించాయి.

'ప్రళయం' అనే ఒక చిత్రం గొప్పగా కనిపించింది. రంగులన్నీ అకస్మాత్తుగా సంగమం అవుతున్న అద్భుతంలాగ అమృతంకి అనిపించింది. ఎందుకంటే ఆ చిత్రకారుని మరొక సృష్టి సామాన్యంగానే ఉంది. కాని ఇందులోని రంగులన్నీ భావనలుగా, ఎటువంటి ఇతివృత్తం, రూపం లేకుండా లేచివచ్చి సూటిగా అతని హృదయంని హర్షించాయి. ప్రళయం అనే భావంని భౌతికరీతిలో గ్రహించినట్టు ఒక భ్రమ; అమృతం మైమరచి అలాగే నిల్చున్నాడు.

దాన్ని సృష్టించినది పేరు మోసిన చిత్రకారుడు కాదు. కాని అతని అంతరాత్మలో ఇప్పుడు తన మనసులో లాగ ఒక పెద్ద ప్రళయం చోటుచేసుకొని ఉండాలి.

"నమస్తే . . . "

అమృతం తిరిగిచూసాడు. భాను! బక్కపలచని, సుగంధమైన ఆమె దేహంని ఒక ఎఱ్ఱ చీర చుట్టుకొని ఉంది; ఒక నల్ల రవిక; ఆమె నవ్వినప్పుడు కళ్ళుకూడా కలుసుకున్నాయి.

"నేను నిర్ఘాంతపోయాను . . . " అన్నాడు అమృతం.

"ఏం, ఎందుకు?"

తొందరలో తను ఆవేశంలో ఏదో చిటపటలాడినట్టు అతనికనిపించింది. అంతకుమించి దానిగురించి వివరించడానికి అతను సిద్ధంగా లేడు.

"ఇది అద్భుతంగా ఉంది . . . " అని అంటూ అమృతం 'ప్రళయం' ని చూస్తూ నిల్చున్నాడు.

"ఇది బాగుంది."

"నువ్వేంటి ఇంత నిబ్బరంగా చెప్తున్నావ్?"

"ఎదైనా సరే, సామాన్యంగా చెప్తేనే బాగా చెప్పినట్టు అర్థం. తక్కినవన్నీ వ్యర్థం చేసినట్టే లెక్క . . . "

అమృతం ఆమెను చూసి చిరునవ్వు నవ్వాడు. "నువ్వొక Art Critic లాగ విమర్శ చేస్తున్నావ్ . . . "

" No, no . . . please . . . నేను Art Critic కాదు . . . "

"నేను నిన్ను తిట్టడం లేదు . . . కాదనకు . . . "

భాను మళ్ళీ నవ్వింది. ఆమె బుగ్గల్లో గంటులు కనిపించాయి.

"Exhibition ఎలాగ ఉంది?" అని భాను అడిగింది.

"మామూలుగా ప్రభుత్వం నిర్వహించే ప్రదర్శనలన్నీ ఇలాగే ఉంటాయి. గొప్పగా చెప్పడానికి ఏముంది?"

"మీరూ ప్రభుత్వంకి చెందినవారే కదా?"

"నీకెలా తెలుసు?"

"కిద్వాయ్ నగర్ లో బస అంటే సర్కారు శాఖలో ఉద్యోగం అని ఎవరైనా ఊహించగలరు . . ."

తనగురించి భాను ఎవరినైనా అడిగి తెలుసుకుందేమో అనే అనుమానంతో  అమృతంకి నిరాశ కలిగింది. అతని మౌనం గమనించి భాను చెప్పింది.

"నేను మిమ్మల్ని తిట్టలేదు . . . "

అమృతం నవ్వాడు.

ఇద్దరూ రవీంద్ర భవనం వదిలి బయటకి వచ్చారు.

"ఇంటికి వెళ్ళాలి, అవునా?" అమృతం అడిగాడు.

"అవును,  . . . Thanks" అని అతని రెండో ప్రశ్నకి భాను జవాబు చెప్పేసింది.

కారులో కూర్చున్నతరువాత భాను చెప్పింది: "నాకూ Oil Painting లో ఆసక్తి ఉంది."

"అలాగా? నాకు చూడాలని ఉంది."

"ఎక్కువగా లేదు . . . ఏదో కొంచెం . . . మీకు? . . . "

"నాకేం ఆసక్తిలేదు . . . ఏదో, కళ అంటే కొంచెం అభిరుచి ఉంది, అంతే . . . నీ కళకి - సంప్రదాయంకి - ఏం పేరు?"

"ఏ పేరూ లేదు . . . నా మనసుకి ఇష్టం వచ్చినట్టు . . . "

"అంటే నీకు పూర్ణ స్వాతంత్ర్యం అన్నమాట! ఒక సిద్ధాంతంలో చిక్కుకొని బాధపడవద్దు . . . "

"Auntie ఎలాగున్నారు?" అని భాను అడిగింది. ఎందుకు ఈ ప్రశ్న ఆమె అడుగుతోంది?

కారు ఫిరోజ్ షా రోడులో ప్రయాణం చేస్తోంది. అది కర్జన్ రోడు చేరిన సమయంలో ఒక ఫట్ ఫట్ వేగంగా వచ్చి తాకింది.

అమృతం చలాకీగా అది కారుని ఢీకొట్టకుండా ఆపాడు.

"నువ్వు వచ్చినప్పుడెల్లా ఏదో ఒక ప్రమాదం జరగాలి కాబోలు!" అని అమృతం నవ్వుతూ అన్నాడు.

"అందుకు కారణం 'మీకున్న మితిమీరిన ఉత్సాహం కాదని నా ఉద్దేశం!" అని భాను అంది.

ఆ రోజు తిలకం పలకిన మాటలు ఆమె ఇంకా మరచిపోలేదని అమృతంకి బోధపడింది.

"నీకు మంచి జ్ఞాపకశక్తి ఉంది."

"దానివలనే జీవితంలో మనం చూసే ముచ్చటలన్నీ . . . "

అవును. ఎంత నిజం! నిత్యా కూడా ఇలాగే మెరుపు మెరుపులాగ మాటలు విసురుతుంది. ఆమెతో ఆ మొట్టమొదటి కలయిక తరువాత, అమృతం మళ్ళీ ఒక వారం పిమ్మట కలుసుకున్నాడు. Ice Cream Parlor లో ఏదో తింటూ, చెయి నిండా కొత్త సంవత్సర Greeting card లతో నిత్యా కనిపించింది.

"Hello . . . "

"Come on,  మీరూ రండి . . . భోంచెయ్యండి . . . *ఉమ్ కాఫీ దేదో* . . . "

"Thanks . . . మీకు మీ weight గురించి ఏ చింతా లేదన్నమాట . . . "

"నేను బక్కపలచగా ఉన్నానని నా ఉద్దేశం . . . weight ఎక్కాలనే ఇలా తింటున్నాను."

“అలాగైతే, ఇదిగో, ఇంకొకటి . . . ”

“ Okay . . . ”

ఆమె వెంటనే ఏకీభవించడం చూసి అమృతంకి ఆశ్చర్యం కలిగింది.

“మీకు చాలామంది friends ఉన్నారు కాబోలు” అన్నాడు అమృతం ఆమె చెయిలోని కట్ట చూస్తూ.

“అవును. మీకూ ఒకటి వస్తుంది.”

“Thanks! ఈ సంవత్సరం నేనూ ఒక కార్డు కొనాలన్నమాట . . . ”

“అంటే మీకుండేది ఒకే ఒక friend అంటున్నారా?

“అవును” అని అమృతం తలూపాడు.

“దానిగురించి గర్వపడుతున్నట్టు తలూపుతున్నారే?”

“దేనిగురించి? ‘ఒకే ఒక friend’ గురించా?”

నిత్యా అందుకు జవాబు చెప్పలేదు. గభీమని మౌనం దాల్చింది. తను నోరూరక కొంచెం ఎక్కువగా వాగినట్టు అమృతంకి అనిపించింది.

“I like your mother . . . ” అని అమృతం అన్నాడు.

“మా అమ్మకీ మీ గురించి మంచి అభిప్రాయం . . . ”

‘ఆ మంచి అభిప్రాయం తను కాపాడుకోవాలని ఆమె అంటోందా? లేకపోతే . . . ’ ఆ ఆలోచన రాగానే అమృతం మనసులో ఆహ్లాదం చోటుచేసుకుంది.

“మీకు స్నేహితులు ఎవరూ లేరని నాకు అప్పుడే తెలుసు?”

“ఎప్పుడు?”

“ఆ రోజు సినిమాలో చూసినప్పుడు . . . మీ వయస్సులో ఒంటరిగా మరెవరు సినిమాకి వెళ్తారు?”

“మీరూ ఒంటరిగానే వచ్చారుగా?”

“పెళ్ళి కాని యువకుడు ఒంటరిగా వెళ్ళడం, పెళ్ళవని అమ్మాయి ఇంకొకరితో వెళ్ళడం ఎందుకని మనం ఆలోచించాలి . . . ”

“మీరు Oscar Wilde లాగ మాటాడుతున్నారు . . . ”

“Thanks.”

ఇద్దరూ మాటాడుకుంటూ ఇల్లు చేరుకున్నారు. “మీరు మా ఇంటికి రావాలి” అని అమృతం పిలిచాడు.

“ఉండండి . . . అమ్మకి చెప్పి వస్తాను” అని నిత్యా మేడమీదకి వెళ్ళింది.

కొంచెం సమయం తరువాత ఆమె వచ్చింది; ఆమె దుస్తులు మార్చుకుందని అమృతం గమనించాడు.

అతని ఇంటిలో పుస్తకాల బీరువా దగ్గర నిలబడి నిత్యా అమృతం చదివే పుస్తకాలు చూసింది. అమృతం ఆమె పక్కనే నిలబడి నిల్చున్నాడు. ఆమె జడలోని మల్లెపూల వాసన గుగుమలాడింది.

తనకి అందకుండా కొంచెం ఎత్తుగా ఉన్న ఒక పుస్తకం తీసుకోవాలని నిత్యా ప్రయత్నించినప్పుడు అమృతం కావాలనే ఆమె దేహాన్ని తాకుతూ ఆ పుస్తకం ఆమెకు అందించాడు.

“చదివిన తరువాత అది అక్కడే ఉండనీ . . . ” అని అంటూ అమృతం ఆమెను మళ్ళీ తాకాడు. అది ఆకస్మికం కాదని నిత్యాకి తప్పక తెలిసివుండాలి; ఆమె మౌనంగా నిల్చుంది.

మౌనంకి ఉన్న అర్థం అవాళే అమృతంకి బోధపడింది.

అర్థగంట తరువాత నిత్యా అమృతం దగ్గర శెలవు పుచ్చుకొని తనింటికి వెళ్ళింది. మేడమీద నిత్యా తల్లి చాలా సేపు లేదని ఆ తరువాత అమృతంకి తెలిసింది. అది నిత్యాపే అతనికి  ఇంకొక సమయం చెప్పింది.

** ** **

"Driving  చేసినప్పుడు మీకు మాటాడే అలవాటు లేదా?" అని భాను అడిగింది.

"అలాగేం కాదు . . . నువ్వు అన్నావుగా జ్ఞాపకశక్తివలనే జీవితంలో అన్నీ ముచ్చటలూ కనిపిస్తాయి అని . . . దాని గురించి ఆలోచిస్తున్నాను . . . "

"ఆలోచించడానికి చాలా ఉన్నాయన్నమాట . . . "

"అవును . . . ఎన్నో . . . "

భాను అతన్ని చూసి మరేం అనక ఊరుకుంది. కొంచెం సేపు తరువాత అమృతం అడిగాడు: "నేను ఏమిటి ఆలోచిస్తున్నానని నువ్వు ఆలోచిస్తున్నావా?"

భాను వెంటనే జవాబు చెప్పలేదు. నవ్వేసింది. కొంచెం సేపు తరువాత అడిగింది: "ఆ రోజు నేనడిగిన ప్రశ్నకి మీరు జవాబు చెప్పలేదు. ఆ ప్రశ్నకి ఇప్పుడు జవాబు చెప్తారా?"

"ఏం ప్రశ్న?"

"మా అమ్మ నాటకాల్లో నటిస్తుందని మీకెవరు చెప్పారు?"

"కేశవన్ అనే ఒక స్నేహితుడు చెప్పారు . . . 'తల్లీ, కూతురూ కలిసి నా డ్రామా బృందంకి మంచి star value తెచ్చారు . . . ' అని అతను అన్నారు."

"Star value! మీరు వేళాకోళమాడుతున్నారు . . . " భాను తన జుత్తుని ముందుకు తోసి మొనలోని నాడాని సరిదిద్దుకుంది. ఆమె మొహంల్లో ఉపేక్ష కనిపించింది.

"నువ్వొక versatile artist  . . . నీకు రకరకాల కళలతో పరిచయముంది . . . Acing, Painting . . . Dance కూడా తెలుసా?"

"అదీ కొంచెం తెలుసు . . . మా అమ్మ ఒకప్పుడు పేరు మోసిన dancer . . . మద్రాసులో dance చేసిందని విన్నాను . . . "

"మీకు సొంత ఊరు మద్రాసా?"

"కాదు. తిరువారూరు. మా నాన్నగారు అక్కడ స్కూల్లో టీచరుగా పని చేసారు . . . "

"ఆ తరువాత మీరు మద్రాసుకి వచ్చేసారా?"

"అదెలాగో పోనీ . . . ఇప్పుడు నేనేం చేస్తున్నానని crjg అడగరేం? ఎందుకా పాత కథలు?"

తను అడిగిన ప్రశ్నకి జవాబు ఇవ్వడానికి ఆమెకు ఇష్టం లేదని అమృతంకి తెలిసింది.

## 5

"I am sorry . . . నేను మీ కుటుంబ వ్యవహారాల్లో చొరబడుతున్నాను!" అని అమృతం వెనకాడాడు.

"That's all right . . . ఇప్పుడు మా అమ్మ ఒక డాన్సు స్కూలు నడుపుతోంది . . . నేను All India Radio లో పని చేస్తున్నాను . . . మేం డెల్లీకి వచ్చి ఒక సంవత్సరం అయింది . . . "

"వచ్చిన వెంటనే మీకు allotment దొరికిందన్నమాట, మీరు అదృష్టవంతులు!"

భాను నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావ్?"

"ఒక మామూలు సర్కారు ఉద్యోగిలాగ మీరు మాటాడడం చూసి నాకు ఆశ్చర్యంగా ఉంది . . ."

అమృతం తలవంపు భరించలేకపోయాడు. పన్నెండు సంవత్సరాలముందు తనిలాగ మాటాడివుండడు; అతను బస ఉన్న భోజనశాలలో ఎవరైనా స్నేహితులు పదోన్నతి, వేతనం గురించి మాటాడితే అమృతం మండిపడేవాడు. 'జీవితమంతా సర్కారు వ్యవహారాలకోసం అంకితం చేసుకున్న వీళ్లందరూ అల్పసంతోషులు!' అని ఆలోచించేవాడు. ఇప్పుడువ భాను అన్న మాటలు తన చెంపని బలంగా వాయించినట్టనిపించింది.

". . . హూం, వసంతకాలం ఐపోయింది . . . " అమృతం గొణుక్కున్నాడు.

"ఏమంటున్నారు?"

"నాకు ముసలితనం వచ్చేసిందంటున్నాను . . . అందువలనే allotment, retirement గురించి ఈ ఆలోచనలన్నీ . . మనిషికి భద్రత కావాలికదా?"

తనకి తనమీదే జాలి కలగాలని అమృతం అలాగ మాట్లాడాడు. భాను ఏమీ అనక ఊరుకుంది. 'వృద్ధాప్యం వచ్చేసింది' అన్న వాక్యంకి విరుద్ధంగా ఆమె ఏమైనా అంటుందని అమృతం ఎదురుచూసాడు; ఆమె మౌనం బావురుమనిపించింది.

" 'ఆ తరువాత మీ నాన్నగారు మద్రాసు వచ్చేసారా?' అని మీరడిగిన ప్రశ్నకి నేను జవాబు చెప్పలేదు . . . ఎందుకని మీరూ అడగలేదు . . . "

"నేను అడుగుతానని నువ్వు ఎదురుచూసావా?"

"In fact, no . . . కాని ఇప్పుడు ఆ ప్రశ్నకి జవాబు చెప్పాలని ఉంది."

అమృతం మరేం అనక ఊరుకున్నాడు.

భాను చెప్పింది. "మా అమ్మకీ, న్నానగారికీ మధ్య అభిప్రాయ భేదం వచ్చేసింది. పెళ్ళయిన తరువాత మా అమ్మ నృత్యం చెయ్యడం నాన్నగారికి ఇష్టం లేదు. మా అమ్మ నాతో మద్రాసు వచ్చేసింది . . . "

లక్ష్మీభాయ్ నగర్ వచ్చేసింది; అమృతం కారుని రోడు అవధిలో ఆపాడు.

"మిమ్మల్ని కలుసుకున్న రెండవ రోజుల్లో నేనిలాగ మాట్లాడడం మీకు వింతగా ఉందా?"

"In fact, no."

భాను చిరునవ్వు నవ్వింది.

"నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడగవచ్చా?" అని అమృతం అడిగాడు.

"తప్పకుండా . . ."

"మీ సానుభూతి ఎవరికి? మీ అమ్మకా, లేక మీ నాన్నగారికా?"

"నాన్నగారికి . . . నాకు అమ్మ అంటే పగ, ద్వేషం . . . " ఈ మాటలు పలుకుతూ ఆమె కారు కిటికీద్వారా బయటకి చూసింది. సహజంగా ఆమె కళ్ళలో కనిపించే ఆవేశం ఇప్పుడు లేదు; దవడ బిగుంచుకుంది. 'అమ్మ అంటే నాకు పగ, ద్వేషం . . . ' అని ఆమె అన్నది అబద్ధంకాదని తెలిసింది.

"మీ నాన్నగారు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు?"

"ఆఖరివరకూ తిరువారులోనే ఉన్నారు. అతను పోయి ఐదారు సంవత్సరాలైపోయాయి."

"నువ్వు అతన్ని ఆఖరిగా ఎప్పుడు చూసావ్?"

"అమ్మతో మద్రాసుకి వచ్చిన తరువాత అతన్ని చూడనేలేదు; ఆఖరిగా చూసినప్పుడు నాకు ఆరేళ్ళు."

"క్షమించాలి . . . ఆరేళ్ళ వయస్సులో మీ నాన్నగారిగురించి నీకు ఎక్కువగా తెలిసివుండదు, మరి నీకు అతనంటే సానుభూతి అని ఎలా అంటున్నావ్? నీ తల్లిదండ్రుల బంధుత్వం గురించి నీకేం తెలియదు, అవునా?"

“ఇన్ని సంవత్సరాలు అమ్మతో మెలిగిన తరువాత, నాకు ఆ బంధుత్వం గురించి తెలియకుండా ఉంటుందా?”

“You are a smart girl” అన్నాడు అమృతం.

“చాలు, నన్ను పొగడవద్దు . . . నేను నా తెలివితేటలు చూపించడానికి అనలేదు . . . నాకు నిజంగానే అమ్మని వదిలేసాయని ఉంది . . . కాని ఏంచెయ్యాలో తెలీదు . . . ”

అమృతం నిర్ఘాంతపోయాడు: భాను నిమ్మళంగా - దీని గురించి తను చాలా సంవత్సరాలు ఆలోచించినట్టు - ఇదే తన నిర్ణయం అనే కంఠస్వరంలో - నిలకడగా చెప్తోంది.

“ఒక బంధుత్వంని తోసి పారేయడం అంత సులభమైన పని కాదే?” అని అమృతం అడిగాడు.

“మా అమ్మకి ఉన్న ధైర్యం నాకు లేదంటున్నారా?”

“రెండవరోజే మనం ఎక్కువగానే మాటాడేసాం . . . ” అన్నాడు అమృతం.

“మీకు ఆలస్యం ఐపోయింది. అవునా?” అని భాను కారు తలుపు తెరిచింది.

“లేదు, అలాగేం కాదు . . . నీతో నేనివాళ నిష్కపటంగా చాలా కబుర్లు మాటాడానని అంటున్నాను.”

భాను కారునుంచి దిగింది. “మా ఇంటికి వస్తారా?”

అమృతం జంకాడు.

“నేను అమ్మని గురించి చెప్పినది గుర్తుచేసుకొని మీరేం వెనకాడవద్దు . . . రండి, . . . నా paintings చూడవద్దా?”

“ఓ, అవును, మరిచిపోయాను!” అని అంటూ అమృతం కారునుంచి దిగాడు.

“ఆ రోజు మీరు నన్ను ఇంటిలో దిగబెట్టినందుకు మీ ఆవిడకి కోపం కదూ?”

“నిజం చెప్పాలంటే నీ ప్రశ్నకి జవాబు, ‘అవును’.”

“నాకూ అలాగే అనిపించింది . . . By the way, మీకెందరు పిల్లలు?”

అమృతం నవ్వుతూ జవాబు చెప్పాడు: “ ఎందుకు By the way? సూటిగానే అడగవచ్చు . . . నాకు పిల్లలు లేరు . . . మళ్ళీ ‘నాకూ అలాగే అనిపించింది’ అని అనకు . . . నేనది భరించలేను . . . ”

ఇల్లు చేరగానే భాను calling bell నొక్కింది. తలుపు తెరచిన ఆమె తల్లి అమృతంని చూసి కొంచెం కలవరపడింది.

“లోపలికి రండి” అని భాను పిలిచింది.

లోపలికి రాగానే భాను తన తల్లికి అమృతంని పరిచయం చేసింది. ‘Health Ministry లో Deputy Secretary గా ఇతను పని చేస్తున్నారు’ అనే ఆమె మాటలు వినగానే అమృతంకి ఆశ్చర్యం కలిగింది: తనగురించి భాను వివరాలు అడిగి తెలుసుకుందని తెలుసుకున్నాడు.

ఒకానొకప్పుడు భాను తల్లి అందగత్తెగా ఉండేదనే సూచనలు ఆమె మొహంలో కనిపించాయి.

“ఇదిగో, నేను వస్తున్నాను . . . ” అని అంటూ భాను లోపలికి వెళ్ళింది.

“ఇలాగ వచ్చి కూర్చోండి . . . ” అని భాను తల్లి ఒక కుర్చీ చూపించింది.

ఆవిడ అమృతంకి ఎదురుగా కూర్చున్నారు. ఇంటిలో ఉన్నప్పుడుకూడా ఆవిడ కొంచెం అమితంగానే అలంకరణలో కనిపించడం చూసి అమృతంకి ఆశ్చర్యం కలిగింది. మంచి శక్తివంతమైన కళ్ళు; నృత్యకళలో దీర్ఘకాలికంగా ఆవిడకున్న అనుభవం మొహంలో బాగా తెలిసింది. చూడగానే ఆకర్షించే చిరునవ్వు - మరి యౌవనంలో ఎలాగ ఉండేవారో? ‘సరే, ఇక నీ బతుకంతా ఈ తిరువారూరులో - ఈ ఇరుకైన గ్రామంలోనే . . . ” అని ఆ అందగత్తెకి చెప్తే, ఆవిడకి ఎలా ఉంటుంది - అందులోనూ, ఒక బడి పంతులుతో కాపురం చేసినప్పుడు? కొత్త రాజ్యాలు జయించాలనే ఆవిడ పట్ణంకి వచ్చారన్నమాట!

భానుకి తల్లితో సమరస బంధుత్వం లేకపోవడంలో ఆశ్చర్యం లేదు. భాను తన్ను తండ్రి కూతురుగా భావించి ఉండాలి. ఎదుట కనిపించే తల్లిని అసహ్యించుకొనే  ఏ కూతురైనా సరే, కళ్ళకి కనిపించని తండ్రిని ఆదర్శవ్యక్తిగా కల్పన చేసుకొని ఆ ప్రతిరూపంని కొనియాడడం సహజమేకదా?

భాను కాఫీ తీసుకొని వచ్చింది.

"ఓ, Thanks! . . . Paintings?" అని అమృతం అడిగాడు.

"పొగడ్త కావాలంటే లంచం ఇవ్వాలిగా? అందుకే కాఫీ!"

అమృతం కాఫీ తాగాడు.

"ఎంత అధ్వాన్నమైన పఠం చూసినా, ఈ కాఫీ తాగిన తరువాత  'పఠం బాగా లేదని చెప్తే అది మహా పాపం' . . . " అన్నాడుఅమృతం.

"మీరిప్పుడు కాఫీ గురించి చెప్పినది నిజమా, లేక అబద్ధమా?" అని అడుగుతూ భాను లోపలికి వెళ్ళింది.

"కాఫీ పొడి ఏం గొప్పగా లేదే, మరి కాఫీ ఎలాగుంటుంది?" అని భాను తల్లి అడిగారు.

"నా మాట వినండి . . .  కాపీ నిజంగానే చాలా బాగుంది!"

అలా అంటూనే అమృతం మేజామీదున్న ఒక స్మారకసంచికని తీసుకొని పేజీలు తిరగవేసాడు. అందులో భాను తల్లి ఫోటో ఉంది. పేరు జానకి రామచంద్రన్. కరోల్ భాగ్ లో నాట్య ప్రదర్శన జరిగినప్పుడు వెలుబడిన సంచిక అది.

"భానుకి మిమ్మల్ని ఎలాగ తెలుసు?" అని జానకి అడిగింది.

"ఆ రోజు నేను నాటకంకి వెళ్ళాను; భానుని కారులో ఇంటిలో దిగబెట్టాను . . . మీకు భాను చెప్పలేదా?"

"లేదు . . . మీరెక్కడ ఉంటున్నారు?"

"కిద్వాయ్ నగర్."

"దగ్గరే అన్న మాట . . . కుటుంబంతో ఉంటున్నారా?"

"అవును . . . నేనూ, నా భార్య మాత్రం . . . పిల్లలు లేరు . . . "

"పెళ్ళి ఇప్పుడేనా అయింది?"

అమృతం నవ్వాడు: "బాగుంది! నన్ను చూస్తే ఇప్పుడే పెళ్ళైనవాడులాగ కనిపిస్తున్నానా? నాకు పెళ్ళయి ఒక పుష్కరం అయింది."

"అలాగా?" జానకి కంఠధ్వనిలో కనిపించే ఆశ్చర్యం దగా అని అమృతంకి బోధపడింది.

అప్పుడే భాను తను పూసిన కొన్ని పఠాలు తీసుకొని వచ్చింది.

"ఓ, నీ పఠాలా?" జానకి ప్రశ్నలో సగం గర్వం, సగం హేళన!

పఠాల్లో కొన్ని చూడడానికి సగటుగానే కనిపించాయి.

"You have the flavor" అన్నాడు అమృతం.

"నిజంగానా? Thank you!" అంది భాను.

"కాఫీ లంచం కాదు. కాని కాఫీ, ఈ చిత్రాలు చూసే అనుభవం - రెండూ లంచం కిందే లెక్క . . . "

"ఎందుకు లంచం?" అని భాను అడిగింది.

"నాకు తెలీదు . . . " అని భుజాలు విదల్చుకుంటూ అమృతం లేచాడు.

"ఏంటీ, మీరు ఇప్పుడే వెళ్ళాలా?"

"అవును, టైమైంది."

"ఒక రోజు మీ ఆవిడతో రండి . . . " అని జానకి చెప్పింది.

"వస్తాను."

భాను సాగనంపడానికి అమృతంతో కారు వరకూ వచ్చింది.

"మళ్ళీ ఎప్పుడు కలుసుకుందాం?" అని అమృతం అడిగాడు.

భాను జవాబు ఇవ్వలేదు.

"రేపు ఆదివారం కదా? సాయంకాలం కలుసుకుందామా?"

దానికీ భాను జవాబు ఇవ్వలేదు.

"I am sorry . . . నీకిష్టం లేదంటే . . . "

భాను ఇప్పుడు అతన్ని ఆపింది. "మీ ఇంటి ఫోను నంబరు ఇవ్వండి . . . నేను ఫోను చేస్తాను . . . "

అమృతం చెప్పాడు; ఆమె రెండుసార్లు దాన్ని తనలో వల్లించుకుంది.

"Tata . . . Bve . . . Bve . . . "

అతని కారు లక్ష్మీ భాయ్ నగర్ మూల చేరుకున్నవరకూ భాను అక్కడే నిల్చొని ఉంది.

** ** **

అమృతం మనసులో గభీమని పన్నెండు సంవత్సరాలు దులిపి పారేసిన సంతోషం చోటుచేసుకుంది. కాని తను ఇప్పుడు కోలుకున్న ఆ మనస్తత్వంకి తన భౌతిక దేహం సర్దుకొని పోవడం సాధ్యమా? ఇదొక పరీక్ష . . . మార్పులు లేకుండా సాగుతున్న తన జీవితంకి ఇష్టమైన ఒక మార్పు కాబోలు. . .

భాను నిత్యాలాంటి అమ్మాయా? అలా కాదంటే ఇదీ తన మనసు కల్పించుకున్న భ్రమ అనవచ్చా?

అమృతం ఇల్లు చేరుకున్నప్పుడు చీకటి బాగా కప్పేసింది. అతను తలుపు తెరిచి ప్రవేశించినప్పుడు తిలకం జుత్తు చింపిరిగా కనిపించిచడం వలన ఆమె నిద్రనుంచి అప్పుడే లేచిందని గ్రహించాడు.

లోపలికి వెళ్లి అమృతం దీపం వెలిగించాడు. మేజామీద సాయంకాలం వచ్చిన 'హిందు' పత్రిక కనిపించింది. దాన్ని తీసుకొని మేడమీదకి వెళ్ళాడు.

తిలకం కాఫీ తీసుకొని వచ్చింది.

"కాఫీ వద్దు."

తిలకం కాఫీతో లోపలికి వెళ్ళిపోయింది. ఆమె మౌనం చూసి అమృతంకి చిరాకు కలిగింది. ఎందుకని అతనికే అర్థం కాలేదు.

లోపల తిలకం దీపం ఆర్పడం అమృతం చూసాడు; తిలకం మళ్ళీ నిద్రపోతోంది కాబోలు.

తిలకం ఎందుకిలా ఉంది? పెళ్ళైన తరువాత, జీవితంలో, 'అందంకి చోటు లేదు' అనే ఒక పిచ్చి నమ్మకం; ముప్పైయేళ్ళలో తన్ను వయోజన జీవితంకి సిద్ధం చేసుకొనే మనోభావం; తనకిగాని, తన భర్తకిగాని వ్యక్తిగత జీవితం అని ఏమీ ఉండదు అని బలవంతంగా నమ్మే బోళాతనం. ఇప్పుడు ఏం కొంప మునిగిపోయిందని? కొప్పు విరియబోసుకొని కైకేయి, దశరధుడిని వరాలు కోరుతున్నట్టు, తిలకం చీకటిలో నిద్రపోతోంది . . . ఇంటిని కప్పుకున్న చీకటి అమృతం మనసులోని శూన్యంని ఇంకా ఎక్కువ చేసింది.

కింద, ఆడుకున్న పిల్లల సందడి మెల్లమెల్లగా తగ్గుతూ వచ్చింది. ఇంటిని ఆవరించుకున్న ఏకాంతం, చీకటి, తన భావనలలో చిక్కుకొని, తహతహలాడుతూ, భరించే మౌనం - ఇవన్నీ కలిసి అమృతంని అతని యౌవనదశకి తీసుకొని వెళ్ళాయి.

** ** **

కుంభకోణం నాగేశ్వరన్ కోవిల సన్నిధి వీధి; ఎదురింటిలో రెండు పడుచు వితంతువులు - అక్కా, చెల్లెలు -భవనం లాంటి ఆ పెద్ద గృహంలో ఉండేవారు. రాత్రి ఏడు గంటలకే ఆ ఇంటి దీపాలు ఆర్పేయడం అమృతం గమనించాడు. అప్పుడు వాడికి వయస్సు పదిహేను, లేక పదిహారు . . .

వాడు ఒక రోజు వాళ్ళని అడిగాడు: "మీరెందుకు ఇంత త్వరగా నిద్రపోతున్నారు?" చిన్న అమ్మాయి నవ్వుతూ జవాబు చెప్పింది. "భోంచెయ్యాలి, నిద్రపోవాలి . . . భోంచెయ్యాలి, నిద్రపోవాలి . . . భోంచెయ్యాలి, నిద్రపోవాలి . . . ఇంతకు మించి మాకేం ప్రారబ్ధం ఉంది? ఇలాగే జీవితం సాగితే మా బతుకూ ఐపోతుంది. ఈ ఇంటికి దీపాలు కావాలా ఏమిటి?"

జీవితమనేది కాలండర్ని అనుసరించి, రోజులు గడపడమా? చావుని ఎదురుచూస్తూ మనల్ని సిద్ధం చేసుకొని అభ్యసించే పొడుగాటి పాఠమా?

## 6

"మీకేం పిచ్చా? ఎందుకిలా మతి పోయింది?" అని తిలకం చిరచిరలాడింది. ఆమె అలాగ అడుగుతుందని ఎదురుచూసినట్టు అమృతం మౌనంగా మంచం పక్కన వచ్చి నిల్చున్నాడు.

"అవాళ దాన్ని చూడగానే నాకు తెలిసిపోయింది - అది మన కొంప ముంచుతుందని . . . "

కోపంలో తిలకం మొహం ఇంకా పెద్దదిగా కనిపించింది. కన్నులు, పెదిమలు, వొణికాయి.భరించలేని కోపంలో దేహం లేతగా ఊగింది.

"ఎందుకు ఇప్పుడు వచ్చారు? అక్కడే ఉండాల్సింది . . . "

"రావడం పొరబాటు అని ఇప్పుడే తెలిసింది . . . "

" 'రావడం పొరబాటా?' . . . ఏమన్నారు? . . . రావడం పొరబాటా?" తిలకం మంచంనుంచి దిగివచ్చి అతన్ని బలంగా కదల్చింది.

ఆమెకు ఇంత కోపం వచ్చి అమృతం చూడనేలేదు. ఆమె ఆవేశం ఆత్మరక్షణకోసం పోరాడే మృగంలాగ ఉంది. పెళ్ళయి, పన్నెండు సంవత్సరాల తరువాత కూడా సంతానం లేదనే నిరాశ; అందువలన భర్తకి తనంటే విసుగు కలుగుకుందనే దిగులుతో ఏ చిన్న పని చేసినా అందులో తత్తరపాటు, తొందర; ఆమె ఎందుకోసం భయపడిందో అది జరిగి, భర్త కూడా నిష్కపటంగా ఒప్పుకున్నాడనే కారణం వలన ఉద్రేకంతోబాటు, ఇప్పుడు అన్ని భావనలూ ఆమె కంఠస్వరంలో మ్రోగాయి. అతని దేహాన్ని బలంగా కదల్చిన తరువాత తిలకం రెండు చేతులతో తన కళ్ళు మూసుకుంది; త్వరగా ఇంకొక గదికి వెళ్ళి తలుపు మూసుకుంది.

ఒక పెద్ద గాలి వాన వచ్చి అణగింది. ఇంతవరకూ చలనం లేని జీవితంలో ఈ ఘటన వలన ఇద్దరికీ మంచిదే. భార్యాభర్తలు అనే నిర్బంధం వలన ఇంతవరకూ అలవరించుకున్న నకిలీ విలువలని తోసిపారేసి ఇద్దరూ ఒకరినొకరు సముచితంగా తెలుసుకోవడానికి ఇదొక మంచి తరుణం.

తిలకం తన్ను తీవ్రంగా విమర్శించి ఉంటే ఇది ఆమెకు బోధపడివుంటుంది. తనకి భర్త అంటే ఎందుకు విసుగు అనే ఉద్దేశం ఆమెకు రానేరాదు; వచ్చినా దానిగురించి ఏ ఆలోచనా ఉండదు; ఆలోచించినా బోధపడదు; బోధపడినా ఏకీభవించదు. అవును మరి, ఏకీభవించిందంటే మన భారత సంప్రదాయం, ప్రతిష్ట ఏమౌతాయి?

అతనుగాని తిలకంకి నిజమేమిటో చెప్పలేదంటే? తిలకంని మించి తన మనసులో మరెవరికీ చోటు లేదు అనే అబద్ధంకి సాంప్రదాయక అర్హత ఇచ్చి ఆమెను మోసగించవచ్చు. తను చెప్పేది అబద్ధం అని తెలిసినా, తన మనసుని శాంతపరచుకుంటే, తిలకం ఓదార్పుతో వచ్చి భర్త భుజంమీద వాలుతుందేమో, ఎవరికి తెలుసు? కాని, తనెందుకు అబద్ధం చెప్పాలి?

అమృతం చెప్పులు మాత్రం వదిలేసి దుస్తులు మార్చకుండా అలాగే మంచంలో పడుకున్నాడు.

భానుమీద తనకెందుకు ఇంత ఆసక్తి? ఆమెను చూస్తే నిత్యా జ్ఞాపకంలో వస్తోందనా? లేకపోతే ఆ జ్ఞాపకం వలన నిత్యా గురించి తన యింపైన కల గడచిన యౌవనంకి చిహ్నంగా, మనసులో సుగంధమైన మొలకలుగా వికసించడం వలనా . . . ?

తను మళ్ళీ ఆ యౌవనదశలో లాగ జీవించడం సాధ్యమా? అదే కల్పన, అవే అభిలాషలు, భావనలు తనకే ప్రత్యేకమైనవి అనే మనోభావం స్వాధీనము చేసుకోవాలి; ఆ ఆ నిమిషాల్లో ఆ ఆ నిమిషాలకోసం జీవించే అసాధ్య సాహసం తనకుందా?

ఒక సారి, నిత్యాతో అమృతం హుమయూన్ సమాధికి వెళ్ళాడు. మార్చ్ మాసం, వెచ్చని వేసవిలో, పిల్లగాలి దేహాన్ని తాకుతుంటే ఇద్దరూ సమాధిని చుట్టూ తిరిగిచూసారు. ఒక చెయితో గాలిలో తేలుతున్న చీర కొనని పట్టుకొని, ఇంకొక చెయితో తన నెత్తిమీద పడి కళ్ళని ముద్దాడే జుట్టుని వెనక్కి తోస్తూ నిత్యా నడిచింది.

“ఈ ముస్లిమ్ రాజులకి చరిత్రలో వర్ధిల్లాలని ఎంత పట్టుదల?” అని విస్తుపోయింది నిత్యా.

“ఆ పట్టుదలే ఇక్కడ మనకి కళగా కనిపిస్తోంది!” అన్నాడు అమృతం.

“హుమయూన్ గురించి గొప్పగా చెప్పుకోడానికి ఏముందని? కాని అతనికీ ఇంత మంచి సమాధి!” అంది నిత్యా.

“మీరేమంటున్నారు? . . . వినండి, హుమయూన్ గురించి చెప్తాను . . . అతను చావునుంచి తప్పించుకోని, రాజుగా పరిపాలన చేసి, మళ్ళీ ఓడిపోయి, మళ్ళీ గెలిచి . . . అతని జీవితం ఒక నాటకం లాగ - very interesting! Survival Instinct అని విన్నారా? అలాంటిది మరెవరికీ లేదు!”

“హుమయూన్ దగ్గర మాత్రం ఎందుకు? Survival Instinct అన్ని జీవులకీ ఉంది . . . అదొక Biological fact, అవునా? ”

“ . . . Biological అనగానే నాకు జ్ఞాపకం వచ్చింది . . . Nitya, I love you . . . ”

“Shut up” అని నిత్యా ప్రేమతో అతన్ని మందలించింది.

ఆ పెద్ద సమాధి నేలక్రింద, చుట్టూ, చిన్న చిన్న గదులు - శవాలని భద్రపరచే గోయిలు - ఉన్నాయి. వరుసగా వాటిని చూస్తూ ఇద్దరూ బయటకి వచ్చారు.

“ఇవన్నీ ఎవరికోసం?” అని నిత్యా అడిగింది.

“నీకు తెలీదా? మొగలాయ సుల్తాను అంతఃపురంలో అతనికి ఆరువందలు రాణీలు ఉండేవారు . . . ”

“నాకు మీ మాటల్లో లేతగా అసూయ కనిపిస్తోంది . . . ” అని అంటూ నిత్యా అతని చెవిని మెలికింది.

అమృతం నవ్వాడు.

ఒక గదిలో ముందుగా ప్రవేశించిన నిత్యా, గభీమని, నివ్వెఱబోయి, వెనక వచ్చిన అమృతంని తోసుకుంటూ బయటకి వచ్చింది.

“ఏమైంది నీకు? ఎందుకు తొందర?” అని అమృతం అడిగాడు.

“ఈ చిన్న గదుల ఉపయోగం ఏమిటో నాకిప్పుడే తెలిసింది . . . ” అంది నిత్యా.

“ఏం ఉపయోగం?”

“లోపల ఒక అమ్మాయి, అబ్బాయి, ఉన్నారు. వాళ్ళని అడగండి.”

అమృతం చిరునవ్వు నవ్వాడు.

ఇద్దరూ ఇంకోగ గదిలో ప్రవేశించినప్పుడు అమృతం చెప్పాడు: “ఇక్కడ మనం ఒంటరిగా ఉన్నాం అనిపిస్తోంది.” తిలకం తెచ్చిపెట్టుకొన్నకోపంతో అతన్ని తిరిగి చూసింది.

తెల్లని పట్టు చీరలో ఎర్ర పుష్పాలు; రెండు భుజాలనీ బిగువుగా మడచుకున్న రవిక; ఆమెలో కనిపించే దొంగ కోపం - ఇవన్నీ ఒక క్షణం అమృతంని పారవశ్యంలో ముంచేసాయి. అతను తన పరిసరాలు మరిచిపోయాడు. ఈ నిమిషం కంటే మరేం నిజం కాదు. గభీమని ఆమె చేతులు అందుకున్నాడు.

“సాహెబ్ . . . ”

“సాహెబ్ . . . ”

ఎక్కడనించో - వెయ్యి మైళ్ళ దూరంలో - ఒక పిలుపు వినిపించింది. లేదు - చరిత్ర సైగచేసి ఏమైనా చెప్తుందా? పక్కనే ఒక ముస్లిమ్ సేవకుడు నిల్చొని ఉన్నాడు. తనొక హుమాయూన్ గా మారిపోయాడేమో? . . . అంటే . . .

గభీమని నిత్యా పట్టు వదలుకొని దూరంలో నిలబడింది.

‘దేవుడా, ఇదేం పిచ్చి పని! ఇదొక పవిత్ర స్థలం’

అమృతంకి తను హుమయూన్ గా మారలేదని తెలిసింది. సర్కారు విధి ప్రకారం అతను ఒక నేరం చేసేసాడు. పవిత్ర స్థలంని అవమానించిన పాపం. ఆ ముస్లిమ్ సేవకుడు, కావలివాడు  ఫిర్యాదు చేస్తే అవమాసం, అపరాధం తప్పదు . . .

“వాడికేమైనా ఇవ్వండి . . . ” అంది నిత్యా.

“తీసుకుంటాడా?”

ఎందుకు తీసుకోడు? ఆ పక్క గదిలో నేను చూసానుగా? వాడికి తెలియకుండా ఇవన్నీ జరుగుతాయా?”

“అవును, నువ్వు చెప్పేది నిజం!” అని అంటూ అమృతం ఒక ఐదు రూపాయల నోటు ఆ కావలివాడికి ఇచ్చాడు.

“ఆప్ కా బీబీ హై?” అని అడిగాడు ఆ ముస్లిమ్ సేవకుడు, నిత్యాని చూస్తూ.

“హా జీ . . . ”

కావలివాడు అంతరాత్మ ఎక్కువగా బాధ పడలేదు; ఆ ఐదు రూపాయలు తీసుకున్నాడు.

“అయ్యో, దేవుడా, ఈ సమాధి దగ్గరా మీకు ఈ  ప్రేమానురాగాలు రావాలి?” అని అడిగింది నిత్యా, ఆ గదినుంచి బయటకి రాగానే.

“సమాధిని చూడగానే ‘అందరూ ఆఖరికి అనుభవించేది ఇది’ అని జ్ఞాపకం వస్తోంది. అప్పుడే దేహమూ తొందర పడుతోంది . . . అదేం పొరబాటా?” అని అమృతం అడిగాడు.

ఆ రోజు తను చేసినది సాహసం అనవచ్చు. కాని ఇప్పుడు దానిగురించి ఆలోచించిచూస్తే అది వెర్రితనం అనిపిస్తోంది. ఇప్పుడు ఆ దినంలాగ కాపలావాడిదగ్గర చిక్కుకుంటే, తను జంకకుండా మాటాడం సాధ్యమా? శరీరంకి వయసు పెరగడం వలన మెదడుకీ వయసు పెరుగుతోందా, లేక మెదడుకి వయస్సు పెరగడం వలన శరీరమూ దెబ్బ తింటోందా?

Calling bell ఎవరో నొక్కారు. అమృతం లేచి వెళ్ళి తలుపు తెరిచాడు.

“తిలకం ఉన్నారా?”

పొరుగున నివసించే Mrs. అయ్యర్ అడిగింది.

“లేదు!” అని చెప్పేయాలని అమృతం ఒక క్షణం ఆలోచించాడు. వద్దు, ఆవిడ రాక వలన ఇంటిలోని వాతావరణం మారవచ్చు.

“లోపలికి వచ్చి కూర్చోండి, నేను పిలుస్తాను . . . ” అని హాలులో దీపం వెలిగించాడు.

తిలకం మూసుకున్న తలుపు తట్టాడు.

“తిలకం, Mrs. అయ్యర్ వచ్చారు”  అని చెప్పి హాలుకి తిరిగి వచ్చాడు.

“ఏంటి, అప్పుడే నిద్రపోతున్నారా?” అని Mrs. అయ్యర్ అడిగింది.

ఈ ప్రశ్నకి అమృతం జవాబు చెప్పలేదు.

“ఇవాళా, రేపూ మీ ఆయన బొత్తిగా కనిపించడం లేదే?” అని అడిగాడు.

“అతనికి ఆఫీసులో బోలెడు పని . . . ఇంటికి వచ్చేసరికి రాత్రి ఎనిమిది గంటలవుతుంది . . . ”

ఈ మాటలు పలుకుతుంటే Mrs. అయ్యర్ స్వరంలో గర్వం మ్రోగింది. అయ్యర్ లేకపోతే కేంద్ర సర్కారు పరిపాలన కొయ్యబారిపోతుందనే ఉద్దేశంతో ఆవిడ అన్నారు.

"Fiat కారు అమ్మేసి Ambassador కొనేసారు, అవునా?"

'తిలకం ఎందుకు ఆలస్యం చేస్తోంది?' అని అతనికి చికాకు కలిగింది. ఈ అనావశ్యక మాటలు ఎందుకని?

"అవునండీ . . . Ambassador family car కదా? నలుగురు పిల్లలు . . . Fiat చాలదు . . . "

"మామీ, రండి . . . "

మంచి వేళ, తిలకం వచ్చేసింది.

"అప్పుడే నిద్రపోయారా?"

"ఒళ్ళు బాగా లేదు . . . ఏమిటి సంగతి, మీరిప్పుడు వచ్చారు?"

"ఏం, రాకూడదా?"

"అలాగేం కాదు . . . 'మామూలుగా మీరు రారని' అన్నాను . . . "

"మరేం లేదు. రేపు రీగల్లో ఒక తమిళ సినిమా . . . మా ఆయన ముందు వస్తానన్నారు, ఇప్పుడు రానంటున్నారు . . . ఒక టికెట్టు ఉంది . . . మీరు వస్తారా అని అడగడానికి వచ్చాను . . . "

తిలకం అమృతంని చూసింది; అతను ఏమీ అనక ఊరుకున్నాడు.

"మీ ఆవిడకి permission ఇవ్వండి . . . " అని Mrs. అయ్యర్ నవ్వుతూ చెప్పింది.

"నేను permission ఇవ్వాలా? దాని ఇష్టం . . . " అన్నాడు అమృతం.

"నేను వస్తాను . . . " అంది తిలకం.

"సరే, మీరు ఎనిమిది గంటలకి మా ఇంటికి వచ్చేయండి"అని చెప్పి Mrs. అయ్యర్ లేచింది.

"నేను drop చెయ్యనా?" అని అమృతం అడిగాడు.

"వద్దు. నాకిప్పుడు diving liense ఉంది. ఇప్పుడెల్లా నేనే driving చేస్తున్నాను. మీరు కూడా తిలకంకి నేర్పించండి."

"అదెప్పుడూ ఇతనికి వీలుకాదు . . . " అంది తిలకం.

"నాకు మా ఆయనే driving నేర్పారు . . . " అని అంది Mrs. అయ్యర్, గర్వంగా.

Mrs. అయ్యర్ రాకతో తనకి ఒక కొత్త ప్రశ్న వచ్చి చేరిందని అమృతంకి బోధపడింది. ఇటీవల తనకి driving నేర్పించమని అమృతంని హారం చేయడం తిలకం అలవాటు చేసుకుంది.

"నీకు చేతకాదు . . . "

"ఎందుకలా అంటున్నారు?"

"నీకు ముందు జాగ్రత్త లేదు . . . నువ్వు ప్రాణంతో ఉండాలని నా ఆశ . . . "

తిలకంలోని నిష్కపట భావం ఈ జవాబుతో ఏకీభవించింది.

కాని Mrs. అయ్యర్ driving నేర్చుకున్న తరువాత తిలకం తన్ను క్షమించడం అసాధ్యం.

నిత్యా అద్భుతంగా కారు నడిపేది. ఆమె మేనమామ తనకి driving నేర్పారని చెప్పింది. ఆమెకు ఎప్పుడూ మెల్లగా కారు నడపడం తెలీదు, కాని ఎంత వేగంగా వెళ్ళినా కారు మంచి అదుపులో ఉంటుంది.

ఒకసారి తన స్నేహితుడు నాగరాజన్ దగ్గరనుంచి కారు తీసుకొని అమృతం నిత్యాతో అలిగార్ కి వెళ్ళాడు. నిత్యా తల్లికి అలిగార్ విశ్వవిద్యాలయంలో ఏదో పని. నిత్యాయే కారు నడుపుతూ వచ్చింది.

“జాగ్రత్త,  . . . మెల్లగా వెళ్ళు . . . ” అని ఆ తల్లి దారంతా చెప్పుతూ వచ్చింది.

“ఈ వేదాంతమే మన దేశంని తారుమారు చేసింది!” అని విసుగ్గుంటూ నిత్యా కారుని ఇంకా వేగంగా నడిపింది.

అలిగార్ విశ్వవిద్యాలయంలో తల్లిని దిగబెట్టిన తరువాత నిత్యా అమృతంకి చెప్పింది: “ఇక మనం అలిగార్ నగరంని చూద్దాం, రండి!”

“సాయంకాలం ఏడు గంటలకి నా పని అయిపోతుంది. అంతకు ముందు మీరు వచ్చేయండి . . . ” అని తల్లి చెప్పింది.

“ఇక్కడ, పక్కనే ఒక గ్రామంలో గత మాసం మా ఆఫీసులో రిటైరయిన ఒక నౌకరు ఉన్నాడు. అతన్ని వెళ్ళి చూద్దామా?” అని అలిగార్ వీధుల్లో ప్రయాణం చేసినప్పుడు నిత్యా అడిగింది.

“తప్పకుండా  . . . ”

కాని ఆ గ్రామం వెళ్ళడానికి ఒక పచ్చిక పొలం దాటాలని, కారు అక్కడకి వెళ్ళడం అసాధ్యం అని అక్కడున్నవారు కొందరు చెప్పారు.

“మనం తప్పకుండా వెళ్ళాలా?” అని అమృతం అడిగాడు.

“మీరు రావద్దు. మీదగ్గర అలిగార్ తాళం ఉండనీ . . . నేను మాత్రం చూసి వస్తాను . . . ”

‘అలిగార్ తాళం’ అని ఆమె అన్న మాటల్లోని హేళన అమృతం గ్రహించాడు.

“ఎలా వెళ్తావ్?” అని అడిగాడు.

గభీమని గత రెండువందల సంవత్సరాలముందు చరిత్రలో ప్రవేశించినట్టు ఒక చదరమైన ఆకారంలో, వెదురు కాపులతో, ఒక గుర్రం జట్కా బండి దారిలో కనిపించింది.

“ఇందులో వెళ్ళకూడదా?” అని నిత్యా అడిగింది.

“ఇందులోనా?” అని భ్రమతో అమృతం అడిగిన ప్రశ్న విని నిత్యా నవ్వింది.

“మీరెందుకూ పనికిరాని మనిషి . . . ” అని నిత్యా విసుగ్గుంది.

“సరేలే, నేనూ వస్తాను.”

గ్రామం వెళ్ళడానికి బండివాడు ఐదు రూపాయలు అడిగాడు. నిత్యా బండిలో ఎక్కి కూర్చుంది. ఆమె ఎక్కి కూర్చున్న వాలకం చూసి అమృతంకి ఆశ్చర్యం కలిగింది. అతనికది అంత సులభంగా లేదు.

“నీ సమర్థత చూస్తే నాకు కొంచెం భయంగా ఉంది!” అని అమృతం అన్నాడు.

నిత్యా నవ్వింది.

అసలు నడవడానికే అసాధ్యమైనట్టు కనిపించే ఆ బాటలో - చీలికలూ, గుంటలూ నిండిన ఆ నేలంతా  తనకి కంఠస్థం అనే ధోరణిలో - అజాగ్రత్తగా ఆ గుర్రం ప్రయాణం చేసింది.

“నేనెందుకూ పనికిరానివాడని నీకు రుజువు చెయ్యడానికి ఇంకా ఎంత త్యాగం చెయ్యాలో?” అని అమృతం అన్నాడు.

“నాకీ గుర్రంబండి ప్రయాణం చాలా నచ్చింది” అని నిత్యా చెప్పింది.

ఆమె నిజంగానే సంతోషంగా ఉందని మొహంలో సూచనలు కనిపించాయి. తలెత్తి ఆమె ఆకాశంని చూస్తోంది. కళ్ళు సగం మూసుకొని ఉన్నాయి. మొహంలో చిరునవ్వు. తనొక చిత్రకారుడు కాదని అమృతం బాధపడ్డాడు.

సాయంకాలం ఐదవగానే ఆకాశం ప్రకాశంగా, వెండిలాగ, పూసినట్టనిపించింది. కొన్ని పక్షులు బిందువులు లాగ కనిపించాయి. అమృతం మనసులో ఆహ్లాదం చోటుచేసుకుంది.

“త్యాగం అని నేను ముందన్నమాట వాపసు చేసుకుంటాను; ఇప్పుడే తెలిసింది - ఇది ఎంత మనోహరమైన స్థలం అని . . . ”

"మీ వాలకమంతా తాబేలు లాగ . . . " అని అంది నిత్యా.

గ్రామం వచ్చేసింది; ఈ ఇరవైయ్యో శతాబ్ద నాగరికత వలన ఎటువంటి తాకుడు లేని గ్రామం; ఊరు మట్టి గోడలమధ్య నలభై ఇళ్ళు ఉండవచ్చు.

నిత్యా చూడాలని వచ్చిన ఆమె ఆఫీసులో రిటైరయిన ఆ నౌకరు పేరు అబ్దుల్. అతని పేరు చెప్పగానే నలుగైదుగురు పిల్లకాయలు అతన్ని తీసుకొని వస్తామని నాలుగు దిశలా పరుగెత్తుకొని వెళ్ళారు. ఆ గ్రామంలో అబ్దుల్ పేరు మోసిన వాడని తెలిసింది.

పెద్ద తలపాగతో చౌద్రీ అనే ఒక ముసలాయన స్వాగతం చెప్పి నిత్యా, అమృతంని, ఒక నార మంచం మీద కూర్చోమని చెప్పాడు. అతని చుట్టూ ఐదారుగురు వృద్ధులు హుక్కా పంచుకొని కనిపించారు.

## 7

ఆ గ్రామంలో ఆధునిక దుస్తులతో అమృతం, నిత్యా కనిపించారు. చౌద్రీ వాళ్ళకి ఉపచారం చేసారు. తరువాత "ఆప్ లోక్ బ్రాహ్మణ్ హై?" అని అడిగారు.

"క్యూంగ్?" అని అమృతం అడిగాడు.

"హా జీ" అని ది నిత్యా.

"అచ్చాచీ" అని అంటూ చౌద్రీ పండిట్జీ ఇంటినుంచి నీళ్లు తెమ్మని ఒక అబ్బాయిని పంపించాడు.

అబ్దుల్ మురిసిపోయినట్టు కనిపించాడు. నిత్యా తన్ను చూడడానికి వస్తుందని వాడు కలలో కూడా ఎదురుచూసి ఉండడు. నిత్యా వాడికి అమృతంని పరిచయం చేసింది. అబ్దుల్ ఇద్దరినీ అక్కడ ఉన్నవారందరికీ పరిచయం చేసాడు.

ఆబ్దుల్ కొంచెం ఇంగ్లీషులో మాటాడగలడని తెలిసిన తరువాత అమృతం అడిగాడు: మీ ఇంటిలోనుంచి మేం నీళ్ళు తాగకూడదా? ఎందుకు పండిట్జీ ఇంట్లోనుంచి తాగాలి?"

అబ్దుల్ మోటుతనంగా ఇంగ్లీషులో జవాబు చెప్పాడు. "పాత నియమాలు పాలించే గ్రామం ఇది. దయచేసి మరేం కొత్త ప్రశ్నలు ఇక్కడకి తీసుకురావద్దు. హిందూ-ముస్లిమ్ సమస్యలు లేకుండా ఇలాగే నూరు సంవత్సరాలు ఈ గ్రామం ఉంటోంది."

"ఎన్ని ముస్లీం ఇళ్ళు ఈ గ్రామంలో ఉన్నాయి?" అని అమృతం అడిగాడు.

"పది . . . అదెలాగో పోనీ . . . ముందు రండి, మీకు గ్రామం చూపిస్తాను . . . "

ముస్లీం ఇళ్ళు గ్రామంకి కొంచెం దూరంగా ఉన్నాయి. దానిగురించి అమృతం అడిగినప్పుడు అబ్దుల్ చెప్పాడు. "ఇక్కడున్న హిందువులు అందరూ శాఖాహారులు. శాఖాహారులు, మాంసాహారులు ఒకే జాగాల్లో ఉండడం ఎలా సాధ్యం?"

'ఇదేం వివేకం నేర్పించిన పాఠమా, లేకపోతే అబ్దుల్ ఈ నిర్బంధ విభజన గురించి తీవ్రంగా ఆలోచించాడా?' అని అమృతంకి అనుమానం కలిగింది.

మాట వరుసలో అమృతం ఏదో చెప్పాలని ఆరంభించగానే నిత్యా "మీ అల్ప రాజకీయ ప్రశ్నలు ఇక్కడ తీసుకురాకండి!" అని ఆక్షేపించింది. ఆమె ధోరణి చూసి అమృతం అసహ్యించుకున్నాడు. అంటే సమాజంలోని అధార్మికత, పక్షపాతము గురించి నిత్యాకి ఎటువంటి ఉద్దేశమూ లేదని అతనికి నిరాశ కలిగింది.

"నువ్వుగాని ఒక హరిజన కుటుంబంలో పుట్టివుంటే ఏం చేసి ఉంటావ్?" అని అడిగాడు.

"ఆ ప్రశ్న లేచినప్పుడు ఏం చెయ్యాలో నాకు తెలుసు" అని నిత్యా ఇంగ్లీషులో జవాబు చెప్పింది. ఆ తరువాత, అలిగార్ నుంచి ఊరుకి తిరిగి వచ్చేవరకూ అమృతం ఆమెతో మాటాడనేలేదు.

**    **    **

"భోజనంకి వస్తారా?"

తిలకం స్వరం అమరికగా మ్రోగింది. ఇదేనా ఇంతకుముందు అలా బొబ్బలు పెట్టింది? Mrs. అయ్యర్ రావడం అమృతం ఎదురుచూసినట్టు కొంతవరకూ మంచిదే అయింది.

"వద్దు!" అని చెప్పేయాలని అమృతం ఒక క్షణం అనుకున్నాడు. కాని ఇదొక కొత్త పోరాటంకి యత్నం కాబోలు అనే భయంతో మరేం అనక భోజనంకి వచ్చాడు.

భోజనంకి తను కుర్చీలో  కూర్చున్నతరువాతే చూసాడు: తిలకం మొహంలో పవుడరు పూసుకొని కొత్త పట్టు చీర కట్టుకొని ఉంది!

ఆ మరుదినం ఉదయం లేవగానే అమృతం గుర్తుచేసుకున్నాడు. అవాళ తిలకం సినిమాకి వెళ్తోంది. గోడమీద గడియారం చూసాడు. ఏడు గంటలైంది. తిలకం వంటగదిలో ఉందని వాసన మూలం గ్రహించాడు.

తిలకం సినిమాకి వెళ్ళడం మంచిదే. ఆమె ఇంటిలో ఉన్నప్పుడు ఆ అమ్మాయి భాను ఫోను చేస్తే ఎన్నో చిక్కులు రావచ్చు. బహుశా ఆమె ఉదయం పిలుస్తుందేమో?

"మీరింకా లేవలేదా?"

తిలకం స్నానం చేసి, అద్భుతంగా కనిపించింది. తమిళ సినిమా చూడాలని అంత ఉత్సాహం, తొందర.

అమృతం లేచాడు. నిన్న జరిగినదన్నిటికీ క్షమించే ధోరణి ఆమెలో కనిపించింది.

"మీరూ వస్తారా?"

"ఎక్కడికి?"

"సినిమాకి . . . "

""సినిమాకా? . . . టికెట్టు దొరకదు . . .  "

"రండి . . . Try చేద్దాం . . . "

"తప్పకుండా దొరకదు . . . "

'ఇదేం గొడవరా?' అనిపించింది అమృతంకి.

"అలాగైతే నేనూ వెళ్ళను . . . "

"అదేంటి . . . ఆవిడ దగ్గర వస్తానని చెప్పిన తరువాత . . . "

"ఒళ్లు బాగా లేదని ఫోను చేస్తే చాలు . . . "

"అలాగైతే మరెందుకు ఇంత ముందుగా లేచి, స్నానం చేసి, సిద్ధమయ్యావ్?" అమృతం పళ్ళు తోముకోడానికి లేస్తూ ఈ ప్రశ్న అడిగాడు.

"వెళ్ళాలంటున్నారా?"

"తప్పకుండా . . ."

"నేను ఇంట్లో ఉంటే మీకు బాధగా ఉందా?"

భుజం మీద తువ్వాలు వేసుకొని నడిచే అమృతం తిరిగి చూసాడు: 'దానికి తెలిసిపోయిందా?'

"What nonsense! . . .  నువ్వేమంటున్నావ్?"

"మరెందుకు మీరు నన్ను 'వెళ్ళు', 'వెళ్ళు' అని తరుముతున్నారు?"

"ఇదిగో, విను, నీకేం ఇష్టమో అలాగ చెయ్ . . . నేను ఏం చెప్పినా నీకు  మనసులో నేను మరేదో చెప్తున్నట్టు అనిపిస్తోంది".

తనకి న్యాయంగా కోపం వచ్చినట్టు అమృతం మాటాడాడు. కాని తిలకం సినిమాకి వెళ్ళకపోతే తనేం చెయ్యాలని తెలియక అతనికి భయం కలిగింది.

"నిన్నే 'నేను రాను' అని ఆవిడతో చెప్పివుంటే సరిపోను . . . ఇప్పుడు 'రాను' అని అంటే బాగుంటుందా? అదే నేను అంటున్నది . . . "

"మీకు లంచ్ అంతా ఐపోయింది . . . "

"అలాగైతే ఇక వెళ్ళు . . . "

ఇంతలో ఎవరో ఫోనులో పిలిచారు. తిలకం వెళ్ళి రిసీవరు అందుకుంది.

అప్పుడే అమృతంకి అనిపించింది:' ఒక వేళ భాను పిలుస్తే . . . '

'హల్లో . . . " తిలకం అతన్ని చూస్తోంది.

'దేవుడా, భాను పిలుస్తోందా? కొంప మునిగిందన్న మాట . . . నిన్న జరిగిన ఘటనలన్నీ . . . "

"మామీ, నేను రెడీ . . . ఇదిగో వస్తున్నాను . . . "

'మంచి వేళ . . . Mrs. అయ్యరే పిలిచారు కాబోలు . . . "

"ఇదిగో, చూడండి . . . కాఫీ, టిఫను, మేజామీద ఉన్నాయి . . . ఆ తరువాత ఆకలిగా ఉంటే లంచ్ కూడా ఉంది . . . కావాలంటే అది కూడా . . . "

"మరేం వద్దు . . . నువ్వు బయలుదేరు . . . ఆవిడ కాచుకొని ఉంటారు . . . "

ఆమె వెళ్తున్నప్పుడు ఒక నకిలీ నవ్వు నవ్వి అడిగింది: "మీరెవరైనా రమ్మని పిలిచారా?"

అమృతం కోపంతో ఆమెను తేరిపార చూసాడు.

" . . . క్షమించండి . . . నేను మీ మాటలు నమ్ముతాను . . . "

గభీమని అమృతంకి ఆమె మీద జాలి కలిగింది. అందువలన పట్టరాని కోపమూ కలిగింది: 'ఇదేం సంస్కృతి? వివాహ బంధంలో అనివార్యంగా కలిగే బాధ్యత వలనేకదా ఈ సంస్కృతి? 'భార్యాభర్తలు' అని అనడానికి ముందు ఆడ, మగ అని సతర్కంగా అంగీకరించడం న్యాయం కాదా?

అప్పుడే టెలిఫోను మ్రోగింది. అమృతం భోజనం ఆపి, చెయిలో ఫోను అందుకున్నాడు.

"అమృతం మాటాడుతున్నాను."

"భాను . . . Good morning . . . "

"Good morning . . . నువ్వు ఫోను చేస్తావని ఇంత సేపూ కాచుకొని ఉన్నాను . . . "

"అలాగా? . . . Auntie లేరా?"

"సినిమాకి వెళ్ళింది . . . By the way, 'Auntie', 'Auntie' అని అనవద్దు . . . అది నన్ను ముసలివాడుగా గుర్తు చేస్తోంది."

భాను నవ్వింది. "మీ వయసు?"

అమృతం కొంచెం స్తంభించిపోయాడు: 'ఎందుకు అడుగుతోంది? ఎగతాళి చెయడానికా?'

"మాటాడరేం? చెప్పకూడదా?మీకెందుకు ఆడవాళ్ళలాగ సిగ్గు?"

"సరేలే . . . పదికి లోపల ఒక సంఖ్య చెప్పు . . . "

"నాకు చిన్నప్పుడు పిల్లల పత్రికలు చదివే అలవాటు లేదు . . . ఇప్పుడూ వద్దు . . . "

అమృతం నవ్వాడు. "సరే, విను . . . నాకుగాని పదిహేడు సంవత్సరాలలో పెళ్ళయివుంటే నీ వయస్సులో ఒక కూతురు ఉంటుంది. నీకు బోధపడిందా?"

"అదే మీకు బాధగా ఉందా?"

అమృతంకి చెంపమీద వాయించినట్టనిపించింది: 'ఈ అమ్మాయి గడసరి. నేను ఈమెతో జాగ్రత్తగా మాటాడాలి.'

"పోనీలే . . . ఇప్పుడెందుకు ఫోను చేసావ్?"

"నా మాట కాపాడుకున్నాను."

"ఏం మాట?"

"మీకు ఫోను చేస్తానన్నాను, చేసేసాను."

"అంతేనా? మరేం లేదా?"

"మీకెందుకు కోపం? ఎవరిమీద కోపం?"

అదే అమృతంకి బోధపడలేదు.

"ఇవాళ సాయంకాలం నువ్వేం చేస్తున్నావ్? మనం కలుసుకుందామా . . . ?

"హూం . . . "

"మనం Buddha Park లేక మరెక్కడైనా వెళ్ళాం, ఏమంటావ్? . . . నీతో కొంచెం మాట్లాడాలి . . . "

కొంచెంసేపు మౌనం. ఆ తరువాత భాను అడిగింది: "మీ ప్రశ్నకి నేనేం జవాబు చెప్పాలి?"

"ఏదైనా సరే . . . అది నీ ఇష్టం . . . "

భాను నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావ్?"

"కొన్ని సమయాల్లో మీరు త్యాగిలాగ మాట్లాడుతున్నారు!"

'మాట్లాడుతున్నది భానువా లేక నిత్యావా? తప్పకుండా నిత్యా ఇలాగే మాట్లాడివుంటుంది. ఆమె ఎడం పక్క తల వొంచినప్పుడు కళ్ళలో చిరునవ్వు కనిపిస్తుంది.'

"క్షమించాలి. మనసులో నాకేమో తోచింది, అడిగేసాను." భాను స్వరం వినగానే అమృతం చెప్పాడు: "మీరలాగా మాట్లాడండి. అదే నాకు ఇష్టం!" అన్నాడు.

"సరే . . . సాయంకాలం మనం వెళ్దాం . . . మీరు మా ఇంటికి రండి . . . "

"మీ ఇంటికి రావొచ్చా?"

"ఎందుకు రాకూడదు?"

ఆమె స్వరంలోని నిదానం, హుతం చూసి అమృతంకి ఆశ్చర్యం కలిగింది.

"సరే . . . ఐదు గంటలకి వస్తాను."

"Thank you."

అమృతం తిరిగి భోజనంకి వెళ్ళినప్పుడు దోస ఎండిపోయింది. అది తినడానికి ఇష్టంలేక తొట్టిలో పారేసి చెయి కడుక్కున్నాడు.

తిలకం తిరిగివచ్చినప్పుడు అమృతం బాగా నిద్రపోయాడు. ఆమె calling bell నొక్కినప్పుడు కలలో విన్నట్టనిపించింది. ఆమె తలుపుని బలంగా బాదిన తరువాతే అమృతం లేచివచ్చాడు.

లోపలికి వచ్చిన తిలకం పరిసరాలు చూస్తూ నిలబడింది.

"ఏమిటలా చూస్తూ నిలబడ్డావ్?"

“ఎవరైనా ఉన్నారా అని చూడడానికే . . . తలుపు తెరవడానికి ఎందుకింత ఆలస్యం?”

“మంచం కింద తొంగి బాగా చూడు . . . నీకు పిచ్చి పట్టుకుంది . . . ”

తిలకం handbag ని మేజామీద పెట్టి సోఫాలో వాలింది.

“సినిమా ఎలా ఉందని అడగరేం?”

“చెప్పు, ఎలాగుందని . . . ”

“First class . . . పెళ్ళాం ఉన్నప్పుడే ఇంకొక ఆడదానికోసం తహతహలాడే మగవారికి ఇదొక మంచి పాఠం! . . . ”

“ఏమైంది, ఆఖరికి?”

“పెళ్ళాంని అన్ని విధాలా హింసపెట్టిన తరువాత, తనూ తికమకలు పడి ఆఖరికి పెళ్ళాం దగ్గరికే వచ్చేసాడు . . . ”

“అదే వాడికి శిక్ష అన్నమాట, అవునా?”

తిలకం కోపంతో అతన్ని చూసింది. “మీరేమంటున్నారు? పెళ్ళాం నచ్చలేదంటే మరెందుకు పెళ్ళి చేసుకున్నారు?”

“నీకసలు హాస్యమంటే ఏమీ తెలీదు . . . ”

“తెలియకపోతే ఏ బాధా లేదు . . . ముందు భోజనంకి రండి . . . ”

భోజనమైన తరువాత అమృతం సోఫాలో ఒక పుస్తకంతో కూర్చున్నాడు. తిలకం పక్కనే వచ్చి కూర్చుంది. నోతినిండా తమలపాకు నమలుతోంది.

“సరే, పోనీలెండి . . . ఒక వారంగా నాకు పిచ్చి అనుకోండి, అన్నీ మరిచిపోండి . . . ”

తన పక్కన కూర్చొని, చివాలున ఆమె అన్న మాటలు వినగానే అమృతంకి ఆశ్చర్యం కలిగింది: ‘ఒక వేళ Mrs. అయ్యర్ తో మాటాడిన తరువాత ఆవిడ తిలకంకి ఏమైనా ఉపదేశం చేసారేమో?’

అతను మౌనంగా ఉన్నాడని చూసి తిలకం అతని భుజంమీద వాలుతూ అడిగింది: “ఇవాళ మనం ఎక్కడికైనా వెళ్దాం.”

“ఎక్కడికి?”

“Buddha Park . . . Ookla . . . ఎక్కడైనా సరే . . . ”

అమృతం ఉలికిపడ్డాడు. తిలకంకి ఏమైనా తెలిసిపోయిందా? రెప్ప వాల్చకుండా ఆమెను చూసాడు.

“ఏమిటలా చూస్తున్నారు? . . . నేను నిజంగానే అడుగుతున్నాను.”

ఆమె చెయి అతని తలని లాలించింది.

“ఇంకొకరోజు వెళ్దాం. . . ”

“ఎందుకు? ఇవాళ ఏమైందని?”

“ఇవాళ సాయంకాలం బెనర్జీ ఇంటికి వెళ్తున్నాను . . . ఒక చిన్న drinking party . . . ”

అమృతం ఎప్పుడైనా తన స్నేహితులతో drinking party కి వెళ్తాడు. తిలకం ఆక్షేపించదు. అది అతనికి ఆమె ఇచ్చిన విశేష హక్కు.

“రానని చెప్పేయండి.”

“అదెలాగ? వాడికి ప్రమోషన్ వచ్చింది, అందుకే ఈ పార్టీ . . . ఇంకో ఇద్దరినికూడా పిలిచాడు. వెళ్లకపోతే బాగుండదు . . . ”

తను సహజంగా, సంకోచం లేకుండా అబద్ధం చెప్పడం అమృతంకే వింతగా కనిపించింది.

“వచ్చే ఆదివారం మనం తప్పకుండా వెళ్దాం” అన్నాడు అమృతం.

“ఇంకొక పని చేస్తారా?”

“ఏమిటి?”

“ఇప్పుడు చాణక్యపురి, నెహ్రూ పార్క్ వెళ్దాం . . . నాకు driving నేర్పించండి . . . Mrs. అయ్యర్ ఎంత బాగా driving చేస్తున్నారు!”

“ఇదిగో, విను . . . నీకు ఎక్కడికి వెళ్ళాలని ఉందో అక్కడకి నేను నిన్ను తీసుకొని వెళ్ళాను . . . నీకెందుకు ఈ driving బాధ?”

“మీ ఇంపైన మాటలు విని నేను మోసం పోను . . . నేను driving తప్పక నేర్చుకుంటాను . . . మీరే నేర్పాలి . . . ”

ఇక ఆమెతో వాదించడం లాభం లేదని అమృతం లేచాడు.

“ఆ అమ్మాయిని చూడ్డానికి రేపు వెళ్దామా?”

“ఏ అమ్మాయి?” అమృతం అదిరిపట్టాడు. వొంగి, నేలనున్న పుస్తకం తీసుకున్నాడు.

“భాను . . . ఉత్తికే . . . భానుకదూ ఆ అమ్మాయి పేరు?”

“ఎందుకు చూడాలి?”

“అవాళ చూసినప్పుడు ఇంటికి రమ్మని పిలవలేదూ? వెళ్ళి చూద్దాం.”

ఆ రోజు భాను తిలకంని ఇంటికి రమ్మని పిలవలేదని అమృతంకి తెలుసు. కాని తిలకంకి విరుద్ధంగా ఏమీ అనక ఊరుకున్నాడు.

“ఏమంటారు? . . . వెళ్దామా?”

“అర్థం పర్థం లేకుండా గభీమని మనం వెళ్తే బాగుంటుందా?”

“మీరు నిన్న వెళ్ళలేదూ? . . . కోపం వద్దు . . . ”

“ఇంటిలో దిగబెట్టాలని కారులో వెళ్ళాను, అంతే . . . స్వచ్ఛందంగా నేను వెళ్ళలేదు . . . ”

“మీరు స్వచ్ఛందంగా వెళ్ళారని నేను అనలేదే?”

“అలా వెళ్ళినా అదేం పొరబాటు కాదే? ఆ అమ్మాయి వయసులో మనకొక కూతురు ఉంటే?”

‘అబ్బా, నేనొక మంచి వేషధారి!’ అని అమృతం మనసులో అనుకున్నాడు.

“సరే, అలాగైతే వెళ్దాం . . . నేనూ రానా?”

తన తెలివితక్కువతనం వలన చిక్కులో పడిపోవడం అమృతం గ్రహించాడు.

“సరే, ఎప్పుడైనా వెళ్దాం . . . ”

“సరే, ఇప్పుడు నేను నిద్రపోతాను . . . మీరు వెళ్ళేముందు నన్ను లేపండి.”

తిలకం కాళ్ళు చాచి అలాగే సోఫాలో పడుకుంది.

## 8

అమృతం చెయిలో ఒక పుస్తకంని అందుకొని సోఫా మీద కూర్చున్నాడు.

ఎందుకు తిలకం భానుని చూడాలంటోంది? ఆమె ఎటువంటి అమ్మాయి అని కనిబెట్టడానికా? భానుకి అది సులభంగా బోధపడుతుంది; తిలకంకి నాజూకుగా మాట్లాడడం తెలీదు. ఈ చిక్కునుంచి తను తప్పుకోవడం ఎలాగ?

తను భానుని “మీ ఇంటికి రావొచ్చా?” అని అడిగినప్పుడు ఆమె “ఎందుకు రాకూడదు?” అని నిదానం, హఠంతో అడిగింది. అంటే అమృతం మనసులో కల్పించుకున్న వెర్రి సమస్యలకి భానుకి ఎటువంటి బాధ్యతా లేదని నొక్కిచెప్పడానికా? లేకపోతే తనకి తన తల్లిగురించి ఎటువంటి భయమూ, గౌరవమూ లేదని చెప్పడానికా? ఆమె ఎందుకలా మాట్లాడింది?

తనకి తల్లి అంటే ద్వేషం అని భాను సూటిగానే చెప్పింది. అందుకు కారణం ఏమిటి? తల్లి నాన్నగారిని వదిలేసి వచ్చేసిందనా? లేకపోతే, తల్లి నడత అందుకు కారణమా? ఆ తల్లిని చూస్తే అవకాశవాదిలాగే కనిపిస్తోంది; సమయం దొరికితే ఆవిడ స్వార్థానికి ఉపయోగించుకొనే మనిషిలాగే కనిపిస్తున్నారు.

అసలు భాను తల్లికీ, నిత్యా తల్లికీ మధ్య ఉన్న భేదం ఏమిటి?

అమృతం, నిత్యా మధ్య ఉన్న సహవాసం నిత్యా తల్లికి తెలియకపోలేదు. ఇద్దరూ కలిసి చాలా చోట్లకి వెళ్ళినా ఆవిడ ఆక్షేపించలేదు. కాని నిత్యా తన తల్లి అమృతం-నిత్యా పెళ్ళికి సమ్మతించదని ఎందుకు చెప్పింది? దానిగురించి ఆవిడ దగ్గర సంప్రదించకుండా తను ఆవేశంతో తిలకంని పెళ్ళాడడం పొరబాటేమో? లేకపోతే నిత్యా తనే అమృతం తనకి తగిన భర్త కాదని ఆలోచించి, తల్లి మీద నింద మోపిందేమో?

అప్పుడే అమృతం మనసులో ఇంకొక భావన లేచింది: నిజమో, అబద్ధమో, తన పన్నెండేళ్ళ దాంపత్యం నిమ్మళంగా గడిచిపోయింది. ఇప్పుడు తన అహంని ముద్దులాడాలని ద్రోహం చెయ్యాలా? వద్దు, భానుకి 'నేను రాను!' అని ఫోను చేసేద్దాం . . . దేవుడా, భానుకి ఫోను లేదే?

“'Time ఎంత?”

సగం నిద్రలో దొర్లుతూ తిలకం అడిగింది.

“నాలుగు . . . ”

“మీరింకా బయలుదేరలేదా?”

“ఇదిగో, వెళ్తున్నాను . . . ” అని అమృతం మంచం నుంచి దిగాడు.

బద్ధకంగా చేతులు చాచి తిలకం లేవడానికి ప్రయత్నం చేసినప్పుడు అమృతం చెప్పాడు: “నువ్వు లేవనక్కరలేదు. నేను కాఫీ బయట తాగుతాను.”

“కాఫీ చెయ్యడానికి ఎంత సమయం పట్టుతుంది . . . ?” అని అంటూ తిలకం లేచింది.

అమృతం దుస్తులు మార్చుకొని సిద్ధమయ్యేసరికి తిలకం కాఫీని తీసుకొనివచ్చి మేజామీద ఉంచింది.

“రావడానికి ఆలస్యం అవుతుందా?”

“తెలీదు. త్వరగా రావడాని చూస్తాను.”

“మీరు driving చేస్తారు . . . ఇదొక drink party . . . ఎక్కువగా తాగకండి . . . ”

అమృతం నవ్వాడు: “నేనెప్పుడైనా మితిమీటి తాగానా?”

“ఇంతవరకూ లేదు . . . ” అని తిలకం లాగింది.

“నేనే వెళ్దామా, వద్దా అని ఆలోచిస్తున్నాను . . . ” అని కాఫీ తాగిన తరువాత, రుమాలుతో మొహం తుడుచుకొని అమృతం, అన్నాడు.

“ 'వస్తాను' అని చెప్పిన తరువాత వెళ్ళకపోతే బాగుండదని మీరు అన్నారు . . . ”

అమృతం wash basin దగ్గరకి వెళ్ళి, నీళ్ళు తాగి కాండ్రించుకున్నాడు. చూపుడు వేలుతో పళ్ళు బాగా తోముకున్నాడు; తిలకం అతన్ని చూస్తూనే ఉంది.

“ఇదేంటి, కొత్త అలవాటు?కాఫీ తాగిన తరువాత నోరు కడుక్కొని ఎక్కడకి వెళ్తున్నారు?”

“నువ్వూ రా నాతో - బెనర్జీ ఇంటికి . . . నీ అనుమానం తీరుతుంది.”

“అవును, అదొక్కటే నేను చెయ్యవలసిన పని! మీరు నోరు కడుక్కోడం ఎందుకని అడిగాను . . . మీరు బయలుదేరండి, త్వరగా వచ్చేయండి . . . ”

అమృతం లక్ష్మీభాయ్ నగర్ చేరగానే భాను ఇంటిముందు కారు ఆపి horn వాయించాడు. ఐదు నిమిషాల తరువాత కూడా భాను రాలేదు. ‘తిరిగి వెళ్ళిపోదామా?’ అని ఆలోచించాడు. అప్పుడు తనకి మరేం ప్రశ్నా ఉండదు. తనొక నిర్ణయంకి రావాలనే ఈ అవకాశం దొరికింది కాబోలు . . .

ఇంటికి తిరిగి వెళ్తే తిలకంతో Nehru Park వెళ్ళి car driving నేర్పించవచ్చు. తిలకం Mrs. అయ్యర్ని కలుసుకొని “మా ఆయన కూడా నాకు driving నేర్పారు!” అని గర్వంగా చెప్పుకుంటుంది. తను రిటైరన తరువాత ఫించనుతో రోజులు గడుపుతున్నప్పుడు, తనకి అలసటగా ఉంటే తిలకం కారు నడుపుతుంది . . . అదే చలనం లేని జీవితం . . . శాంతియుతమైన జీవితం . . . సమాధిలో శాంతం లాగ . . .

అమృతం మళ్లీ horn వాయించాడు; భాను తల్లికి జబ్బుగా ఉందేమో? అమృతం కారుని తాళం వేసి బయలుదేరాడు.

భాను ఇంటి ద్వారం మూసివుంది. లోపలికి వెళ్దామా, వద్దా?

“హలో. . . ”

అమృతం తిరిగి చూసాడు. నటేశన్ కనిపించారు. అతనికి సంబంధించని ఏ దక్షిణ సంఘమూ లేదు. ఒక సంఘంలో కార్యదర్శి అంటే ఇంకొకదానిలో ఉప కార్యదర్శిగా, మరొకదానిలో కార్యనిర్వాహక సభ్యులుగా ఉంటారు. వేదాంతదేశికుకుడు[1] వైభవం అయినా సరే, రామలింగ స్వామిగారి[2]ని కొనియాడే ఉత్సవమైనా సరే, అన్నిటిలోనూ కలుసుకొని అతను బొమ్మరంలాగ పని చేస్తారు.

“మీరు ఇక్కడ ఏం చేస్తున్నారు?” అని అడిగారు నటేశన్.

“మీరు ఇక్కడ ఉంటున్నారా?”

“అవును. E Block లో . . . రండి, మా ఇంటికి . . . ”

“ఇప్పుడా?”

“మీరు ఎవరినైనా చూడాలని వచ్చారంటే, వాళ్ళని చూసి రండి . . . మీకెవరిని చూడాలి?”

“మీ ఇల్లు పక్కనే ఉందా?”

“ఇదిగో . . . అలా తిరుగుతే నాలుగవ ఇల్లు . . . ”

“సరే, మీ ఇంటికి వెళ్దాం రండి . . . ”

“తప్పకుండా . . . మీరు చూడవలసిన మనుషులు లేరా?”

“ఐదు గంటలే అయింది . . . ఎండ ఎంత తీవ్రంగా ఉంది!” అన్నాడు అమృతం.

“అవును, ఈ ఎండలో మీరు ఎవరికోసం వచ్చారు?”

“అదిగో, ఆ ఇంటిముందు రెండు మూడు పిల్లలు ఆడుకుంటున్నారే, అదేనా మీ ఇల్లు?”

“అవును . . . ”

“మంచి చురుకైన పిల్లలు! అందరూ మీ పిల్లలా?”

“కాదు . . . అదిగో, అక్కడ ఏడస్తూ ఉందే అదే మా పిల్లవాడు . . . వాడిని పచ్చికమీద అలా వదిలేసి అదేం చేస్తోంది?”

నటేశన్ తన్ను తనే ప్రశ్నించుకుంటూ పాపను ఎత్తుకొని ఇంట్లోకి ప్రవేశించారు: “మీనాక్షి . . . మీనాక్షి . . . ”

---

[1] తమిళ బహుముఖ ప్రజ్ఞశాలి (1268-1369)

[2] తమిళ సాధువు (1823-1874)

“ఏం కొప మునిగిందని? ఎందుకు అరుస్తున్నారు? . . . ఇదిగో వస్తున్నాను . . . ” అని అంటూ వస్తున్న అతని భార్య అమృతంని చూడగానే నివ్వెఱబోయి నిల్చుంది.

“పిల్లవాడు ఎందుకు ఏడుస్తున్నాడు?”

“వాడికి మరేం పని?”

“ఇతనే Mr. అమృతం . . . Health Ministry లో Deputy Secretary గా ఉన్నారు.”

అతను ఆ ఉద్యోగం వహించడంలే తనకి ఆక్షేపణ లేదని చెప్తున్నట్టు అతని భార్య తలూపింది.

“ఇలాగ వచ్చి కూర్చోండి!” అని అల్లాడుతున్న ఒక కుర్చీని నటేశన్ చూపారు. ఇంటి బయట ఇన్ని వ్యవహారాల్లో కలుకునే మనిషి తన ఇంటిని కూడా కొంచెం బాగా ఉంచుకోకూడదా?

“వెళ్ళు, కాఫీ తీసుకురా?” అన్నారు నటేశన్ భార్యతో.

“No, please . . . ఇప్పుడు వద్దు . . . మీ ఇల్లు చూసేసాను . . . ఇంకొక రోజు వస్తాను . . . ”

“ఇదేంటి, ఇలా వచ్చి కాఫీ తాగకుండా వెళ్తున్నారు? . . . ”

“ . . . ఇంకొకరోజు తప్పకుండా వస్తాను . . . ”

“ఒక నిమిషంలో కాఫీ తెస్తాను . . . ” అంది అతని భార్య.

“ఇదిగో చూడు . . . నువ్వు వెళ్ళి తీసుకురా . . . అతను కాఫీ తాగి వెళ్తారు.” ఒక Deputy Secretary తనింటిలో కాఫీ తాగకుండా వెళ్ళకూడదని నటేశన్ నిశ్చయం చేసుకున్నారు.

ముందురోజు చేసిన కషాయం కాబోలు, అమృతం ఎలాగో కష్టపడుతూ ఆ కాఫీ తాగాడు.

‘ఇదేం వెర్రితనం . . . పెళ్ళాం దగ్గర అబద్ధం చెప్పి బయలుదేరి, ఎక్కువగా పరిచయం లేని ఒకతను ఇంట్లో అతని భార్య చేసిన చెడ్డ కాఫీతో ఎందుకు పెనుగులాడాలి? నిజంగా నేనొక పిఱికిపంద. భాను ఇంటికి వెళ్ళి తలుపు తట్టడానికి నాకు ధైర్యం లేదు. అందుకు బహుమానం ఈ కాఫీ . . . ’

“సరే, వస్తాను.”

అమృతం తటాలున లేవగానే నటేశన్ వింతగా చూసారు.

“మీకు ఎవరని చూడాలని జ్ఞాపకం వచ్చేసిందా?”

‘ఇదేం గొడవరా . . . ఇతరుల వ్యవహారాల్లో ఇతనికి ఎంత ఆసక్తి! . . . ’

“వస్తాను . . . మళ్ళీ ఇంకొక రోజు వస్తాను” అని అతని జవాబుకోసం ఆగకుండా అమృతం వేగంగా నడిచాడు.

భాను ఇంటికి వెళ్ళి calling bell నొక్కాడు.

కిటికీ మూసివుండడం చూసి, అనుమానంతో, ద్వారంని చూసాడు.

తలుపు తాళం వేసి ఉంది!

తను ముందు వచ్చి చూసినప్పుడు తాళం లేదే! బహూశా, తను సరిగ్గా చూడలేదేమో? లేదు, అప్పుడు తప్పకుండా తాళం లేదు . . . అంటే, తను నటేశన్ ఇంటికి వెళ్ళి తిరిగి వచ్చే లోపల తాళం వేసి భాను బయటకి వెళ్ళివుండాలి . . . ఎక్కడకి వెళ్ళివుంటుంది?’

అమృతంకి ఏదీ అర్థంకాలేదు.

తిరిగివచ్చి కారులో కూర్చున్నాడు.

ఇక ఏం చెయ్యాలని ఆలోచించాడు: ‘ఇంటికా? లాభం లేదు.’

‘నేను వచ్చి ఇంటిముందు నిలబడినప్పుడు భాను నన్ను చూడకుండా ఉంటుందా? అలాగ చూసిన తరువాత ఆమె ఇల్లు తాళం వేసుకొని వెళ్ళిందంటే . . . ఛీ, ఛీ, నేను రావడం పెద్ద పొరబాటు!’

‘తిలకంకి చెప్పినట్టు ఇప్పుడు బెనర్జీని చూద్దామా? అతను ఇంట్లో ఉంటాడా? ముప్పైయిదు నిండినా పెళ్ళి చేసుకోని బుద్ధిమంతుడు. స్త్రీలంటే వాడికి ద్వేషం. అందుకు ఏదైనా అంతరంగిక కారణం ఉంటుంది . . .

బెనర్జీని వెళ్ళి చూడడంలోనూ ఒక అపాయం ఉంది; Scandinavian folk songs గురించి వాడు వల్లించే ఉపన్యాసం వినితీరాలి. భాను ఇల్లు వెదుకుతూ వచ్చిన తనకి ఇది శిక్ష కాబోలు.

అమృతం కారుని సరోజిని నగర్ మార్గం నడిపాడు. Ring Road లో చాలా భవనాలు కనిపించాయి. అందులో, సర్కారుకి చెందిన ఒక బంగళాలో బెనర్జీ అద్దెకు ఉంటున్నాడు. ఆ బసకి వెళ్తున్నప్పుడెల్లా అమృతం మనసులో ‘ఒక బ్రహ్మచారికి ఇంత పెద్ద జాగా ఎందుకు?’ అనే ప్రశ్న లేస్తుంది.

ఇప్పుడు అమృతంకి అనుమానం కలిగింది: ‘ఆ భావన అసూయగా మారి నాకు బాధగా ఉందా?’

ఎందుకు అసూయ? సామాజిక అడ్డగింపులనుంచి తప్పించుకొని బెనర్జీ తనకిష్టం వచ్చినట్టు ఆ పెద్ద బంగాళాలో ఉంటున్నాడు. ‘ఇది మగవారి ప్రపంచం, ఇందులో స్త్రీ అనేది అగత్యంలేని చొరబాటు!’ అని అతని వాదం. ఐతే అందువలన అతన్ని సన్యాసి అని పిలవకూడదు. “నేనేదీ త్యాగం చెయ్యలేదు; కాని ఏరుకొనే హక్కు నాకు ఎప్పుడూ ఉంది?” అని బెనర్జీ ఒక సారు చెప్పినది అమృతం గుర్తు చేసుకున్నాడు.

అమృతం ఒక మంచి చిత్రకారుడు. ఇతరులు పొగడాలని, తన చిత్రలేఖనలు ప్రదర్శించాలని, అతను ఆ కళని పోషించలేదు. “ఈ వర్ణచిత్రం చాలా బాగుంది” అని ఎవరైనా పొగడితే, అతను ఉత్తికే తల ఊపేసి మరేదో మాటాడతాడు.

‘చిత్రకారుడు’ అనగానే అమృతం గుర్తుచేసుకున్నాడు: ‘భానుకి చిత్రకళలో సగటుకు మించి నైపుణ్యం ఉంది. ఆమెకు బెనర్జీ చిత్రలేఖనలు తప్పక చూపించాలి.’

‘దేవుడా, నేనెంత తెలివిమాలిన పని చేసాను!’ అని అమృతం నొచ్చుకున్నాడు. తన్ను ఇంటికి రమ్మని చెప్పి భాను తాళం వేసుకొని ఎక్కడికో వెళ్ళిపోయిందే?’

‘బెనర్జీ ఇంట్లో లేకపోతే ఏం చెయ్యడం? Connaught Place లో ఏదైనా సినిమా చూడవచ్చు. ఇవాళ ఆదివారం. ఎక్కడా టికెట్లు దొరకవు. మళ్లీ లక్ష్మీభాయ్ నగర్ వెళ్ళి చూస్తే? . . . భాను ఇరుగుపొరుగులకి వెళ్ళిందేమో? . . . నేను తొందరపడి వచ్చేసాను . . . నిత్యా నాకు ఒక సారి చెప్పలేదూ - ఏదైనా సరే, నేను గభీమని నిర్ణయించి ఒక వేగంతో ఆ పని చేస్తానని? నాకు కోపం వచ్చిందంటే నిత్యా దాన్ని లెక్కచెయ్యదు.’

ఒకసారి నిత్యా తన సహోద్యుగులతో సోనాకి వెళ్ళినప్పుడు అమృతంని పిలిచింది. ఆమె సహోద్యుగులతో వెళ్ళడం అమృతంకి నచ్చలేదు.

“మనిద్దరం కలిసి ఇంకొక రోజు వెళ్దాం” అని అమృతం అన్నాడు.

“ఇప్పుడెందుకు వెళ్ళకూడదు?”

“నువ్వు నీ సహోద్యుగులతో వెళ్ళాలా అని ఆలోచిస్తున్నాను.”

“మీరు ఆలోచిస్తూ ఉండండి. నేను వెళ్ళాలనుకుంటున్నాను.”

“సరేలే, తప్పకుండా, సంతోషంగా వెళ్ళి రావమ్మా!” అని అమృతం కొపంతో అరిచాడు.

నిత్యా చిరునవ్వు నవ్వుతూ భుజం ఊపుకుంది.

## 9

ఆదివారం ఉదయం వాళ్లందరూ బయలుదేరి వెళ్ళారు. అమృతంకి ఇంటిలో బాధగా ఉంది. ఏదో పుస్తకం చదువుదామని పేజీలు తిరగేసాడుకాని, చదవడానికి సాధ్యం కాదనిపించింది. తనూ సోహ్నాకి వెళ్ళాలనిపించింది. స్కూటర్ service కి ఇవ్వడం వలన టాక్సీలో వెళ్ళాలంటే బోలెడు ఖర్చు అవుతుంది. తనింత డబ్బు ఖర్చుచేసుకొని వెళ్ళాలా? అవును, తన్ను చూసి ఆ రోజు తనతో అంత ఉపేక్షతో మాటాడడం పొరబాటు అని నిత్యాకి ఆమె మనస్సాక్షి తెలియజేయాలి . . .

అమృతం సోహ్నా చేరుకున్నప్పుడు నిత్యా గంధక ఏరులో స్నానం చేసి, కొత్త చీర కట్టుకొని, ఎండలో జుత్తుని ఆరబోసుకుంటూ కనిపించింది. ఆమె పక్కనే ఆమె సహోద్యుడు మహేష్, టీ షర్టుతో, పెదవిలో సిగరెట్టు వేలాడుతూ మాటాడుతున్నాడు. నిత్యా తలని ఒక పక్క వంచి, జుత్తును చేతివేళ్ళతో లాలించతూ నవ్వుతోంది.

“అమృతం, ఏంటి ఇలాగ గభీమని రావడం?” అని మహేష్ ఆశ్చర్యంతో అడిగాడు.

తటాలున నిత్యా తిరిగి చూసింది.

“ ‘రాను!’ అని అన్న తరువాత . . . ” అని నిత్యా ఆరంభించగానే, అమృతం “నేను మీ మధ్య అడ్డం వచ్చేసానా?” అని అడిగాడు.

నిత్యా మొహం ఎఱ్ఱబారిపోయింది: “మీకు సిగ్గు లేదా? గూఢచారిగా వచ్చారా?”

“నేనెవరు గూఢచారిగా నీవెంట రావడానికి? నాకేం అధికారం ఉంది? నీకెందుకు కోపం?”

“మీరెందుకు మాతో ముందే రాలేదు? ఒంటరిగా ఎందుకు రావాలి?”

అమృతం నవ్వేసాడు. “సోహ్నా నీకే సొంతమని నాకు తెలీదు.”

నిత్యాకి కోపం కొంచెం తగ్గింది. “మీరెలా వచ్చారు?”

“టాక్సి.”

“బాబోయ్, ఎంత ఖర్చు చేసారు?”

“దానిగురించి బాధ పడకు. నిన్ను చూడాలని ఒక వేగం, వెంటనే బయలుదేరి వచ్చేసాను.”

“వినండి, అనిత్యమైన మనసంటే అదే . . . దానివలన అపాయమూ ఉంది . . . జాగ్రత్త, ఎప్పుడైనా మీరు చిక్కులో పడతారు!”

‘ఆమె చెప్పినది ఎంత నిజం!’

అమృతం కారు ఆపాడు. బెనర్జీ బంగళా వచ్చేసింది,

అతను కారుని తాళం వేసి బయలుదేరినప్పుడు ఒక కిరికెట్ బంతి వచ్చి కాలుని తాకింది. తళతళలాడుతున్న ఆ బంతిని అమృతం చెయిలో తీసుకున్నాడు.

“అంకిల్ జీ . . . ball . . . ”

ఒక పొట్టి పిల్లవాడు బంతిని అడిగాడు.

“తుమ్ bowler యా batsman?” అని అమృతం అడిగాడు.

“Fast bowler హై . . . ” అన్నాడు ఆ కుర్రవాడు. అమృతం ఆ అబ్బాయి బుగ్గని తట్టి ఆ బంతి ఇచ్చాడు.

బెనర్జీ నాలుగవ అంతస్తులో బస ఉన్నాడు. అమృతం lift లో ప్రయాణం చేసినప్పుడు నలుగురైదు పిల్లలు అతనితో వచ్చారు; సహజంగా ఇంగ్లీషులో మాటాడుతూ వచ్చారు. Odeon theatre లో 007 సినిమా గురించి వాదం.

బెనర్జీ ఇంటికి వెళ్ళి calling bell నొక్కగానే అతని వంటవాడు తలుపు తెరచాడు.

“ఆయియే సాహెబ్ . . . బాపూజీ హై . . . ”

బెనర్జీ ఏదో ఫ్రెంచు నవల చదువుతున్నాడు. అతనికి ఐదారు యూరోపు బాషలు తెలుసు.

"ఏమిటిలా రావడం?" అని అడిగాడు బెనర్జీ.

"అసలు ఆ ప్రశ్న నిన్ను నేను అడగాలి . . . నువ్వు ఎలాగిప్పుడు ఇంట్లో ఉన్నావ్?" అని అడుగుతూ అమృతం సోఫాలో కూర్చున్నాడు.

నేలమీద గోడలని తాకుతూ రత్నకంబళి పరచివుంది. గోడమీద బెనర్జీ చిత్రలేఖనలు మాత్రం కనిపించాయి; గదిలో మరేం లేవు. లోకప్పునుంచి వేలాడుతున్న కొమ్మల దీపస్తంబంలోని కాంతి ఆ గదిని పూర్తిగా ఆవరించి ఏకాంతం గుర్తుచేసింది.

"ఈ గదిలో నాకు ఒంటరిపాటు కనిపిస్తోంది" అన్నాడు అమృతం.

"అదే నాకూ కావాలి . . . నీకది బోధపడిందన్నమాట . . . నాకు చాలా సంతోషం" అన్నాడు బెనర్జీ.

"నాకు మరొకటి గుర్తుకి వస్తోంది . . . నా మనసులో నీమీద అసూయ కలుగుతోంది . . . "

"అది వింటే నాకేం ఆశ్చర్యంగా లేదు . . ."

"నీకు ఆశ్చర్యం కలగాలని నేను అనలేదు.  ఎందుకు అసూయ అని నాకు బోధపడినా, నేను చేసేది ఏమీ లేదు."

బెనర్జీ గొట్టంలో పొగాకు నింపుకున్నాడు; మొహంలో ఒక చిరునవ్వు కనిపించింది.

"నా మాటలు వింటే నీకు bore కొట్టుతోందా?" అని అమృతం అడిగాడు.

"లేదు. ఇంకా చెప్పు . . . " బెనర్జీ గొట్టంకి నిప్పు అంటించుకున్నాడు.

"చెప్పడానికి  మరేం ఉంది?"

"ఈ చిక్కులూ, విమర్శలూ -  వదిలేయ్ . . . అసలు నీ ప్రశ్న ఏమిటో చెప్పు . . . "

అమృతం కొంచెం సేపు మౌనం వహించాడు: 'వీడికి చెప్పాలా? పెళ్ళవని వీడికి నా ప్రశ్న చెప్తే బోధపడుతుందా? అసలు స్త్రీ జాతి అంటేనే విషమని తప్పించుకునేవాడు నా మాటలు విని నవ్వుతాడేమో? . . . వాడిలా ఉండడానికి ఏదో మంచి కారణం ఉండాలి, దానిగురించి నాకు చెప్తాడేమో? నేనెందుకు నా ప్రశ్న వీడికి చెప్పకూడదు?'

'అసలు ఇందులో ప్రశ్న అంటూ ఏముంది? భాను నన్ను రమ్మని చెప్పి, ఇల్లు తాళం వేసుకొని ఎక్కడికో వెళ్ళిపోయింది. ఆ తరువాత తన బాధ్యత ఇంటికి సూటిగా తిరిగి వెళ్లి  తిలకంకి Nehru Park లో  driving నేర్పడమే కదా? కాని తన మనసులో సగం అందుకు ఏకీభవించకుడా ఉంది; అది కలలు కంటూ నెమరువేస్తోంది . . . '

"నువ్వేం computer అనుకున్నావా -  నా ప్రశ్న ఏమిటని చెప్తే వెంటనే జవాబు ఇవ్వడానికి?"

బెనర్జీ రెప్పవాల్చకుండా అమృతంని చూసాడు.

"విను, మానవుడు పడే చిక్కులన్నీ వాడే స్వయంగా సృష్టించుకున్నవి, మరేం కావు. ప్రకృతికి మానవుడికీ మధ్య జరిగే పోరాటంలో మానవుడు అనుభవించే చిక్కులన్నీ స్వభావంగా ఏర్పడినవి. తన అహం కొనియాడాలని మానవుడే 'మానసిక బాధ' అనేది సృష్టించుకున్నాడు . . . అందులో నాకు ఎక్కువగా నమ్మకం లేదు! . . . "

"నీకని ఒక శిష్య పరంపర ఎందుకు లేదని నాకు వింతగా ఉంది. ఒక మతగురువుకి కావలసిన అన్ని యోగ్యతలూ నీకు తప్పకుండా  ఉన్నాయి . . . " అని అంటూ అమృతం నవ్వాడు.

"హాస్యం అలా ఉండనీ . . . నేను చెప్పేది సరే అని ఒప్పుకుంటావా?"

"అసలు నువ్వు ఏమంటున్నావో నాకు బోధపడకుండా నేనెలా జవాబు ఇవ్వగలను? 'ప్రకృతికి మానవుడికీ మధ్య జరిగే పోరాటం' అంటున్నావ్ . . . అంటే ఏమిటి అర్థం?"

"ప్రకృతికి మానవుడికీ మధ్య జరిగే పోరాటంకి జీవితం అని పేరు. మానవుడు జీవించడమే వాడి విజయం, చావు వాడి పరాజయం. పోరాటం అనేది శారీరక రీతిలోనే సాగుతుంది. మనసు కల్పించుకున్న భయంకరమైన బాధలకి మానవుడికే బాధ్యత, ప్రకృతికి కాదు."

" 'ఈ చిక్కులున్నాయి' అని ఒప్పుకుంటే, మనం జీవితంని సార్ధకంగా నమ్ముతున్నాం అన్నమాట. ఇందులో కల్పన  ఎక్కడ వచ్చింది?"

“నువ్వు భౌతిక రీతిలో మానవుడుగా ఉన్నావుగా, మరెందుకు భౌతిక రీతిలో జీవించకూడదు? నీకున్న ప్రశ్నలు - అదిగో, అక్కడ పరుగెడుతున్న ఆ కుక్కకి ఉన్నాయా? దాని ప్రశ్నలన్నీ సమకాలంలో ఎలా తీర్చుకోవాలనే . . . ”

అమృతం బెనర్జీ చూపించిన దిశలో దృష్టి మళ్ళించాడు. ఒక అందమైన, పొట్టి తెల్ల కుక్క ఒక బంతిని తరుముతూ సరదాగా కనిపించింది; ఇద్దరు ముగ్గురు పిల్లలు దాన్ని చూసి చప్పట్లు కొట్టారు.

“విను. ఆ దృశ్యం చూసిన తరువాత నీ మనసులో ఏ ఆవేశమూ లేదంటే నేనిక నీతో వాదించడంలో లాభం లేదు. నువ్వొక యంత్రం అన్నమాట; నీకు మనుషుల స్వభావం బోధపడదు.”

“ఇలాంటి జడ్డి మనోభావం వలనే జీవితంలో చిక్కులు ఇంకా బలంగా మనల్ని పీడిస్తున్నాయి. కొన్నిసమయాల్లో ఎద్దైనా చూడడానికి ముచ్చటగా కనిపించవచ్చు. కాని ఆ అభిరుచివలన నేను నాకున్న లోకజ్ఞానం వదలుకోను. నాకు జీవితంలో ఏమిటి కావాలని తెలుసు. అందుకోసం నేను ప్రయత్నం చేస్తున్నాను.”

వంటవాడు ఒక పళ్ళెంలో వేడి తేనీరు తీసుకొని వచ్చాడు; బెనర్జీ తేనీరు తాగుతూ మాట్లాలాడాడు.

వంటవాడు తెచ్చిన ఇంకొక పళ్ళెంలో ఉన్న బిస్కట్లలలో ఒకటి తీసుకొని అమృతం నోటిలో వేసుకున్నాడు.

అప్పుడే టెలిఫోను మ్రోగింది. బెనర్జీ వెళ్ళి రిసీవరు అందుకున్నాడు.

“బెనర్జీ here . . . ”

అలా అన్న తరువాత బెనర్జీ అమృతంని చూసాడు.

“జీ హా . . . ఉన్కే సాత్ బాత్ కప్నా హై?”

రిసీవరు కింద ఉంచేసి బెనర్జీ చెప్పాడు: “Mrs. Amirtham.”

అమృతం మొహం ఎఱ్ఱబారింది: ‘గూఢచారితనం అంటే ఇదే!’

పట్టరాని కోపంతో అమృతం లేచి వెళ్ళి ఫోనులో మాట్లాడాడు.

“ఏమిటి?” అనే కంఠస్వరంలో అతని చిరాకు తెలిసింది.

“ . . . మీరు రావడానికి ఆలస్యం అవుతుందా?”

“నీకెందుకు అనుమానం? . . . నేను బెనర్జీ ఇంట్లోనే ఉన్నాను . . . ”

ఆరిపోయిన తన పొగాకు గొట్టంని వెలిగించుకున్న బెనర్జీ అమృతం తన పేరు పలకడం విని తిరిగిచూసాడు.

‘ఎందుకు తనకింత కోపం?అతను ఆమెకి చెప్పినట్టు బెనర్జీ ఇంటిలో ఉన్నాడా లేదా అని తిలకం తెలుసుకోవడానికి పూనుకుందనా? లేకపోతే మరేం చేతకాక తను బెనర్జీ ఇంటిలో వచ్చినందుకా?

“కోప్పడకండి . . . మీరు మోసం చెయ్యరనే నమ్మకం నాకు లేకపోలేదు . . . నేను . . . నేను . . . ” తిలకం ఇంకా ఏదో చెప్తూనే ఉంది; అమృతం సంభాషణ ముగించేసాడు.

“Something wrong?” అని బెనర్జీ అడిగాడు.

అమృతం జవాబు చెప్పక చాలా సేపు అలాగే నిల్చున్నాడు.

బెనర్జీ అమృతంకి తేనీరు అందించాడు.

“వేడిగా ఉందా?”

ఉందని అమృతం ఊపాడు.

“నీ భార్య దగ్గర నా పేరు చెప్పావ్ . . . ఎందుకని?”

“నేను మీ ఇంటికి వస్తున్నానని చెప్పాను. అది నిజమో కాదో దానికి తెలియాలి!” అని చెప్పి అమృతం నవ్వాడు.

“ఆమె అనుమానంకి కారణం?”

అమృతం మౌనం వహించాడు. తేనీరు తాగిన తరువాత మాట్లాడాడు: “నువ్వు ఎక్కడకి వెళ్ళినా, ఏం చేసినా ఎవ్వరూ నీకు ఫోను చేసి నువ్వేం చేస్తున్నావని తెలుసుకోడానికి ప్రయత్నించరు. నువ్వు నిజంగా అదృష్టవంతుడువి. నీకు నీ స్వతంత్రంని కాపాడుకోవడం తెలుసు.”

“భవిష్యత్తులో నీ జీవితం ఏలా ఉండాలని ఏరుకొనే అవకాశం నీకూ ఉండేది.”

“దయ చేసి నేనొక దుర్బలమైన జీవి అని పదే పదే నాకు గుర్తు చెయ్యవద్దు! . . . నాకు నువ్వంటే కూడా పగ, ద్వేషం రావచ్చు” అన్నాడు అమృతం.

## 10

బెనర్జీ నివ్వెఱపోయి అడిగాడు: “ . . . ‘నువ్వంటే కూడా’ . . . అంటే ఏమిటి అర్థం?”

“నాకు నామీదే ద్వేషం వచ్చేసింది . . . ”

బెనర్జీ నవ్వాడు. “పూర్తిగా అరిగిపోయిన మాటలివి. నీ నీడని చూసి భయపడడం వలన ఇదొక మానసిక ప్రశ్నగా నీకు కనిపిస్తోంది. నీకు నీమీదే ద్వేషం రావడం వలన నీ అహంకి తృప్తి కలిగిందంటే దానికి మరెవరు అడ్డు చెప్పగలరు?”

“నీతో కొన్ని విషయాలు మాట్లాడాలని ఉంది. చెప్పమంటావా?”

“నువ్వు రాగానే అది నాకు తెలిసిపోయింది . . . సరే, ఆరంభించు . . . ”

“నీ దగ్గర cigarette ఉందా?”

“లేదు . . . cigar ఉంది . . . ”

‘‘సరేలే, . . . ఇయ్యి . . . ’’

అమృతం పొగచుట్టని వెలిగించుకున్నాడు. రెండు మూడు సార్లు ఊపిరిని లోపల ఈడ్చుకొని, కొంచెం దగ్గి, మాట్లాడాడు.

‘‘నా పెళ్ళికి ముందు నాకొక అమ్మాయితో పరిచయం ఉండేదని నీకు చెప్పడం నాకు గుర్తుంది.’’

బెనర్జీ తలూపాడు.

‘‘ఇటీవల నేనొక తమిళ నాటకంకి వెళ్ళాను. అందులో నటించిన ఒక అమ్మాయి నా పాత స్నేహితురాలులాగ కనిపించింది. నా మనసులో లోతుగా పాతుకుపోయిన కొన్ని భావనలు పునరుద్ధరించాయి. నేను నా భార్యతో గడుపుతున్న జీవితం - ఈ సామాజిక ధర్మంని అనుసరించి నడిపే జీవితం - నకిలీ జీవితమని నాకు చిరాకుగా ఉంది. తన్ను విడిచి ఏ పర స్త్రీతోనూ తన భర్తకి పొత్తు లేదని బలవంతంగా నమ్ముకున్న నా భార్య నేను నా పాత స్నేహం గురించి చెప్పగానే ఉలికిపడింది. నాటకంలో నటించిన అమ్మాయిని గురించి మళ్ళీ కలుసుకొనే అవకాశం నాకు ఏర్పడింది. ఇంతకాలమూ అబద్ధాలతో రాజీపడి జీవించిన నేను నిజం చెప్పేయాలని ఆమె గురించి నా భార్యకి చెప్పాను. అంతే, మా దాంపత్యం చిందరవందరంగా అయిపోయింది . . . ఏమీ అవనట్టు మేమిద్దరం ఒకరినొకరు మోసగించడానికి ప్రయత్నిస్తున్నాం . . . ’’

అప్పుడు వంటవాడు రావడం చూసి అమృతం మాటాడడం మానుకున్నాడు.

“ఏమిటి కావాలి?” అని బెనర్జీ అడిగాడు.

“బాపూజి ఇవాళ ఇక్కడ భోంచేస్తారా?” అని అడిగాడు వంటవాడు.

బెనర్జీ అమృతంని చూస్తూ చెప్పాడు: “అవును.”

అమృతం అందుకు ఆక్షేపించలేదు.

“నీకిక్కడ భోజనం అని నీ భార్యకి చెప్పావా?”

“అవును.”

బెనర్జీ చిరునవ్వు నవ్వాడు.

“నువ్వు చెప్పినట్టు నాకు మనోబలం లేదు. యధార్థంని సూటిగా ఎదుర్కొనే శక్తి నాకు లేదు. నాటకంలో నటించిన ఆ అమ్మాయికి నాపై కొంచెం ఆసక్తి ఉందని నాకనిపించింది. ఇవాళ ఉదయం ఆమె నాకు ఫోను చేసి వాళ్ళ ఇంటికి రమ్మని పిలిచింది. మేమిద్దరం Buddha Park వెళ్ళాలనుకున్నాం. నేను ఆమె ఇంటికి వెళ్ళి బయట కాచుకొని నిలబడ్డాను. అప్పుడే నాకు కొంచెం పరిచయమున్న ఇంకొకతని కలుసుకున్నాను, అతని ఇంటికి వెళ్ళి కొంతసేపు అక్కడ ఉన్నాను. అతనింటినుంచి తిరిగివచ్చినప్పుడు ఆ అమ్మాయి ఇల్లు తాళం వేసివుంది . . . నా భార్యకి చెప్పిన అబద్ధం కాపాడడానికి నిన్ను చూడాలని వచ్చాను . . .”

“ఇంతకీ నీ ప్రశ్న ఏమిటో నాకు అర్థం కావడంలేదు” అన్నాడు బెనర్జీ.

“అదే నిన్ను నేను అడగాలనుకున్నాను . . . ”

బెనర్జీ నిమ్మళంగా చెప్పాడు: “నీ ప్రశ్న . . . నువ్వే . . . ”

“నాకు బోధపడింది . . . ప్రతీ మనిషి స్వభావం అతని కర్మని బట్టి ఉంటుంది . . . దాన్నెవరూ మార్చలేరు . . . ”

“విను, Shakespeare పాత్రల్లాగ నీతో నువ్వే మాట్లాడడం అలవాటు చేసుకోవద్దు . . . నువ్వొక అమ్మాయిని ప్రేమించావ్, మానుకున్నావ్, ఇంకొక అమ్మాయిని పెళ్ళాడావ్ . . . పన్నెండు సంవత్సరాల తరువాత ‘నకిలీ జీవితం, ఇదీ, అదీ’ అని ప్రయాస పడుతుంటే ఇంకొక అమ్మాయిని చూసిన అనుభవంతో - బోధి చెట్టు నీడలో - నీకు జ్ఞానోదయం కలిగింది. ఈ సంకటంలో నీ చేతగానితనం వలన ‘స్వభావం’, ‘కర్మ,’ అని ఏమేమో చెప్పుకుంటే నీ ఆత్మకి తృప్తిగా ఉంది . . . నిన్ను చూస్తే నాకు జాలిగా ఉంది” అన్నాడు బెనర్జీ.

“నన్ను రమ్మని చెప్పేసి ఆమె ఎందుకు ఇల్లు తాళం వేసుకొని వెళ్ళిపోయింది? అదే నాకు అర్థం కావటంలేదు. ఆమె, ఆమె తల్లి ఆ ఇంటిలో ఉంటున్నారు. ఆమె తల్లి భర్తని వదిలేసి పది సంవత్సరాలముందు వచ్చేసింది. కూతురుకి తల్లి అంటే అసహ్యం; ఆమె సానుభూతి పూర్తిగా తండ్రితోనే. అతనూ ఇప్పుడు లేరు, పోయారు. ఆమెకు నేనంటే ఎందుకు మోహం అని నాకు చిక్కుగా ఉంది. కొంచెం ఆలోచించి చూస్తే . . . ” అని అమృతం అంటూంటే బెనర్జీ జోక్యం చేసుకున్నాడు: “నువ్వు Father image గురించి మాట్లాడుతున్నావా?”

“నీ మనసు చాలా క్రూరమైమది . . .అవును . . . ” అన్నాడు అమృతం.

బెనర్జీ చిరునవ్వు నవ్వాడు.

అమృతం ఆరిపోయిన పొగాకుచుట్ట వెలిగించాలని అగ్గిపెట్టెని చెయిలో తీసుకున్నాడు. కాని ఏదో ఆలోచన తరువాత దాన్ని నేలమీద పెట్టేసాడు.

“నేను ఏం చెయ్యాలని నీ ఉద్దేశం?”

“దేని గురించి?”

“ఆ అమ్మాయికి నిజంగానే నా మీద ఆసక్తి ఉందని రుజువైందనుకో, అప్పుడు నేనేం చెయ్యాలి?”

“నీ మనసులో నీకేంచెయ్యాలని ఉంది?”

“నా యవ్వనం పునరుజ్జీవింపజేయాలని నా అభిలాష; అదే భావన, అదే ఆవేశం, అదే క్రియ మళ్ళీ ఉత్సాహంతో నాకు సాధ్యమా అని నా పరిశోధన . . . గత కాల చరిత్రని కొనసాగించాలని నా ఆశ . . . ప్రతీ మనిషిలోనూ ఒక యయాతి దాక్కొనియున్నాడు . . . ”

టెనర్జీ లేచాడు. "సరే, రా, భోంచేద్దాం."

"అదేంటి, జవాబు చెప్పకుండా 'భోంచేద్దాం' అంటున్నావ్?"

"నువ్వు ఏది చెయ్యదలచుకున్నా సరే, నిష్కపటంతో చెయ్ . . . అంతకు మించి నేను మరేం చెప్పను . . . ఇప్పుడు నాకు ఆకలేస్తుంది . . . ఇదే నా ప్రశ్న . . . "

టెనర్జీ లేచి లోపలికి వెళ్ళాడు.

అమృతం కావాలనే ఇంటికి ఆలస్యంగా తిరిగివచ్చాడు. అతను వచ్చినప్పుడు కిద్వాయ్ నగర్ యావత్తూ నిద్రపోతోంది. ఏ ఇంటిలోనూ దీపం లేదు. ఎదుటి వీధిలో ఉన్న ఆసుపత్రి భవనంలో చాలా గదుల్లో దీపాలు వెలుగుతున్నాయి. ఈ క్షణం అక్కడ ఎంతమంది కన్ను మూస్తున్నారో? అందుకు విరుద్ధంగా ఆ పక్కనే ఉన్న సఫ్దర్ జంగ్ ఆసుపత్రిలో పిల్లల జన్మలు సాగుతున్నాయా? . . . ప్రకృతికి విశ్రాంతి అనేది ఎప్పుడూ లేదు . . .

అతని ఇంటి వసారాలో దీపం వెలుగుతోంది; గదులన్నీ చీకటిగానే ఉన్నాయి.

అవాళ పౌర్ణమి కాబోలు; వెన్నెలని చూస్తే ప్రొద్దుటలాగనిపించింది.

బట్టలకి ఇస్త్రీ వేసేవాడు మేడమెట్ల దగ్గర నిద్రపోతున్నాడు. వాడిపక్కనే కట్టె బండి ఉంది.

"కోన్ హై?"

"సోయా నై, సునిలాల్?" అని అమృతం అడిగాడు.

"బాపూజీ, నమస్తే . . . "

అమృతం calling bell నొక్కగానే లోపలినుంచి తిలకం అడిగింది: "కోన్ హై?"

"నేనే . . . "

తిలకం దీపం వేయకుండా తలుపు తెరిచింది. అమృతం లోపలికి రాగానే తలుపు మూసింది.

అమృతం తన గదికి వెళ్ళి దుస్తులు మార్చుకొని వచ్చేసరికి తిలకం మళ్ళీ పడుకుంది.

"నీ మనసులో ఏముందని? ఎందుకు ఫోను చేసావ్?" అని అమృతం అడిగాడు.

"ఉత్తికే, మీరు రావడానికి ఆలస్యం అవుతుందా అని అడగాలని. మీరూ ఆలస్యంగానే వచ్చారుగా? ఇప్పుడు టైమెంత . . . ?"

"నీకెందుకు నా గురించి అంత అనుమానం? నేనుగాని టెనర్జీ ఇంట్లో లేనంటే ఏంచేసి ఉంటావ్?

"మీరక్కడే ఉన్నారుకదా? అలా కాకపోతే నేనేం చేసివుంటానని ఆ ఘటన తరువాత మనం మాటాడుకుందాం . . . ఇప్పుడు నిద్రపోండి . . . "

"విను. ఇక నేను బయటకి వెళ్ళినప్పుడు ఎక్కడకి వెళ్తన్నాను అని నీకు చెప్పాలనే అగత్యం లేదు, తెలిసిందా? ఇక నువ్వుకూడా ఎక్కడైనా వెళ్ళవచ్చు, నేనేం అడగను . . ."

"సరేలేండి . . . ఆ అమ్మాయి ఎందుకు మీకు ఫోను చేసింది?"

అమృతం నివ్వెఱపోయాడు. మంచి వేళ, దీపం లేదు.

"ఏ అమ్మాయి?"

"అదే, ఆ అమ్మాయి భాను . . . 'మీరు ఉన్నారా?' అని అడిగింది. లేరన్నాను . . . 'ఉత్తికే పిలిచాను' అని చెప్పింది . . . ఆమె మీకెందుకు ఫోను చెయ్యాలి? ఈ నంబరు ఆమెకి ఎలా తెలుసు?"

"నంబరా? నేనే ఇచ్చాను. ఎప్పుడు ఫోను చేసింది?"

"మీరెందుకు అడుగుతున్నారు? ఆమె ఫోను చేసినప్పుడు ఇంటిలో లేకపోవడం మీకు బాధగా ఉందా?"

“Nonsense . . . వాళ్ళ అమ్మకి జబ్బుగా ఉందేమో?ఏదైనా సాయం కావాలని ఫోను చేసివుంటే? . . . ”

“సాయం కావాలంటే మిమ్మల్నే పిలవాలా ఏమిటి? ఆమెలాంటి అమ్మాయికి సాయం చెయ్యడానికి చాలామంది పోటీపడుతూ వస్తారు . . . ”

“‘ఆమెలాంటి అమ్మాయి’ అంటే ఏమిటి అర్థం?”

“నేను చెప్పినదే అర్థం . . . ఇక మీరు నిద్రపోండి . . . ఉదయం మాట్లాడుకుందాం . . . ”

‘భాను ఎందుకు ఫోను చేసివుంటుంది? తను వెళ్ళినప్పుడు ఇంటిలో లేనందుకు క్షమాపణ కోరాలనా? నిజంగానే ఆమె తల్లికి అస్వస్థతగా ఉందేమో? తను ముందు వెళ్ళి చూసినప్పుడు ఆమె ఇంటికి తాళం లేదు. ఆ తరువాత తాళం వేసుకొని భాను వెళ్ళిపోయింది. మరెక్కడనుంచి ఫోను చేసి ఉంటుంది? ఎక్కడైనా, ప్రత్యేకంగా ఒక చోట కలుసుకుందామనని చెప్పడానికా?అంటే, ఎన్ని గంటలకి ఫోను చేసివుంటుంది?’

‘తిలకంని అడుగుదామా?’ అని అమృతం ఆలోచించాడు. ‘నిన్న రాత్రిలాగ ఇంకొక భూకంపం ఏర్పడవచ్చు’ అని మౌనంగా నిద్రపోయాడు.

మరుదినం ఆఫీసుకు వెళ్ళినప్పుడు అమృతంకి All India Radio ఆఫీసుకి కి వెళ్ళి భానుని చూడాలనిపించింది. ఆమె ఏ శాఖలో పని చేస్తోందని అతనికి తెలియదు, ఎవరినైనా అడిగి తెలుసుకోవాలి. తను ఆఫీసునుంచి ఫోను చెయ్యడం అసాధ్యం. సూటిగా వెళ్ళడమే మంచిది. ఎవరిని అడగాలి? Reception లో అడగాలి. అమృతంకి తెలిసిన చాలామంది అక్కడ పని చేస్తున్నారు, వాళ్ళ చూపుల్లో తను పడకూడదు. ‘ఏది చేసినా నిష్కపటంగా చెయ్’ అని బెనర్జీ సందేశం గుర్తుకి వచ్చింది: నిష్కపటం అంటే ఇదేనా? దేవుడా, నా బలహీనత గురించి చెప్పుకొడానికి మరేంకావాలి?’

అమృతం కారుని All India Radio తోటలోకి పోనిచ్చాడు. అతను ఆఫీసులో ప్రవేశించగానే - ఏం ఆశ్చర్యం - భాను కనిపించింది!

‘‘భాను . . . ’’ అని మెల్లగా పిలిచాడు.

ఆమె తిరిగి చూసింది: ‘‘మీరా? . . . ఎంత ఆశ్చర్యం!’’

‘‘నిన్న నీకేమైంది?’’

‘‘నన్ను క్షమించండి . . . దానిగురించి మీతో చాలా కబుర్లు మాట్లాడాలి . . . ఎప్పుడు కలుసుకుందాం?’’

‘‘నేను మళ్ళీ వచ్చి తాళం వేసిన మీ ఇల్లు చూడాలంటున్నావా? ఇంతకుముందే నేను జడ్డి అని నీ మనసులో ఉందికదా?’’

భాను అది ఎదురుచూడలేదు. గభీమని అతని రెండు చేతులూ పట్టుకుంది: ‘ఎంత మృదువైన స్పర్శ!’

“మీకు నాపై నమ్మకం ఉంటే ఇవాళ సాయంకాలం Connaught Place లో ఏదైనా ఒక హోటల్లో కలుసుకుందాం . . . నేను మీతో తప్పకుండా మాటాడాలి.”

అమృతం తన చేతులు విడవకుండా అలాగే నిల్చున్నాడు.

“ఏమంటారు? మనం కలుసుకుందామా?”

“సరే, Palace Heights లో కలుసుకుందాం . . . నేను సరిగ్గా ఆరు గంటలకి వస్తాను.”

భాను మొహంలో చిరునవ్వు కనిపించింది: “నేను సాయంకాలం చెప్పే విషయాలు విని మీరు ఉలికిపడకూడదు.”

“ఏం విషయాలు?”

“సాయంకాలం కలుసుకుందాం . . . Bye . . . Bye . . . ” భాను వెళ్ళిపోయింది.

భాను తనకేం చెప్పబోతోంది? ఇక నన్ను చూడడానికి రావద్దనా? లేకపోతే, తనకి తెలిసినట్టు 'మీరు నా నాన్నగారులాగ!' అని ఆనవాలు చెప్పడానికా? తిలకం ఆమెకి ఏదైనా చెప్పి ఉంటుందా? భాను తనకి మరేం చెప్పలేదని తిలకం అనలేదూ? భాను తన తల్లిగురించి చెప్తుందేమో? లేకపోతే భాను ఒక యువకుడిని ప్రేమించి, వాడికోసం . . . ఛీ, ఛీ, భాను అలాంటి అమ్మాయి కాదు, ఆమెలో పక్వత, వివేకం కనిపిస్తున్నాయి.

## 11

ఆ రోజు అమృతం ఆఫీసులో ఏ పనీ చెయ్యలేకపోయాడు. Joint Secretary అతన్ని ఒక వివాదం కోసం పిలిచారు. అమృతం ధోరణి చూడగానే అతనికి అమృతంకి పనిలో ఆసక్తి లేదని తెలిసిపోయింది.

"మీకు అస్వస్థగా ఉందా?" అని అతను అడిగారు.

"లేదే?"

"కావాలంటే దీనిగురించి మనం రేపుకూడా మాటాడవచ్చు . . . ఈ వారం లోపల తుది నిర్ణయం చెయ్యాలి."

అమృతం జవాబు చెప్పకుండా ఊరుకున్నాడు. అధికారి దేనిగురించి తన్ను వివాదంకి పిలిచారో, ఆ ఫైలులో ఏముందో అమృతంకి తెలీదు. మూడురోజులుగా ఆ ఫైలు అతని మేజామీద నిద్రపోతోంది. రేపు అధికారితో దానిగురించి మాటాడాలంటే దాన్ని తప్పకుండా ఇవాళ చదివితీరాలి. భాను, ఫైలు - ఈ రెండింటిలో ఒకటే సాధ్యం . . . అమృతం తన ఆపీసులో ఆ ఫైలుని తెరిచి చదవసాగాడు.

ఐదు గంటలు దాటి నలభైయైదు నిమిషాలవరకూ అమృతం తన అధికారి, తోటి ఉద్యోగులతో ఆ ఫైలు గురించి వివాదంలో కలుసుకున్నాడు. అతను ఆఫీసునుంచి బయటకి వచ్చేసరికి ఆరు గంటలైపోయింది.

Palace Heights బయట భాను నిల్చొని ఉంది. ఉదయం చూసినట్టు ఆమె ప్రకాశవంతంగా, చురుగ్గా కనిపించింది.

"నేనిప్పుడే తిరిగి వెళ్ళిపోదామనుకున్నాను . . . కాచుకోవడమంటే బాధగా ఉంది . . . "

"నువ్వు నాకోసం పదిహేను నిమిషాలు కాచుకొని ఉన్నావ్. కాని నేను నీకోసం 24 గంటలు కాచుకొని ఉన్నాను" అన్నాడు అమృతం.

"అలాగైతే నేనే మళ్ళీ మీదగ్గర క్షమాపణ కోరాలి . . . " అని అంటూ తలని ఒక పక్క వొంచి భాను చిరునవ్వు నవ్వింది. ఆ యౌవన ఆకర్షణలో అమృతం గత పన్నెండు సంవత్సరాల ముందు ఘటనలు గుర్తుచేసుకున్నాడు. ఇదే Palace Heights Hotel కి అతను మొట్టమొదట నిత్యాతో వచ్చాడు. ఆ రోజు నిత్యా Salwar Kameez తో వచ్చింది. ఇప్పుడు చీరలో వశపరచే అదే అందం కనిపిస్తోంది. అమృతం రెప్పవాల్చకుండా అలాగే నిల్చున్నాడు.

"ఏమిటలా చూస్తున్నారు?" అని భాను అడిగింది.

"ఇంత అదృష్టంకి నాకు అర్హత ఉందా? అని ఆలోచిస్తున్నాను."

"చరిత్రలో మనం చదివే కథానాయకుడులాగ మీరు మాట్లాడుతున్నారు . . . "

"అంటే?"

"ఇప్పుడెల్లా భావావేశాలు మాటల్లో వ్యర్థం చేసే అలవాటు లేదు . . . అదెలాగో ఉండనీ . . . మనం మీదకి వెళ్దామా?"

నిత్యా lift దగ్గర వెళ్ళి నిలబడింది.

"Lift వద్దు . . . " అన్నాడు అమృతం.

"ఎందుకు?"

“తొందర తొందరగా పోటీపడుతూ స్వర్గానికి lift లో వెళ్ళకూడదు;  మెల్లమెల్లగా మెట్లెక్కి వెళ్ళాలి, అప్పుడే చాలా సరదాగా ఉంటుంది . . . ”

“ఎలాగైనా మనం స్వర్గంనుంచి కిందకి దిగి రావాలికదా?”

“స్వర్గమంటూ ఏదీ లేదు - నువ్వు పక్క ఉంటే చాలు . . . ”

ఆమె తన చెయిలో ఉన్న గులాబి రంగు రుమాలుతో అమృతం బుగ్గని లేతగా తాకింది. అబ్బా, ఎంత ఘనమైన సువాసన!

భాను  lift దగ్గర వెళ్ళి నిల్చుంది.

“Lift వద్దు, మెట్లెక్కుదాం  . . . ” అన్నాడు అమృతం.

“ఎందుకు?”

పన్నెండు సంవత్సరాలముందు తను చెప్పిన ఆ మాటలు ఇప్పుడు అమృతం చెప్పలేకపోయాడు; జంకాడు. నిత్యా చెప్పినట్టు తను స్వర్గంనుంచి దిగివచ్చేసాడా?మళ్ళీ పైకి పోవడం అసాధ్యమా?

“మెట్లెక్కి వెళ్తే మంచి exercise, అవునా?”

“అవును, నువ్వన్నది నిజం . . . ”

తిలకం అమృతంకి పదే పదే చెప్తూండేది: “మీకు వయస్సు 35 దాటేసింది . . . ప్రొద్దున్నే లేచి కొంచెం నడవండి . . . Exercise చేస్తే మంచిదేకదా?”

“నీకేం భయం వద్దు . . . నేను 80 బతికి వరకూ ఉంటాను . . . ”

“నేను మంచిది చెప్తే మీరు వినరు; ఎగతాళి చెయ్యడం మీకు అలవాటైపోయింది  . . . ”

మూడు అంతస్తులు ఎక్కడంతో అమృతంకి శ్రమ వచ్చేసింది;  శ్వాస మందంగా  కనిపించింది.

“మనం Lift లో వచ్చివుంటే బాగున్ను . . . మీకూ బాధగా ఉందే . . . ”

నిత్యాతో ఎన్నిసార్లు ఈ మెట్లెక్కి అమృతం ఈ హోటలుకి వచ్చివున్నాడు -  అది పన్నెండు సంవత్సరాల ముందు! విజ్ఞానులు చంద్రమండలంకి, శుక్రమండలంకి ప్రయాణం చెయ్యడానికి మార్గం కనిబెట్టారు కాని ఎందుకు కాలంని ఆపలేకపోయారు?

అమృతం, భాను హోటలు ప్రవేశించినప్పుడు హాలులో ఎక్కువగా ప్రజలు లేరు. పన్నెండు సంవత్సరాల ఎడబాటులో చాలా మార్పులు కనిపించాయి. ముందు గల్లాపెట్టె పక్కన నెరసిన తలతో ఒకతను ఉండేవాడు; ఇప్పుడున్నది ఒక యువకుడు.

అమృతం యువకుడిని అడిగాడు: “Any table free?”

“Oh, yes!” అని చివరన ఉన్న ఒక మేజాను యువకుడు చూపించాడు.

“పన్నెండు సంవత్సరాల ముందు నేను ఇక్కడకి తరచుగా వస్తూండేవాడిని; అప్పుడొక ముసలాయన ఉండేవారు . . . ”

“మీరు మాథూర్ గురించి అడుగుతున్నారా?”

“నాకు పేరు తెలీదు . . . ”

“అతను పోయారు . . . రెండు సంవత్సరాలైపోయాయి.”

అమృతంకి ఎలాగో అనిపించింది. పన్నెండు సంవత్సరాలంటే పెద్ద మార్పు వచ్చేసిందా?

మరేం అనక నవ్వుతూ అమృతం ఆ యువకుడు చూపిన జాగాలో కూర్చున్నాడు. Floor Music - ఏదో Pop Music సాగుతోంది; అందరూ వింటున్నారు.

అక్కడున్నవారిలో అధికంగా యువతీయువకులే కనిపించారు. అమృతంకి పోలిన వయసులో ఒకతను మాత్రం తన భార్య, పిల్లలతో ఉన్నారు; నలుగైదుగురు పిల్లలు. అతని భార్య గొంతుకమ్ముకొని వాళ్ళని మందలించుతోంది. అతనేదీ జోక్యం చేసుకున్నట్టు కనిపించలేదు, చుట్ట తాగుతున్నారు; మొహంలో సంతుష్టి చోటుచేసుకుంది.

ఆ floor Music ని అనుసరించి భాను దేహం లేతగా ఆడుతోంది. ఇంతకు ముందు అమృతంకి పక్కన కూర్చున్న ఆమె ఇప్పుడు లేచి వచ్చి అతని ఎదుట కూర్చుంది.

''ఈ music ఎంత బాగుంది!'' అంది.

''నీకిష్టమంటే నాకూ బాగుంది'' అన్నాడు అమృతం.

వాళ్ళిద్దరూ ఉన్న చోటుకు కొంచెం దూరంలో ఒక యువకుడు, యువతి కూర్చొనివున్నారు. యువకుడుకి వయసు 22 ఉండవచ్చు; దువ్వకుండా వదలేసిన దట్టమైన, మకమకలాడే పసుపుపచ్చని జుత్తు భుజంమీద వాలివుంది; మీసం చెవులవరకూ వ్యాపించివుంది. అతను తొడుక్కున్న చొక్కాయిని చూస్తే వీపులో ఒక బొత్తాము, ఇంద్రధనుస్సు కనిపించాయి. పాలవంటి మొహం. అతని పక్కనే ఉన్న యువతికి వయసు ఇరపై ఉండవచ్చు. మొహంలో అతన్ని తన వెనుక తోకాడుకుంటూ రానిచ్చే చిరునవ్వు. అతని చెయిని తన చెయితో అందుకొని ఆమె సోఫాని ఆనుకొని ఉంది. యువకుడు వొంగి ఆమె చెవిలో ఏదో వల్లించుతున్నాడు. యువతి కన్నులు మూసివున్నాయి. మొహంలో నవ్వు, అతను చెప్పేది ఆమె లెక్కచేసినట్టు కనిపించలేదు.

అప్పుడే కుటుంబంతో వచ్చినతను లేచి వెళ్ళారు. అమృతంకి తన్ను ఒంటరిగా వదిలేసినట్టనిపించింది.

తటాలున సంగీతంకి పిచ్చి పట్టినట్టు అన్నీ వాద్యాలు సమశ్రుతిలో మ్రోగాయి.

'దేవుడా, ఇదేం సందడి!' అని అమృతం విసుగ్గున్నాడు.

"భలే, ఎంత బాగుంది!" అంది భాను.

పన్నెండు సంవత్సరాలముందు అమృతంకి ఈ సంగీతం సందడిగా కనిపించలేదు. ఈ హాలులో యౌవనం ఉత్సాహంతో గెంతులు వేసి ఆడుతోంది. ఆ క్షణం తనకి తెలియకుండా మరెవరి ఇంటిలోనో ప్రవేశించినట్టు ఒక భావన రాగానే అమృతం జంకాడు. తను కాలు జారి మెట్లమీద దొర్లినట్టూ, చుట్టూవున్న జనులు చూసి నవ్వుతున్నట్టూ తత్తరపాటు కలిగింది: 'ఛీ, ఇదే హోటల్లో పన్నెండు సంవత్సరాలముందు నేను యౌవనం పోగొట్టుకున్నాను. ఇప్పుడు వచ్చి వెతికితే అదేం దొరుకుతుందా?'

భానుని అక్కడే వదిలేసి, ఆ క్షణమే పారిపోవాలని అమృతంకి అనిపించింది. అదిగో, ఆ యువకుడు కళ్లలో కలలు కంటున్నాడు; ఈ లోకంని తన భుజాల్లో మోయగల త్రాణ వాడికుంది. భాను వాడి పక్కన కూర్చోవాలి, అదే న్యాయం; తన పక్కన వచ్చి ఎందుకు కూర్చొంది?

అప్పుడే ఒక యువకుడు - waiter - వచ్చి అమృతం ముందు నిల్చున్నాడు.

"నీకెమిటి కావాలో చెప్పు" అని అమృతం ఆమెను అడిగాడు.

"హాటెక్[3], కాఫీ . . . "

అమృతం తనకీ అదే కావాలని ఆర్డరు ఇచ్చాడు. తరువాత భానుకి చెప్పాడు: "అసలు నీకెది ఇష్టమని నాకెప్పుడూ తెలీదు."

భాను చిరునవ్వు నవ్వింది: "అదే మీకు బాధగా ఉందా?"

అమృతం ఆమెను రెప్పవాల్చకుండా చూసాడు. నిత్యా కూడా ఇలాంటి సమయంలో ఇలాగే మాటాడివుంటుంది.

"ఏమిటలా చూస్తున్నారు?"

"నాతో మాటాడడానికి చాలా కబుర్లు ఉన్నాయి అని అన్నావుగా?"

---

[3] ఇది కొరియాలో ప్రాభల్యమైన దోసావంటిది

భాను వేళ్ళు menu కార్డుని లేతగా తాకాయి.

"మీకు తరచుగా ఈ హోటలుకి వచ్చే అలవాటు ఉందా?"

"ఇదేనా నువ్వు నన్ను అడగవలసిన ముఖ్య ప్రశ్న?"

భాను నవ్వేసింది. "ఏదో అడగాలనిపించింది, అడిగాను."

కొంచెం సేపు మౌనం. ఎవరూ మాటాడలేదు.

"In fact, పన్నెండు సంవత్సరాల తరువాత నేనిక్కడికి వస్తున్నాను . . . " అన్నాడు అమృతం.

"I see . . . పన్నెండు సంవత్సరాల తరువాత . . . " భాను కొంచెం జంకింది. ఆమె ఇక ఏమంటుందో విందామని అమృతం కాచుకొని ఉన్నాడు.

"పన్నెండు సంవత్సరాల తరువాత?" ఆమె మౌనం చూసి అమృతం అడిగాడు.

"అందులో ఏమైనా గూఢార్థం ఉందా?"

మేజామీద రెండు చేతులూ ఆనుకొని కూర్చున్నవాడు సోఫా వెనుక వాలాడు.

"అదెలాగో పోనీ . . . నాకు ఏంచెప్పాలని ఇక్కడకి రమ్మన్నావ్?"

"నిన్న మిమ్మల్ని రమ్మని పిలిచి నేను ఇల్లు తాళం వేసుకొని వెళ్ళిపోయానని మీకు కోపం కదూ?"

"కోపం లేదని అంటే నీకు నిరాశగా ఉంటుందా?"

ఆమె మొహంలో కనిపించిన చిరునవ్వులో ఒక గీకు. "మీ మనసులో ఏముందో నాకు బోధపడింది. కాని నాకున్నది చలన బుద్ధి అని అనుకోవద్దు."

అప్పుడే waiter హాటెక్, తాగడానికి నీళ్ళు తీసుకొని వచ్చాడు.

"నీకు చలన బుద్ధి అని ఎవరన్నారు? నువ్వే కల్పించుకున్నావా?"

"అలాగేం కాదు. నా వయస్సులో ఎవరికైనా చలన బుద్ధి ఉండడం న్యాయం. ఆ పొరబాటు చెయ్యవద్దని మీకు హెచ్చరిక చేసాను."

"హెచ్చరిక?"

"అవును, హెచ్చరిక . . . నాకేంకావాలో నేను సులభంగా నిర్ణయించలేను. కాని నిర్ణయించిన తరువాత దానిగురించి నాకు ఎటువంటి అనుమానం, కలవరం ఉండదు."

"సరేలే . . . అన్నీ చెప్పేసావా, ఇంకా ఉందా?"

భాను నవ్వింది: "నేనింకా ఆరంభించనే లేదు . . . "

"No . . . No . . . " అని కూతలు విని అమృతం తిరిగి చూసాడు. పక్కనేవున్న ఆ యువతీయువ జత మధ్య ఏదో తగవు. ఆ యువతి కంఠధ్వని కొంచెం అధికంగా మ్రోగింది.

"ప్రేమికుల మధ్య పోట్లాట" అంది భాను, కీటు గొంతుకలో.

అప్పుడే ఆ యువతి లేచి బయటకి వెళ్ళడానికి ప్రయత్నించింది, యువకుడు ఆమె చెయి పట్టుకొని కూర్చోబెట్టాడు. యువతి కసురుకుంటూ లేచి బయటకి నడిచింది. మేజామీదున్న పళ్ళెంలో ఒక పది రూపాయల నోటు పెట్టేసి, యువకుడు ఆ యువతి వెనుక పరుగెత్తాడు.

"ఆ అబ్బాయికి ఆ అమ్మాయంటే ఎంత గారాబం! చూసావా, ఎలా తోకాడుతూ ఆమె వెనుక వెళ్తున్నాడో?" అన్నాడు అమృతం.

"ఈ అబ్బాయి మాత్రం కాదు, ఈ రోజుల్లో అందరు అబ్బాయిలూ ఇలాంటివారే . . . బంతిని రువ్వితే నోటిలో పట్టుకొని వచ్చే సాహసం తప్ప వీళ్ళకి మరేం తెలియదు. అమెరికాలో ఉన్నవాళ్ళని చూసి కోతిలాగ పొటుగాటి జుత్తు, గడ్డం పెంచడం . . . ఇవన్నీ చూస్తే నాకు నవ్వాలనివుంది . . . "

యువకులంటే భానుకి ఎందుకు చికాకు? ఆమె చాలా ఆవేశంతో మాటాడుతోందని ఆమె కంఠధ్వని చెప్తోంది. నిత్యా ఇలాగెప్పుడూ మాటాడివుండదు. వయసుకి మించిన వివేకం వలనే భాను మనసులో ఇటువంటి ఆలోచన సాధ్యం. లేకపోతే మరే కారణమేమైనా ఉందా? యువకులని చూసి అసహ్యించుకునే అనుభవం భానుకి ఎలా వచ్చింది? 'చెప్పడానికి చాలా కబుర్లున్నాయి' అని చెప్పలేదూ? దీనిగురించి ఏమైనా చెప్తుందేమో?

అప్పుడే waiter కాఫీ తీసుకొని వచ్చాడు. భాను అమృతంన్ని "మీకెన్ని పంచదార బిళ్ళలు కావాలి?" అని అడిగింది.

"రెండు."

అతనికి రెండు బిళ్ళలు అందించి తన కాఫీలో ఒక బిళ్ళ మాత్రం వేసుకుంది.

"బరువు తగ్గాలని పంచదారని తగ్గించుకుంటున్నావు కాబోలు . . . " అని అన్నాడు.

"అలాగేం కాదు . . . నాకసలు తీపంటే ఇష్టం లేదు."

"నాకిప్పుడు బోధపడింది. యౌవనమూ ఇంపుగా ఉంటుంది, ఆదీ నీకు ఇష్టం లేదు."

"ఒక దశనుంచి ఇంకొక దశకి మారుతున్నప్పుడు - బాల్యం నుంచి యౌవనం, యౌవనం నుంచి నడివయసు . . . ఈ మార్పులు సొగసుగా సాగాలని నేనంటున్నాను . . . I mean . . . ఇప్పుడు మనం చూసాం కదా - తోకాడుతూ కనిపించే వీళ్ళని చూస్తే యౌవనం ఎవరికైనా ఇంపుగా కనిపిస్తూందా?"

"నువ్వు ఇలా అనడానికి ఏదో మంచి కారణముండాలని నాకనిపిస్తోంది . . ." అన్నాడు అమృతం.

"నేనింతవరకూ చెప్పినది చాలదా?" అని భాను అడిగింది.

"చాలదు."

భాను కాఫీ తాగింది. "మీకు మరేం కావాలి?"

"చెప్తే, వినడానికి సిద్ధంగా ఉన్నాను."

"మీరు నిన్న సాయంకాలం నాకోసం వచ్చినప్పుడు నేను ఎందుకు ఇంట్లో లేను అని మీకింకా చెప్పలేదు . . . అంతలోనే మనం మరేదేదో మాటాడుకుంటున్నాం . . . " అని అంటూ భాను handbag నుంచి ఒక రుమాలు తీసుకొని నోరు తుడుచుకుంది.

"చెప్తే, వినడానికి సిద్ధంగా ఉన్నాను."

"ఒక tape recorder కొని ఉంచుకోండి. మీకు బాగా పనికివస్తుంది" అని అంటూ భాను నవ్వింది.

"నాకు మరేం చెప్పాలో తెలీదు. 'చాలా కబుర్లున్నాయి' అని నువ్వే చెప్పావ్, అది వినడానికే నేను వచ్చాను . . . ఇంత సేపూ మనం గజిబిజిగా ఏదేదో మాటాడుకుంటున్నాం . . . "

"అవును. నిజం . . . అందుకు కారణం ఏమిటి?"

"చెప్పమంటావా?"

"చెప్పండి . . . ఎందుకు నన్ను బెదరిస్తున్నట్టు మాటాడుతున్నారు?"

"నా ఊహలు ఏమిటో చెప్పాను, విను . . . ఒకటి - నిన్న సాయంకాలం వరకూ నన్ను చూడాలా వద్దా అని నువ్వు నిశ్చయించలేదు, అందువలన నువ్వు మరెక్కడికైనా వెళ్ళివుండవచ్చు. రెండు - మీ అమ్మగారికి నువ్వు నన్ను కలుసుకోవడం ఇష్టం లేదు. అందువలన నేను మీ ఇంటికి వచ్చినప్పుడు కలిగే ఇబ్బందినుంచి తప్పించుకోడానికి మీ ఇల్లు వదిలేసి మరొక

జాగానుంచి నువ్వు నాకు ఫోను చేసావు. మూడు - ఏమిటి కారణం అని నాకు చెప్పాలని నువ్వు ఇంకా  నిర్ణయం చెయ్యకపోవడం వలన  మనం ఏదేదో మాటాడుకుంటున్నాం . . . ''

భాను తలని లేతగా వెనక్కి లాగ్గొని నవ్వింది: ''మీ అన్ని ఊహలూ పొరబాటు . . . ''

''పొరబాటు కాదని నేననలేదు.''

భాను అప్పుడు అక్కడ నడిచివెళ్తున్న ఒక హోటలు సిబ్బందిని పిలిచి చెప్పింది: ''ఔర్ దో కప్ కాఫీ లావ్ . . . ''

అమృతం ఆమెను వింతగా చూసాడు.

''మన సంభాషణ ఇప్పుడే ఆరంభమౌతోంది . . . '' అంది భాను.

అమృతం వినడానికి సిద్ధమైయ్యాడు; రెండు చేతులూ వెనక కట్టుకొని సోఫామీద ఆనుకున్నాడు.

భాను గొంతు సవరించుకొని ఆరంభించింది: ''నేను నిన్న ఎక్కడికీ వెళ్ళలేదు. మీరు రావడం చూసాను. మీరు కొంతసేపు వసారాలో  నిల్చున్నారు. నాకూ అమ్మకీ వాదం. నేను మీతో మెలగ్గూడదు, చూడకూడదు, మాటాడకూడదు అని ఒకటే గోల; నన్ను ఇంట్లో తాళం వేసి వెళ్ళిపోయింది. అమ్మ తిరిగివచ్చిన తరువాత నేను ఇంకొక ఇంటికి వెళ్ళి మీకు ఫోను చేసాను . . . ''

అమృతం కొంచెం సేపు మౌనం వహించి అడిగాడు: ''నాకిది చాలా వింతగా ఉంది. మీ ఆమ్మగారికి నేనంటే ఎందుకు అంత కోపం?''

''పెళ్ళవని ఒక అమ్మాయి పెళ్ళయిన ఒక మగవాడితో బయటికి వెళ్ళడానికి ఏ తల్లి ఒప్పుకుంటుంది?''

అమృతం మరేం జవాబు చెప్పలేక ఊరుకున్నాడు.

## 12

'భాను ఎందుకు ఇది నాకు చెప్తోంది?' అని అమృతం ఆలోచించాడు. ఇదేదో లోకంలో అందరికీ తెలిసినట్టు తమ ఇద్దరి స్నేహంని తన తల్లి అపార్థం చేసుకుందని భాను తనకి జాడగా చెప్తోందా? అంటే ఇది భాను తనకిస్తున్న హెచ్చరిక అనవచ్చా? అలా కాకపోతే 'మనకి ఇదొక ప్రశ్న; మీకు పెళ్ళయింది, మీరిక ఏం చెయ్యబోతున్నారు?' అని తనకి సవాలు చేస్తోందా?

"మీ అమ్మగారు ఏమంటున్నారో నీకు బాగా తెలుసు, మరెందుకు దానిగురించి వాదం?" అని అడిగాడు అమృతం.

"ఇంతకు ముందు మీకు చెప్పినట్టు నేను దేనిగురించీ సులభంగా నిర్ణయం చెయ్యను; నిర్ణయం చేసిన తరువాత దానిగురించి వెనకాడను. మిమ్మల్ని చూడాలని నిశ్చయించిన తరువాత అమ్మ ఏం చెప్పినా నేను వినడానికి సిద్ధంగా లేను. అమ్మలాగే నాకూ పట్టుదల ఉంది. అందువలనే ఈ పోరాటం. అమ్మ ఇల్లు తాళం  వేసి వెళ్ళిపోయింది, ఐనా నేను మీకు ఫోను చేసాను . . . "

"నన్ను చూసి తీరాలని నీకెందుకు అంత ఆవేశం?" అని అమృతం అడిగాడు.

"దీనికి జవాబు తెలియని సీదాసాదా మనిషి మీరు అని అంటే నాకు వింతగా ఉంది."

ఆమె జవాబు విని అమృతం మనసులో ఉత్సాహమూ, దిగిలూ కలిగాయి: 'సరే, చదురంగంలో  పాచికలు వేసిన తరువాత ఆట ఆడితీరాలి, అవునా?'

"నిన్ను ఒకటి అడిగి తెలుసుకోవాలి . . . " అని అమృతం మొదలుబెట్టాడు.

" దానికే Victorian Approach  అని పేరు . . . '' అని అంది భాను.

''అదెలాగో ఉండనీ . . . నా వయసెంత అని నీకు తెలుసా?''

''ఇలాంటి పిచ్చి ప్రశ్నలు అడగవద్దు . . . మీగురించి నాకున్న అభిప్రాయంకి నిరాశ కలగవచ్చు . . . ''

''ఏది పిచ్చి ప్రశ్న? నువ్వు ఆవేశంతో మాటాడుతున్నావని  అంటున్నాను . . . నేను అవన్నీ దాటేసాను . . . ''

“మీరేమో ఆవేశపడకుండా ఇవాళ ఉదయం నన్ను వెతుక్కుంటూ ఆఫీసుకి వచ్చారన్నమాట . . . మిస్టర్ అమృతం, నాకు నవ్వాలనిపిస్తోంది . . . ”

“నీకెందుకు యువకులంటే అసహ్యం అని నాకు ఆశ్చర్యంగా ఉంది.”

“మీరన్నట్టు అందుకు ఒక బలమైన కారణం ఉండవచ్చు . . . ” అని భాను నవ్వింది.

“అదీ నేనే ఊహించాలి కాబోలు . . . ” అన్నాడు అమృతం.

“ఎప్పటిలాగే మీ ఊహలన్నీ పొరబాటుగానే ఉంటాయి . . . మీ మొదటి ఊహ - నన్ను ఎవరో ఒక యువకుడు ప్రేమించి మోసం చేసాడని, అవునా? . . . అలాగైతే, అదీ తప్పే . . . ”

“సరే, నేనిక ఊహించనులే . . . నువ్వే చెప్పు . . . ”

“ఇప్పుడు తోకాడకుంటూ వెళ్ళాడే ఒక అబ్బాయి - అలాగే నూనూగు మీసంతో ఒక పోకిరీ వెధవ మా అమ్మకి మద్రాసులో friend గా ఉండేవాడు. ఆ వెధవతోబాటు నాన్నగారూ, అమ్మా ఇంటిలో చేసే గొడవ నేను భరించలేక పోయాను. వాళ్ళ ఉద్దేశం అమ్మ నాకోసమే ఆ యువకుడుని తన వలలో వేసుకుందని . . . ”

భాను నిష్కపటంగా మాటాడింది:

“నేను దీనిగురించి మాటవాసికి చెప్తున్నానని అనుకోవద్దు. నేను దీనిగురించి ఆలోచించి, ఆలోచించి ఆ విభ్రాంతి నాకు నిరర్థకమైపోయింది . . . ”

అలా చెప్పుకుంటూ భాను మేజామీదున్న గ్లాసుని గట్టిగా పట్టుకుంది. ఇంతసేపూ బైటకి దృఢమైన ఆమె చూపు తటాలున గ్లాసుమీద వాలింది. ఆ గట్టిపట్టుకి ఏమిటి కారణం - తల్లిమీద కోపమా, లేక యువకులంటే అసహ్యమా?

“నాకు అమ్మతో సహవాసం ఇష్టం లేదు, అది నేను దూరంచేసుకోవాలి . . . .”

అంటే ఆమె తన తల్లిని వదలించుకోడానికి అమృతం ఒక సాధనమా?

“నా సహవాసంలో నువ్వు నీ భద్రత గురించి ఆలోచించావా?”

“Nonsense . . . భద్రత గురించి నాకు విచారం లేదు . . . I like you . . . ఎందుకని నేను చెప్పలేను . . . మనిద్దరికీ ఒకేలాంటి అభిరుచి ఉందనే కారణం కావొచ్చు . . . ”

“భద్రత గురించి ఆలోచించని మొదటి అమ్మాయిని నేను ఇప్పుడే చూస్తున్నాను. అసలు ఏ యువతియైనా పెళ్ళికి ఏకీభవించడానికి మరేం కారణం ఉందా?”

“అవును, నిజం. మన సమాజంలో ముఖ్యమైన పాత్ర మగవాడికే ఇచ్చేసారు. మరి స్త్రీలు భద్రతకోసం వెదకడంలో ఆశ్చర్యం లేదు. మన దేశంలో స్త్రీలకి భర్త అనే హోదాపే ముఖ్యం, భర్త కూడా ముఖ్యం కాదు. అతను బతికివుంటే చాలు, అతన్ని ఒక బుట్టలో పెట్టి ఇంకొక స్త్రీ ఇంటిలో వదలిస్తే అది పాతివ్రత్యం అని నమ్ముతున్న దేశంలో మరేం ఎదురుచూడడం సాధ్యం?”

“అంటే ఇతరులలాగ కాకుండా నీకొక కొత్త బ్రతుకు తెరువు కావాలి, అందుకు నా స్నేహం కావాలి. అదేనా నువ్వు చెప్పేది?”

భాను వెంటనే జవాబు చెప్పలేదు; అమృతంని తేరిపారి చూసింది.

“ఏమిటలా చూస్తున్నావ్?”

గభీమని ఆమె మొహంలోని చిరునవ్వులో హేళన ఛాయ కనిపించింది.

“అన్నిటికీ ఒక కారణం ఉండాలని మీరెందుకు ఆలోచిస్తున్నారు? మీకు ఆత్మ విశ్వాసం లేదా?”

అమృతం నిర్ఘాంతపోయాడు; చాలా సంవత్సరాలముందు నిత్యా ఇదే ప్రశ్న అతన్ని అడిగింది. భాను కొంచెం నాజూకుగా అడిగిన ప్రశ్న నిత్యా నిష్కపటంగా అడిగింది: “మీకెందుకు ఇంత inferiority complex?” తనకి ఆత్మన్యూనతాభావం ఉందనడంలో

సందేహం లేదు. తన స్వభావం నిత్యాలో కనిపించిన ఉత్సాహంకి సముచితంగా లేదనే కారణం వలనే తనలో ఆత్మన్యూనతాభావం చోటుచేసుకుందనవచ్చు. కాని, ఇప్పుడు తన వయసుని నెపంగా చెప్తే సరిపోతుందా? జీవితమనేది నలభైయేళ్ళ వయసులోనే ప్రారంభమౌతోందని విదేశీయ దేశాల్లో అంటున్నారు. కాని, మన దేశంలో . . . ఛీ, ఛీ, అలాంటి ఆలోచనలు రావడానికి వయస్సే కారణం . . .

"నేను పొరబాటుగా మాట్లాడానంటే క్షమించండి . . . " అంది భాను.

"అది కాదు . . . 'మీకు ఆత్మ విశ్వాసం లేదా?' అని అడిగావుకదా, దానిగురించి ఆలోచిస్తున్నాను . . . "

"ఆలోచించడానికి మీకెన్నో ఉన్నాయన్నమాట . . . "

"నేను నీగురించి అడిగి తెలుసుకున్నాను, కాని నీకు నాగురించి ఏమీ తెలియదు కదూ?"

భాను భుజాలు ఎగవేసుకుంది. 'నాకు దానిగురించి ఏ విచారమూ లేదు!' అన్నట్టుంది ఆమె ధోరణి.

"నీకు వినడానికి ఆసక్తి లేదంటే, నేను చెప్పనులే . . . "

"అసలు ఇప్పుడు ఏం జరుగుతోందో దాన్ని వదిలేసి పాత సంగతులు ఆరసించడం నాకు ఇష్టం లేదు . . . "

"నీకు ఆత్మ విశ్వాసం నిండుగా ఉంది."

భాను చిరునవ్వు నవ్వింది. అమృతంతో ఏకీభవించినట్టుంది ఆమె వాలకం.

అప్పుడు ఒక యువకుడు వచ్చి పక్కనున్న ఒక సోఫాలో కూర్చున్నాడు. ఎత్తు ఆరడుగులు; అతని మొహంలో ఒక నిర్లక్ష్య భావం, పొగరు బాగా కనిపించాయి. అందరిలాగ అక్కడికి వచ్చినప్పుడు అతనిలో పరిసరాలు చూసే అలవాటు కనిపించలేదు. అతని చెయిలో ఒక ఆంగ్ల పత్రిక ఉంది. దాన్ని తిరగేసాడు.

భాను ఆ యువకునిపక్క తన దృష్టి మళ్ళించింది, కొన్ని నిమిషాలు అతన్ని చూస్తూనే ఉంది. అలాగ చూడవలసిన మొహం అది. అతని తలనుంచి ఒకటో, రెండో నెరసిన వెండ్రుకలు తొంగి చూస్తున్నట్టు అమృతంకి అనిపించింది.

అమృతం తన్ను గమనిస్తున్నాడని గ్రహించిన భాను ఆ యువకుని చెయిలో ఉన్న పత్రికని చూస్తూ చెప్పింది: "చూసారా? చదవడానికి అతనికి ఎంత మంచి జాగా దొరికిందో?"

పన్నెండు సంవత్సరాలముందు నిత్యా చెప్పినది అమృతం గుర్తుచేసుకున్నాడు: 'పెళ్ళవని ఒక యువకుడు ఒంటరిగా కనిపించడం, పెళ్ళవని ఒక యువతి ఇంకొకరితో కనిపించడం - ఈ రెండూ బాగా ఆలోచించ వలసిన విషయాలు.'

"అతను ఒంటరిగా ఉన్నాడని నీకు బాధగా ఉందా?" అని అమృతం అడిగాడు.

"నేను వెళ్ళి కూర్చుంటానా?" అని భాను నవ్వుతూ అడిగింది.

"అలాగే చెయ్, అదే సరిగ్గా ఉంటుంది . . . "

భాను లేతగా తలూపింది. గభీమని అమృతం చెయిని అందుకొని తన చెయితో అణచుకుంది.

"మీ ఆలోచన అంతా మీ వయస్సుగురించే. . . అదే మిమ్మల్ని చిత్రవధ చేస్తోంది . . . "

అమృతంకి చెంపలో వాయించినట్టనిపించింది, మొహం వేరే దిశలో మళ్ళించుకున్నాడు. భానుతో కలిగిన స్పర్శ అలలుగా అతన్ని ఆవరించుకున్నా, ఆమె మాటలు అతన్ని ఎత్తి పొడిచాయి. ఏంచెయ్యాలో తెలియక అమృతం స్తంభించిపోయాడు. తన వయస్సు గురించి తనకున్న స్థిరభావం నిజం. అదొక పెద్ద గోడగా లేచిన తరువాత తన మనస్సాక్షి అదీ ఇదీ అని ఏమేమో మారువేషాలు వేసుకొని తన్ను ఇంకా బలహీనుడుగా చేస్తోంది. అందువలనే పక్కనే వచ్చి కూర్చున్న యువకుని చూసినతరువాత కలిగిన బలహీనం. ఈ వాలకం చూసిన తరువాత భాను తనకి ఆత్మవిశ్వాసం లేదని అంటే అది ఎంత నిజం!

భాను అణచుకున్న చెయిని అమృతం మెల్లగా నొక్కాడు. ఆమె అతన్ని ఆశ్చర్యంతో చూసింది. ఇప్పుడు ఆమె మొహంలో అమృతంకి కొత్తగా శోభ కనిపించింది. 'ఇవన్నీ చూసిన తరువాత నాకెందుకు నా వయస్సుగరించి బాధ?' భాను మొహంలో కనిపించిన ఆశ్చర్యం మాయమై, ఆమె బుగ్గలు ఎఱ్ఱబారిపోయాయి. అమృతం ఆమె వేళ్ళని ఇంకా గట్టిగా పట్టుకున్నాడు.

"నేను అన్నట్టు మీకు స్థిరభావం లేదని రుజువు చెయ్యడానికి మీకింత కోపం వచ్చిందన్నమాట!" అని అంటూ భాను నవ్వింది.

అమృతం చేతులు విడిపించుకొని "సరే, వెళ్దాం . . . " అని అన్నాడు.

హోటలు బయటికి ఇద్దరూ మౌనంగా వచ్చారు.

"ఎనిమిది గంటలయింది . . . " అంది భాను.

"నీకు ఆలస్యం కదూ?"

భాను మౌనం వహించింది.

కారు లక్ష్మీభాయ్ నగర్ చేరేవరకూ ఆమె మాటాడలేదు.

అమె ఇల్లు చేరుకున్నప్పుడు భాను చెప్పింది: "ఇన్ని రోజుల తరువాత ఇవాళే నేను సంతోషంగా ఉన్నాను. మీకు కారణం తెలుసు."

"సులభంగా ఏదీ నిర్ణయం చెయ్యలేని నువ్వు ఇవాళ త్వరలో నిర్ణయం చేసేసావ్, అవునా?"

"అవును . . . అదే మీకు హెచ్చరిక . . . "

"హెచ్చరిక?"

"అవును. ఈ నిర్ణయంకి దోహదం చేసినది మీరే . . . ఇక మీ బాధ్యత పెరుగుతుంది."

ఆమె కంఠధ్వనిలో నిలకడ, పట్టుదల చూసి అమృతంకి కొంచెం భయం కలిగింది.

"సరే, నేనిక శెలవు తీసుకుంటాను. మళ్ళీ ఎప్పుడు కలుసుకోవడం?"

అమృతం ఏమీ అనక ఊరుకున్నాడు.

"రేపు చూద్దామా?" అని అడుగుతూ భాను కారునుంచి దిగింది.

"రేపా?"

"అవును . . . మీరెందుకు జంకుతున్నారు?"

"సరే, ఎక్కడ కలుసుకుందాచూద్దాం? . . . "

"రేపు మరెక్కడైనా వెళ్దాం . . . India Gate . . . ?"

"రేపు వద్దు . . . వచ్చే ఆదివారం వెళ్దాం . . . "

భాను అమృతంని కొంచెం సేపు నిలకడగా చూసింది. ఆ తరువాత "నన్ను చూస్తే మీకు భయంగా ఉందా?" అని అడిగింది.

"నువ్వేమంటున్నావ్? నాకెందుకు నువ్వంటే భయం? 'మనం రోజూ కలుసుకోవాలా?' అని ఆలోచించాను. పదే పదే కలుసుకొని నీతో మెలగడానికి నాకు యోగ్యత లేదు . . . "

భాను చిరునవ్వు నవ్వింది. "ఇంకా కొన్నిరోజుల్లో మీకూ ఆత్మ విశ్వాసం వస్తుందని నా నమ్మకం.  సరే, రేపు కలుసుకుందాం, మీరు ఆకాశవాణికి ఐదుగంటలకి రండి . . . Ta Ta . . . Goodbye . . . "

భాను వెళ్ళిపోయింది.

అమృతం ఇల్లు చేరుకున్నప్పుడు ముందు ద్వారం తెరిచివుంది. అతనది ఎదురుచూడలేదు. హాలులో సోఫాలో కూర్చొని తిలకం ఏదో పుస్తకం చదువుతోంది. అది తిలకం అని అమృతం నమ్మలేకపోయాడు; రెండు మూడు సార్లు ఆమెను  పదే పదే

తేరిచూసాడు - ఆమె తన్ను అలా అలంకరించుకుంది. ఆమె దేహాన్ని బిగువుగా కప్పుకున్న చీర, మొహంకి ఈడుగా ఆ శిఖ అలంకారం, ఆమె ఎంచుకున్న చీర రంగు, ఆమె  భంగిమ - ఇవన్నీ బలిసిన ఆమె శరీరంని కొంచెం చిక్కినట్టు కనిపించాయి. ఈ దుస్తులు, ఆకర్షణీయమైన ఈ శైలి తిలకంకి ఎవరో తప్పకుండా నేర్పారని అమృతంకి అనుమానం కలిగింది.

అతన్ని చూడగానే తిలకం చిరునవ్వుతో లేచింది.

"ఎందుకు ఇంత ఆలస్యం?"

"ఆలస్యం ఉండనీ . . . ఇవాళ నీ అలంకారం భలే జోరుగా ఉందే?"

"ఉత్తికే  . .  . మీరు ఇంటికి వచ్చినప్పుడు నేను ఏడుస్తూ ఉండాలంటున్నారా?"

"ఇలాగ . . . " అని ఏదో అడగాలని తనలో అనుకుంటూ అమృతం సోఫాలో కూర్చున్నాడు.

"ఇలాగ . . . మీ మనసులో ఏముంది,  చెప్పండి . . . "

"ఈ అలంకారం నీకెవరు నేర్పారు?"

"ఎందుకలా అడుగుతున్నారు? నేనేం పల్లెటూరు పిల్ల అనుకున్నారా?"

"అది కాదు . . . ఇంతవరకూ  . . . నువ్వేమో ఇలా అలంకరించుకోడం నేను చూడలేదు . . . "

"మీరూ ఇలాగ పరస్త్రీతో మెలగడం ఇంతవరకూ చెయ్యలేదే . . . ఇప్పుడేకదా ఆరంభించారు?"

అమృతం ఉలికిపడ్డాడు.

"ఏమంటున్నావ్?"

"మీరు ఎది చేసినా అది నాకు తెలియకుండా ఉండదు,  అది జ్ఞాపకం ఉంచుకోండి! అదెలాగో పోనీ . . . ఒక ప్రశ్న అడుగుతాను, జవాబు చెప్పండి . . . మీకెందుకిలా మతి పోయింది?"

తిలకంకి ఎలాగ తెలుసు? ఎవరు చెప్పివుంటారు? తనకి పరిచయం ఉన్నవారు ఎవరి కళ్ళలోనూ తను పడలేదే? అలాగైనా కూడా  తిలకంకి చెప్పాలని ఎవరికి శ్రద్ధ ఉంటుంది?

తిలకం అతని పక్కనే వచ్చి కూర్చుంది: "నాదగ్గర లోపం ఏమిటో చెప్పండి. నేను నల్లగా ఉన్నానా, నాలో చురుకుతనం లేదంటున్నారా? మరి నేను చేసేదేముంది? నాకు మరేం తెలీదే?"

అమృతం సోఫానుంచి లేచాడు. 1984 నవలలో చదివినట్టు Big Brother Is Watching! అనే హెచ్చరిక నిజమైపోయింది! తనగురించి తెలుసుకోడానికి ఢిల్లీ నిండా తిలకంకి గూఢాచారులు ఉన్నారని అతను ఎదురుచూడలేదు. ఆమెకి అంత నైపుణ్యం లేదు.

అమృతం తన గదికి వెళ్ళి దుస్తులు మార్చుకున్నాడు. మనసులో ఇది ఆత్మరక్షణకోసం తిలకం చేసే పోరాటం కాబోలు,  అలా కాకపోతే, దాన్ని మరెలా వర్ణించడం? తనలో లోతుగా పాతుకున్న భావనలన్నీ ఆ సాయంకాలం బయటకి వచ్చేసాయి; భానుకూడా తన ఉద్దేశం దాచలేదు. భవిష్యత్తులో  ఇక తను ఏం చెయ్యాలి? దాని గురించి భానుతో మాట్లాడాలి . . .

నిమ్మళంగా సాగుతున్న జీవితంలో చలనం కోరడం తెలివితక్కువతనం కాదా? అది సమాధిలో అనుభవించే శాంతం లాగ అనవచ్చా? అలాగే కానీ. ఐనా కొత్త ప్రశ్నలు సృష్టించుకొని వాటిని ఎదుర్కొనే త్రాణ తనకుందా? ఆ దినం నిత్యా తన్ను పిటికివాడని జాడగా చెప్పింది. ఇవాళ భాను తనకి ఆత్మ విశ్వాసం లేదని ఎగతాళి చేసింది. Hamlet అన్నట్టు తన మనస్సాక్షి తన్ను పిటికివాడుగా చేసేసిందా?

అమృతం తన గదినుంచి తిరిగివచ్చినప్పుడు తిలకం అతని భోజనంకి పళ్ళెంలో అన్నం వడ్డించింది.

''నాకు భోజనం వద్దు . . . ఆకలి లేదు . . . ''

ఆమె తిరిగి చూసింది.

"ఏం, ఎందుకు?" కంఠధ్వనిలో ఒక భారంతో ఆమె అడిగింది.

"ఎవరు చెప్పారు?"

"ఏమిటి? దేనిగురించి?"

"అదే . . . ఇవాళ సాయంకాలం ఏం జరిగిందని . . . "

"ఎవరు చెప్పారన్నది అంత ముఖ్యం కాదే . . . "

"ఒక అమ్మాయితో సహజంగా జరిగిన సంభాషణ విని గాలి కబుర్లు చెప్తే ఎవరు చెప్పారన్నది ముఖ్యం కాదా?" అని అమృతం అడిగాడు.

## 13

"మీ ఇద్దరి సంభాషణ సహజంగా ఉంటే ఆ అమ్మాయి తల్లి నాకెందుకు దానిగురించి ఫోను చెయ్యాలి?" అని తిలకం అడిగింది.

అమృతంకి ఇప్పుడు బోధపడింది. భాను తన తల్లిగురించి చెప్పినదంతా నిజం. భాను చేష్టలు తల్లికి నచ్చలేదని తెలిసిపోయింది. తన ప్రవర్తన ఎలాగున్నా ఒక తల్లి తన కూతురు పెళ్ళైన మగవాడితో మెలగడం ఎలా ఒప్పుకుంటుంది? పెళ్ళి మాత్రం కాదు. వయస్సులో అమృతం భానుకంటే ఎంత పెద్దవాడు! ఛీ, తనకెందుకీ పిచ్చి?

తిలకం అతని పక్క వచ్చి కూర్చుంది.

"ఇక మీరు ఎది చెప్పినా నేను వింటాను. ఆ అమ్మాయి తల్లి చెప్పినట్టు ఈ సిగ్గుమాలిన పనులు చెయ్యకండి . . . "

"సిగ్గుమాలిన పనులా?"

"లేకపోతే మరేంటి? మనకి తగిన వయస్సులో పెళ్ళయి పాప పుట్టివుంటే దానికి పదిహేడు, పద్దెనిమిది అయివుంటుంది, అవునా? . . . "

"నేనిలా ముసలాడ్నైపోయానని గుర్తు చెయ్యడమంటే నీకెంత సంతోషం! . . . "

"మీకు వయస్సు చెల్లలేదని చెప్పడానికే ఇవన్నీ చేస్తున్నారా?"

అది వినగానే అమృతం భ్రమతో అలాగే నిల్చుండిపోయాడు. ఒక వేళ ఆమె ఆరోపణ నిజమేమో? తిలకం ఇంత సులభంగా తెలుసుకుంటుందని అమృతం ఎదురుచూడలేదు.

తనకి యౌవనం అంతమయిందని ఒప్పుకోవలసిందేనా? అమృతం ప్రస్తుతం యువకుడు కాదు అనే ప్రజ్ఞతోనే భాను అతన్ని- మొట్టమొదట కలుసుకున్నప్పుడు - 'అంకుల్' అనే పిలిచింది. తనకి యువకులంటే ఎందుకు అసహ్యం అని కారణం కూడా భాను చెప్పింది. నిజంగానే అమృతం భానుని ప్రేమిస్తున్నాడా? లేకపోతే తన గత కాల యౌవనంని గుర్తుచేసే ఒక సాధనంగా ఆమె ఉందనే అవగాహన అందుకు కారణమా?

రకరకాల భావనలు అతని మనస్సుని ఆక్రమించాయి. అమృతం కళ్ళు మూసుకున్నాడు. కాలండెర్ చెప్పే లెక్క అంగీకరించడమే వివేకం.

ఎదైనా సరే - సవాలుగా తీసుకొని జీవించే ధైర్యం తనకి లేదు. వర్తమాన జీవితంని రూఢీ చేస్తున్నట్టు తన ఎదుట కూర్చున్నది ఎవరు - తన భార్య. ఆమె లాగ ఈ సత్యంని తనూ ఖాయపరచుతే ఏ చిక్కూ, సమస్యా ఉండదు.

అమృతం మంచంలో వాలిన కొంచెం సమయంలో అతనికి తిలకం నిట్టూర్పు వినిపించింది. ఆమె ఏదో మాట్లాడుతూనే ఉంది, కాని అమృతం ఏది వినుపించుకోలేదు. ఆ సమయంలో అతనికి ఆమె అగత్యంగా కనిపించింది.

మరుదినం అతను చాలా ఆలస్యంగా నిద్రలేచాడు; రాత్రంతా ఏమేమో పొందన లేని భావనలు, కలలు పైబడుతునే ఉన్నాయి.

గభీమని అతనూ, తిలకం వయసు మరలినట్టు భ్రమ. అది కలలాగ లేదు, ఆ జ్ఞాపకం సాగుతూనే ఉంది. తిలకం జుత్తంతా నెరసిపోయినట్టుంది. అమృతం ఆమె తలని ముట్టుకున్నాడు. తిలకం నిద్రనుంచి లేచింది: "ఏమిటి కావాలి?" "ఏమీ లేదు." "ఏమనుకుంటున్నారు?" అమృతం మళ్ళీ పడుకున్నాడు. కిటికీకి పక్కన ఉన్న చెట్ల నీడలు గోడమీద ఆడుతున్నాయి. ఇలాగే కలకీ, జ్ఞాపకంకి మధ్య ఎన్నో తబ్బిబ్బుల మధ్య నిత్యా మొహం, భాను చిరునవ్వు . . .

నిన్న హోటలులో చూసిన ఆ గంభీరమైన యువకుడు ఆకాశంవరకు వ్యాపించి మేఘాలనుంచి కిందకి చూస్తున్నాడు. ఏ దిశలో చూసినా దిగంతం వరకూ ఇసుక నిండిన ప్రదేశంలో అమృతం ఒంటరిగా నిలబడి గోలపెడుతున్నట్టు ఒక పరితాపం. ఆ యువకుని ప్రతిధ్వని మ్రోగుతోంది. ఆ ప్రతిధ్వని నీడలాగ విశ్వరూపం తీసుకొని అమృతంని బెదరిస్తోంది.

ఆ కలలన్నీ క్రమపరచుకోవాలని అమృతం ప్రయాసపడ్డాడు, కాని లాభం లేదు.

"ఇవాళ ఆఫీసుకి వెళ్తున్నారా?"

అమృతం తిరిగి చూసాడు. తిలకం స్నానం చేసి, కొత్త చీర, తలనిండా పువ్వులతో కనిపించింది.

అమృతం మంచం నుంచి దిగాడు,

"ఆపీసు లేదంటే మరెక్కడైనా వెళ్దాం . . ."

"ఎక్కడికి?"

"Nehru Park . . . మీరు నాకు driving నేర్పించండి."

అమృతం జవాబు చెప్పకుండా బాత్ రూమ్ వైపు నడిచాడు.

"ఇదే మీతో ఒక పెద్ద గొడవ . . . నేను ఏది చెప్పినా వినిపించుకోరు . . ." అని చిలకం గొణుక్కోవడం అమృతం చెవులకి వినిపించింది.

ఇవాళ ఆఫీసుకి వెళ్ళకపోతే అదీ మంచిదే, భానుని చూడనక్కరలేదు . . . ఛీ, ఆమెను చూడడానికి తనకెందుకు భయం? దాన్ని భయం అనికూడ అనలేం . . . ఆమెను రోజూ తప్పకుండా చూసితీరాలా ఏమిటి? కాని అలా కాకపోతే తను మరేం చెయ్యాలి? తిలకంకి driving నేర్పకుండా తప్పించుకోడం అసాధ్యం.

స్నానం చేసి వచ్చిన తరువాత అమృతం చెయిలో వార్తా పత్రికతో కూర్చున్నాడు.

"టైమెంత అని తెలుసా?"

"ఎంత?"

"ఎనిమిదన్నర . . . ఆఫీసుకి వెళ్ళవద్దని మీరు నిశ్చయం చేసేసారా?"

"వెళ్ళవద్దు అనే ఆలోచిస్తూంటే నువ్వేమో driving నేర్పాలని నన్ను బెదరిస్తున్నావ్ . . . "

తిలకం నవ్వేసింది. "భయపడకండి . . . driving పాఠం వద్దు . . . మరెక్కడైనా వెళ్దాం, రండి."

"ఎక్కడికి వళ్ళాలంటున్నావ్?"

"కరోల్ బాఘ్ వెళ్దాం, రండి . . . అజ్మల్ ఖాన్ రోడ్డులో కొంచెం shopping చెయ్యాలి . . . "

ఆమె ఏం shopping చెయ్యాలని అమృతం అడగలేదు; ఇంతవరకూ అతను ఆ మాట వినసేలేదు.

వార్తా పత్రికలో ఏదో సరసమైన రాజకీయ కబుర్లు అతన్ని ఆకర్షించాయి; అందులో మువిగిపోయాడు.

"ఏమీ మాటాడరేం? వెళ్దామా?"

" . . . "

"నేను అడుగుతున్నాను . . . నోరు మూసుకొని కూర్చుంటే ఎలాగ? చెప్పండి, మీకు నాతో వెళ్ళడానికి ఇష్టం లేదా?"

"ఎక్కడికి?"

"ఎక్కడికా? నాతో ఎక్కడకి వెళ్లలన్నా మీకిదే అలవాటైపోయింది! . . . అవును, నేనేం సొగసుగా ఉన్నానా మీతో హోటలుకి వెళ్ళడానికి . . . "

అమృతం వార్తాపత్రికని మూసాడు. ఆమె మాటలు విని చిరచిరలాడాడు. లేచి ఒకసారి బద్ధకంగా ఒళ్ళు విదల్చుకున్నాడు. ఆమె మాటలు తన్ను ఏ విధంగానూ బాధించలేదు అని తిలకంకి తను తెలియజేయాలి - అదే ఆమెకి తను ఇవ్వగలిగిన తగిన శిక్ష. కాని ఆ సూక్ష్మభేదం గ్రహించే శక్తి ఆమెకి లేదని అతనికనిపించింది. ఆ ఆలోచనతో ఆమెకి చెప్పాడు:

"సరే, నేను ఆఫీసుకి వెళ్తున్నాను."

"ఆఫీసుకి వెళ్తున్నారా?"

"అవును."

ఇంతవరకూ తన స్వభావంని అదుపులో ఉంచుకున్న తిలకం ఇక భరించలేకపోయింది.

"ఏమీ తెలియని అమ్మాయితో హోటలుకి వెళ్తారు. నాతో బజారుకి రారు, అవునా?"

"అది నా ఇష్టం."

"ఏమన్నారు? మీ ఇష్టమా? మీ ఇష్టమా?"

తిలకం కోపంతో గోడదగ్గరికి వెళ్ళి తలని మొత్తుకుంది. అమృతం గబగబమని ఆమె వెనక పరుగెత్తుకొని వెళ్ళి తిలకంని వెనక్కి లాగాడు.

"నీకేం hysteria వా?"

"అవును, నాకు hysteria వే! నాకు పిచ్చి పట్టేసింది! మీతో కాపురం చెయ్యలేని పిచ్చిదాన్ని . . . నాకు మతి పోయింది . . . "

అమృతం ఆమెను లాగ్గొని వచ్చి సోఫాలో కూర్చోబెట్టాడు. తిలకం తన రెండు చేతులతో మొహం కప్పుకొని ఏడవసాగింది.

"ఇదిగో, చూడు, నువ్వెందుకు ఏడుస్తున్నావ్? నేనేం చచ్చిపోయానా?"

తిలకం వెళ్ళిపోయింది. ఆవేశంతో ఆమె పలికిన జవాబు వినాలని ఎదురుచూసిన అమృతంకి కొంచెం నిరాశ కలిగింది. ఆక్రోశంతో ఆమెలో చోటుచేసుకున్న భావనలు త్వరగా కరుగుతాయని అమృతం ఆశించాడు. కాని తన కోపంలో సుఖమున్నట్టు, అందులో తను విశ్రాంతి అనుభవిస్తున్నట్టు తిలకం ఇంకొక గదికి వెళ్ళి తలుపు మూసుకుంది. ఆమె తటాలున తలుపు మూసినది అమృతంకి తన్ను చెంపలో వాయించినట్టనిపించింది.

ఆ రోజు సాయంకాలం అమృతం ఆకాశవాణి భవనంకి వెళ్ళినప్పుడు భాను అతనికోసం కాచుకొని ఉంది.

అమృతం కారు ఆపగానే ఆమె కారు తెలుపు తెరిచి, ఉత్సాహంతో అతని పక్క వచ్చి కూర్చోంది.

"నిన్న మీ ఇంటిలో ఏం జరిగింది?" అని అడిగింది.

అమృతం ఆమెను వింతగా చూసాడు.

"నాకన్నీ తెలుసు. మీ Mrs. అన్నీ చెప్పేసినట్టు అమ్మ నాకు చెప్పింది. ఎలాగైనా మనం కలుసుకోవడం ఆపాలని అమ్మ ఉద్దేశం. కాని అది అమ్మకి సాధ్యం కాదని నాకు బాగా తెలుసు."

భాను నవ్వుతూ ఆ ఘటన గురించి మాటాడడడం చూసి అమృతం నివ్వెఅపోయాడు. ఆ రోజు ఉదయం తనకీ, తిలకంకీ మధ్య లేచిన ఘర్షణ అమృతంని ఇంకా గించుతూనే ఉంది, కాని భాను వాలకం చూస్తే ఆమెకి తన తల్లి ఆక్షేపణ గురించి ఏ విచారమూ లేదు. అందుకు ఆమె జీవించే ధోరణి కారణమా లేక తన తల్లికి తన ప్రతిఘటన చూపాలనే కారణం వలనే ఆమె అమృతంతో మెలగుతోందా? ఆమె ఈ పరిస్థితిని సంతోషంగా అనుభవించుతున్నట్టు కనిపిస్తోంది. కాని తిలకంతో దెబ్బలాడి వచ్చిన అమృతంకి ఈ పరిస్థితి అలాగ లేదే? దానికి కారణం?

ఛీ, దేనిగురించీ ఆలోచించకూడదు. అప్పుడప్పుడు సాగుతున్న అనుభవాల సత్యంలో చావుగురించి, ఆక్షేపణ గురించి ఏమీ ఆరసించకుండా ఉండడమే తను తనకి చేసుకొనే సేవ; లాభనష్టాలు, మంచి చెడ్డలు లెక్కచెయ్యకూడదు. అప్పుడే తన చేష్టలు సమర్థించుకోడం సాధ్యం. తన పక్కన ఉండేది భాను అయితేనేం, మరెవరైతేనేం? ఈ క్షణం ఆమె ఒక యదార్థం - తన జీవితంలో ఒక ప్రదర్శన - అని గుర్తుచేసుకుంటే చాలు. గత కాలం ఒక సంబరంలాగ - అందులో ఎన్ని శుభమైన, దీనమైన , ఘటనలు! - ఐపోయింది. ప్రతీ అనుభవంకీ - దానికని - కేటాయించిన సమయం ఉంది; ఎల్లప్పుడూ మనం మెలకువతో ఉన్నాం లేక నిద్రపోతున్నాం - ప్రతీ అనుభవం, ఘటన, క్రియకి ముగింపు అని ఒకటి ఉంది. అది విజ్ఞానంకి అనుకూలమైన సిద్ధాంతం, అవునా? ఈ లోకంలో ఏదైనా సరే నిరంతరాయంగా ఉందని భౌతిక శాస్త్రం చెప్తోందా, లేదే?

"ఇప్పుడు ఎక్కడికి వెళ్దామని మీ ఉద్దేశం?" అని భాను అడిగినప్పుడు ఆ ధ్వని వెయ్యేళ్ళ మైళ్ళ దూరంనుంచి వినిపించినట్లనిపించింది. ఆ ప్రశ్నకి, ఆ సమయంలో తనకున్న మానసిక స్థితిలో జవాబు చెప్పడం ఆ క్షణంలో తన ధర్మం అని అమృతం నిశ్చయించాడు.

"ఏదైనా హోటలుకి వెళ్ళి ఉందామా?"

భాను అతన్ని వింతగా చూసింది.

"వెళ్దామా?"

ఆమె తలూపింది.

పురాతన డిల్లీలో ఆ హోటలు ఒక మొగలాయుల కట్టడంలాగ ఉంది. చిన్న చిన్న గదులు - ఒక పక్క గోడ, ఇంకొక పక్క కొయ్య అడ్డకట్టు. మంచంపై పరచియున్న దుప్పటి - రంగు మాసిపోయి, జడ్డి కాంతితో కనిపించే - ఒక సిల్కువస్త్రం; హోటలు యజమాని ఒక ముస్లీం కాబోలు.

చుట్టూ వ్యాపించివున్న నిర్బంధాలు తొలగిపోయినట్టూ, ఏకాంతంలో, ఆ చిన్న గదిలో అంతులేని స్వతంత్రత దొరికినట్టూ అమృతం, భాను ఒకరినొకరు అర్థపుష్టితో చూసుకున్నారు.

"ఒక నూరు సంవత్సరాలు ముందుకు ప్రయాణం చేసినట్టుంది" అన్నాడు అమృతం.

అక్కడున్న ఒక పాత కుర్చీలో కూర్చొని భాను నవ్వింది.

"ఎందుకు నవ్వు?"

"పురాతన డిల్లీకి పరుగెత్తుకొనివచ్చి ఎవరూ చూడకూడదని ఈ షాజహాన్ కాలపు హోటలుకి మీరు వచ్చారు. మరి స్వతంత్రత గురించి మాటాడానికి మీకేం హక్కు ఉంది? ఎవరిని చూసి మీకీ పిరికితనం?"

అమృతం ఎదురుచూడని ప్రశ్న ఇది. తనకి ఎవరిని చూసి భయం? భాను అడిగినట్టు పరిపూర్ణ స్వతంత్రత అంటే ఎవరి ప్రతిపక్షం సాధ్యమవకుండా, ఎవరికీ తెలియకుండా, ఎక్కడో తన్ను బందించుకోడం ధైర్యమా? కాని అది తెలిసినా భాను ఎందుకు తనతో ఇక్కడికి వచ్చింది? ఒక కొత్త అనుభవం కావాలనా? లేకపోతే తనకి ఎంత సాహసం ఉందని తెలుసుకోవాలనా?

"నీకు చాలా కోపం గదూ?"

"హూం . . . " అని నిట్టూర్పు వదలిన భాను ఏదో చెప్పాలనుకుంది. ఆ తరువాత ఏదో ఆలోచనలో పడి తొందరగా "లేదు . . . లేదు . . . " అని మాత్రం అంది.

భాను కుర్చీనుంచి లేచి మంచంమీద కూర్చోడానికి వెళ్ళింది. కూర్చోడానికి ముందు మంచంమీదున్న ఆ దుప్పటిని తీసింది. గబీమని మంచంమీదున్న పడకనుంచి లేచిన దుర్గంధం గదంతా వ్యాపించింది.

"కర్మ! . . . కర్మ! . . . " అని భాను మొహం చిట్లించుకుంది.

"Sorry . . . మరెక్కడైనా వెళ్దాం . . . " అన్నాడు అమృతం.

భాను పడకని కాజేసి సేల వాల్చింది; మంచం పట్టు ఇంకా అధ్వాన్నంగా కనిపించింది.

భాను మంచం చివరలో కూర్చుంది. "ఇంతకు ముందు మీరిక్కడికి వచ్చి ఉన్నారా?" అని అడిగింది.

"నీ మనసులో ఏమనుకుంటున్నావ్? ఎందుకీ ప్రశ్న?"

"ఇంతకు ముందు మీరిక్కడికి వచ్చి ఉన్నారా?"

అమృతం జవాబు ఇవ్వలేదు. నిన్న తన గతకాల జీవితం చెప్పాలని అమృతం ప్రయతినించాడు, కాని భాను వినడానికి ఇష్టపడలేదు. కాని ఇప్పుడు చాలా ఉదాసీనతతో తన్ను ఈ ప్రశ్న అడుగుతోంది. తన జవాబు గురించి ఆమెకి ఏ విచారమూ లేదని ఉంది ఆమె వాలకం.

"భాను, నిన్ను కొన్ని ప్రశ్నలు అడగాలి . . . "

ఆమె అతన్ని వింతగా చూసింది: "ఇదేంటి, నాతో మాట్లాడడానికి మీకు నా అనుమతి కావాలా?"

అమృతం కుర్చీలో కూర్చున్నాడు. అది ఒక పక్క జారింది; ఎలాగో సర్దుకున్నాడు.

"అంటే సేను చెప్పేది వినడానికి నువ్వు సిద్ధంగా ఉన్నావన్నమాట . . . "

"మీరేం చెప్పాలనుకుంటున్నారు?"

"తిలకంని పెళ్ళిచేసుకొసేముందు నాకు ఇంకొక అమ్మాయితో స్నేహం ఉండేది. ఆమె పేరు నిత్యా . . . "

"అదేం ముఖ్యమా?"

"ఏది?"

"ఆమె పేరు . . . "

అమృతం కొంచెం ఉలికిపడ్డాడు; నిజం, తసెందుకు ఆమె పేరు చెప్పాలి?

"సరే, అదెలాగో పోనీ . . . ఆమె నీలాగే ఉంటుంది - అంటే, చూడడానికీ, మాట్లాడడానికీ . . . "

భాను నవ్వేసింది. తసేదో సీరియస్ గా చెప్తూంటే ఆమె నవ్వడం అమృతంకి నచ్చలేదు.

"నువ్వు నన్ను ఎగతాళి చేస్తున్నావా?"

"లేదు! లేదు! మీరు ఆమె ప్రతిబంబంని తరుముకుంటూ పరగెత్తుతున్నారని నాకు అనుమానం కలిగింది, అందుకే నవ్వాను."

"ఆఖరికి సేను ఆమెని పెళ్ళిచేసుకోలేదు."

"పెళ్లి చేసుకుంటే Image అని ఏదీ ఉండదే? ఇలాగ తరుముకుంటూ పరుగెత్తడమే మీకు తృప్తిగా ఉందేమో?

"నువ్వన్నది నిజమే కావచ్చు. సేనుగాని ఆమెని పెళ్ళిచేసుకొనివుంటే ఏమైయుంటుందో?"

"'ఇదే నిత్యా!' అసే మీ భావనలో ఉన్న అమ్మాయిని మీరు పెళ్ళిచేసుకోలేదని తెలిసివుంటుంది. మీకు స్నేహితురాలుగా పరిచయమైన నిత్యాకి, మీరు పెళ్ళిచేసుకున్న నిత్యాకి చాలా భేదం ఉందని బోధపడివుంటుంది."

"భాను, నీకు చాలా కఠిన హృదయం" అన్నాడు అమృతం.

"ఇందులో కాఠిన్యం ఏముంది? ఏదో కారణం వలన మనం ఎవరిసైనా మెచ్చుకుంటే వాళ్ళని ఆదర్శజీవులుగా మార్చడమే మన స్వభావం, అవునా? కాని వాళ్ళందరూ మనం ఎదురుచూసినట్టు ఉండాలసే అగత్యం లేదే?"

"నువ్విప్పుడు ఎవరిగురించి మాటాడుతున్నావ్? నా గురించా లేక నీగురించా?"

భాను మళ్ళీ నవ్వింది: "You are very smart."

"అసలు నాగురించి ఏమనుకుంటున్నావ్?"

"ఈ హోటలుకి మీరు నన్ను తీసుకొని వస్తారని నేను ఎదురుచూడలేదు. నిన్న రాత్రి ఏమిటి జరిగిందని నాకు బోధపడింది. మీ నీడని చూసే మీకింత భయమా?"

"అబ్బా, నాతో ఈ హోటలుకి వచ్చినందుకు నీకెంత కోపం!"

"All right, మీ భార్యకి విడాకులిచ్చి నన్ను పెళ్ళిచేసుకోడామికి మీరు రెడీయా?"

"ఏమన్నావ్?" అమృతం కంఠధ్వని గర్జించింది. వచ్చిన ఆవేశం అణచుకోవడం అసాధ్యమనిపించింది.

భాను నవ్వడం ఆరంభించింది; నవ్వు ఆపడానికి ఒక నిమిషం పట్టింది.

"ఆ అమ్మాయి - ఆమె పేరు ఏమన్నారు? - నిత్యావా? మీరెందుకు ఆమెను పెళ్ళిచేసుకోలేదని నాకు బోధపడింది. మీకున్న ధైర్యమంతా మీతో ఈ హోటలుకు రాగానే నాకు తెలిసిపోయింది. Mr. Amirtham, నాకు మీదున్న గౌరవం మీరు పోగొట్టుకున్నారు."

అమృతంకి కొరడాతో కొట్టినట్టనిపించింది: మంచంనుంచి తొలగించిన ఆ మురికి పడకలాగ తన గుణ విశేషాలని భాను మూటగట్టి నేల పారేసింది.

తిలకంతో విడాకులనేది అనూహ్యామైన విషయం; తిలకం దానికి ఎన్నటికీ ఏకీభవించదు. భర్తకి ముఖ్యపాత్ర ఇచ్చి గౌరవించే ఈ సమాజంలో ఉత్తి చట్టాలవలన ఎటువంటి సంస్కరణ సాధ్యం కాదు. తిలకంకి తనపై మనఃపూర్వంగా ఆసక్తి లేదేమో, కాని మన సమాజంలో భర్త కంటే భర్త స్థానంకి గౌరవం ఎక్కువ అని భానువే నిన్న చెప్పింది. ఇంకా చెప్పాలంటే ఒక స్త్రీ సుమంగళిగా ఉందంటే అందుకు ఆమె భర్త బతికి ఉండడమే కారణం, అందువలనే భర్తకి ఆ గౌరవం. ఈ సమాజంని ఎదుర్కొనడానికి తనకి సాహసం ఉందా?

"సరే, వెళ్దామా?" అని అడుగుతూ భాను లేచింది.

"నీకు వెళ్ళాలంటే సరే, కాని నేను ఏమిటి చెప్పదలచుకున్నానో కొంచెం విను. ఇప్పుడు మనం ఉండే సమాజంలో చాలా ఇబ్బందులున్నాయి. యాభై సంవత్సరాలముందు మా తాతగారికి ముగ్గురు పెళ్ళాళ్ళు; ఎవరూ కనుబొమలు పైకెత్తలేదు. ఇప్పుడు మనం ఉండేది స్త్రీలని గౌరవించే సమాజం అంటున్నారు. ఒక మగవాడికి ఒక స్త్రీ అని నియతి. స్త్రీలకీ విడాకులివ్వడానికి హక్కు ఉందని చట్టం చెప్తోంది, కాని ఎంతమంది అది చేస్తారు?కొత్త ఆచారాలు పాటించడం మనకి చేతకాదు, పాతవన్నీ అనాగరకమని చెప్పుకుంటూ మనం అవస్థపడుతున్నాం."

"సరే, వెళ్దామా?"

అమృతం కోపంతో ఆమెను చూసాడు. భాను రెండు చేతులూ కట్టుకొని వేరే దిశలో ఏదో చూస్తూ నిల్చొనివుంది.

గదికి తాళం వేసి అమృతం బయలుదేరాడు.

Ajmir Gate దాటి Hardinge Bridge చేరేవరకూ ఇద్దరూ మాటాడలేదు. Connaught Palace రాగానే భానువే మొదట మాటాడింది.

"నాకింతవరకూ యువకులంటే అసహ్యంగా ఉండేది. కాని ఇప్పుడే బోధపడింది. అసలు 'మగవారంటే - చిన్నా, పెద్దా అనే భేదం లేదు - అందరూ మూర్ఖులే!' అని నేనంటున్నాను. అవునా?"

అమృతం జవాబు ఇవ్వలేదు.

"మీకూ మీ భార్యకి పొత్తులేదని లేదని తెలిసిన తరువాత నాకు మీరంటే సానుభూతి ఉంది. కాని మీలాంటివారికి - అంటే, ధైర్యం లేని ఒక శోక చరిత్ర కధానాయకుడులాగ - పూర్తిగా అరిగిపోయి, రెక్కలు రాకెట్లని నమ్ముకుంటూ పైకెగిరే కళాకారులకి -ఒక

ప్రశ్న అని వస్తే దాన్ని సాధించే శక్తి లేదు . . . ఛాన్సు దొరికితే చాలు, దాన్ని ఉపయోగించుకోవాలనే స్వార్థమే మీకు ఉంది . . . మగజాతంటే నాకు విసుగు పుట్టేసింది . . . "

"మగవారిని దూషించే గుంపులు విదేశాల్లో ఉన్నాయని నేను విన్నాను" అన్నాడు అమృతం.

"మీరేమంటున్నారు?"

"నువ్వూ అలాగే ఐపోతావ్"

"అదేం శాపమా లేక దీవెనా?"

అమృతం మౌనంగా కారుని నడిపాడు. ప్రతీ స్త్రీ మనసులోనూ మగవాడిని దూషించే ప్రకృతి దాగ్గొని ఉందేమో? అలాగే ప్రతీ మగవాడిలోనూ స్త్రీని దూషించే స్వభావం ఉందేమో? Don Juan కి స్త్రీలు అంటే పగ అని మనోరోగ వైద్యులు చెప్తారు. మరి కామం అంటే ఆడ మగవారు ఒకరినొకరు పగ తీర్చుకోవడం అని అర్థమా?

తను నిత్యాగురించి భానుకి చెప్పడం పొరబాటేమో? అందువలనే భాను తను అనుభవించిన విరహతాపంని సూటిగా చెప్పకుండా, చాతుర్యంగా మరేదో కారణం చెప్పి తప్పించుకోవాలని ప్రయత్నించుతోంది. 'నిన్ను చూస్తే నాకు నా పాత చెలియ జ్ఞాపకం వస్తోంది. అందుకే నువ్వంటే నాకు ఇష్టం . . . " అని అంటే ఆత్మాభిమానం ఉన్న ఏ అమ్మాయికైనా ఎలా ఉంటుంది?

కారు Safdarjung విమాన నిలయం ముందు ఆగింది. నగరంలో త్వరలో రాబోయే ప్రజాతంత్ర దినం సంబరాలకి ఒద్దికలు సాగుతున్నాయి. అందులో పాల్గొనే హెలికాప్టర్లు ఆకాశంనుంచి కిందకి దిగివస్తున్నాయి. అందువలన గేటు మూసివుంది.

"హెలికాప్టర్లు భూమికి దిగి వచ్చేసాయి" అన్నాడు అమృతం. భాను చిరునవ్వు నవ్వింది.

"నిన్ను మొట్టమొదట చూసినప్పుడు నువ్వొక simple girl అని నేను అనుకున్నాను."

భాను మళ్ళీ చిరునవ్వు నవ్వింది.

"ఇంకొక సంగతి చెప్పాలని ఉంది. చెప్పనా?"

"ఓ . . . తప్పకుండా . . . "

"నిత్యాగురించి నేను చెప్పడంవలన మీకు అసూయ కలిగిందేమో?"

భాను పెద్దగా నోరు తెరిచి నవ్వింది.

గేటు తెరిచారు. అమృతం కారు నడిపాడు. ఎందుకీ అమ్మాయి ఇలా నవ్వుతోంది?

"ఇలాంటి ఆలోచనలవలన మీకు సంతోషం అంటే నాకు ఆక్షేపణ లేదు. అలాగే కానీయండి."

అమృతం కారుని లక్ష్మీబాయ్ నగర్ వైపు పోనిచ్చాడు.

"నేనీపక్క రావడం ఇదే ఆఖరుసారి . . . ఇక ఈ తోవ నేను రాననిపిస్తోంది . . . " అన్నాడు అమృతం.

"ఇన్ని భావనలు ఒక మనిషిలో ఉన్నాయంటే అతనిలో మౌలికంగా ఏదో లోపం ఉందన్నమాట."

"సరే, నీ జాగా వచ్చేసింది."

భాను కారునుంచి దిగినవంటనే అమృతం ఆమె దగ్గర శెలవు తీసుకోకుండా I.N.A Colony వైపు కారుని మళ్ళించాడు.

అమృతం ఇంటికి వెళ్ళినప్పుడు అది తాళం వేసివుంది.

తిలకం బజారుకి వెళ్ళిందేమో? మామూలుగా ఈ సమయంలో ఆమె వెళ్ళదు. కొంచెం సేపు అమృతం అలాగే నిల్చున్నాడు.

ఎక్కడికి వెళ్ళడం? తనగురించి ఎవరికీ ఏ బాధా లేదు. అందరూ అతన్ని నిరాకరించేసారు; అతని తటబాటు చూసి అందరూ నవ్వుతున్నారు.

లోపలికి వెళ్లామా వద్దా అని అమృతం ఆలోచించాడు. అతని దగ్గర కూడా మారు తాళంచెవి ఉంది. లోపలికి వెళ్తే తన ఒంటరిపాటు తన్ను ఇంకా తీవ్రంగా పీడించుతేమో?

తలుపు మూల 'హిందు' పత్రిక కనిపించింది. మామూలుగా అది సాయంకాలం ఐదు గంటలకి వస్తుంది. అంటే తిలకం ఐదుగంటలకి ముందే బయలుదేరి వెళ్ళి ఉండాలి. ఎక్కడకి వెళ్ళింది?

తలుపు తెరిచి అమృతం లోపలికి వెళ్ళాడు; ఇల్లంతా శూన్యంగా ఉంది.

మేజామీద ఒక ఉత్తరం. తొందరగా అమృతం దాన్ని చదివాడు.

"మీరు ఎవరితో వెళ్ళారని నాకు తెలుసు. ఎందుకీ భార్యా భర్త నాటకం? నాకు నన్ను కాపుకోడం తెలుసు - తిలకం"

చదవగానే అతని చేతులు వొణికాయి. ఆ ఉత్తరంని నలగగొట్టి జేబులో వేసుకున్నాడు.

ఆ గూఢచారి - భాను తల్లి - తిలకంకి అన్నీ చెప్పివుండాలి; అమృతంకి పట్టరాని కోపం వచ్చింది.

తిలకం ఎక్కడికి వెళ్ళివుంటుంది? అమెకి అన్యోన్యముగా స్నేహితులెవరూ లేరు; ఇంటికి పక్కనే ఉన్న జాగాలు తప్ప మరెక్కడకీ ఆమె ఒంటరిగా వెళ్ళదు.

అమృతం Iyer ఇంటికి ఫోను చేసాడు.

Iyer ఫోను అందుకున్నారు: "Yes, Iyer, here."

"నేను అమృతం మాటాడుతున్నాను . . . మా ఆవిడ అక్కడకి వచ్చిందా?"

"మీ ఆవిడా? లేదే? ఉండండి, అడుగుతాను . . . ఇదిగో చూడు . . . Mrs. అమృతం ఎక్కడ వెళ్ళారని నీకు తెలుసా? . . . తెలీదా? తెలియదంటోంది . . . ఎందుకు? ఏమైందని . . . ?"

"Thanks . . . బజారుకి వెళ్ళిందనుకుంటాను."

మరేం అనక అమృతం Iyer తో ఫోను సంభాషణ మానుకున్నాడు.

ఆ తరువాత అమృతం ఐదారుగురుకి ఫోను చేసాడు; అన్ని చోట్లా ఒకటే జవాబు; "ఏమైంది" అని అందరూ ఆడిగారు; అమృతం చిరచిరలాడాడు.

ఒక వేళ తిలకం ఇంటిలోనే ఎక్కడో దాక్కొని తన్ను పరీక్ష చేస్తోందేమో? అమృతం ఆమెని గది గదిగా తిరిగి వెతికాడు. 'ఛీ, ఇదేం వెర్రితనం! . . . అది ఇల్లు తాళం వేసుకొని వెళ్ళిపోయింది . . . ఇంటిలో దాన్ని ఎక్కడ వెతకడం?'

డైనింగ్ టేబిలుమీద అతని కోసం రాత్రి భోజనం మూసి ఉంది. వంట చేసిన తరువాతే తిలకం వెళ్ళింది.

ఇప్పుడు తను చేసేదేముంది? Police కి ఫిర్యాదు చెయ్యాలా? "నా భార్య కనిపించలేదు, వెతికి కనుక్కోండి!' అని వేడుకుంటే ఎంత సిగ్గుచేటు! ప్రొద్దువరకూ కాచుకుందాం. అంతకుముందు తిలకం విపరీతంగా ఏమైనా చేసిందంటే? . . . ఛీ, అది అలాగేం చెయ్యదు . . .

అమృతం ద్వారం మూసేసి, దీపం ఆర్పేసి, అలాగే మంచం మీద వాలాడు. గత పన్నెండు సంవత్సరాల జీవితం మరచిపోవాలనే అతని కోరిక ఇప్పుడు సంపన్నమైంది; ఈ రాత్రి అతనికి - ఏకాంతమూ, ఊహాలోకం, కలలూ - జోడుగా దొరికాయి.

మానవ జీవితం రెండు పంథాల్లో సాగుతోందని అంటారు - అది ఎంత నిజం! ఈ లోకమంతా ఒక ఇల్లుగా ఒక జాడ, ఈ లోకంకి బాహ్యంగా ఇంకొక జాడ. మానవుడు సామాజిక నియమాలు పాటించి మొదటి మార్గంలో సాగాలి. రెండవ మార్గంలో అతను తన స్వతంత్రతకి ఒక పరిమితి ఉందని తెలుసుకుంటాడు. కాని ఇప్పుడు ఈ స్వతంత్రత వలన తను సంతోషంగా ఉన్నాడా?

ఇల్లంతా ఒకటే నిశబ్దం. దానితోబాటు చీకటి కుట్రచేసి అతన్ని బెదరిస్తోంది. మంచంపైన పక్కనే ఉన్న శూన్యం 'ఎలా ఉంది నీ స్వతంత్రత?' అని అడుగుతున్నట్టుంది.

“భోజనంకి వస్తారా?” అని ఎవరో పిలిచారు. అమృతం తిరిగి చూసాడు. వరుసగా అమర్చివున్న గిన్నెలు తప్ప మరేం లేవు.

అతను లేచి మేడమీదకి వెళ్ళాడు. ఎదుట వరువరుసగా ఆసుపత్రి భవనాలు నిగనిగమని మెరుస్తున్నాయి. ఈ బాహ్య ప్రపంచంలో తనొక చిన్న బొట్టు. కాని ఆ బొట్టుకి ఎన్ని ఆలోచనలు, ఎన్ని స్వయంధృతమైన నియమాలు!

గుంపునుంచి తప్పించుకోవాలని తిరగబడే మేకకి, బోనులో చిక్కుకున్న చుంచెలుకి స్వతంత్రత అంటే భయం. సమాజం అనేది అనివార్యమైన ఒక చెరశాల. ఒకటి జ్ఞానిగా ఉండాలి, లేక పిచ్చివాడుగా ఉండాలి. అప్పుడే స్వయంధృతమైన నియమాలు పాటించడం సాధ్యం.

అవును, తనకి బోను ఒక స్వర్గంలాగ . . . అమృతం మళ్ళీ మంచంలో పడుకున్నాడు. అర్థం లేని జీవితంకి అర్థం కల్పించుకొని జీవించడమే వివేకం. అలసిపోయి, శూన్యంలో చితికిన రెక్కలతో ఎగరడం ఎలాగ? తన రెక్కలలో కొంచెం త్రాణ ఉండడం తన దుర్భాగ్యం.

ఈ లోకం ఎలాగైనా ఉండనీ. తను ఒంటరిగా జీవించడం అసాధ్యం. తిలకంని వెతికి తీసుకురావాలి. ఏకాంతంలోనే ‘నాకున్న ప్రశ్న నేనే’ అని అమృతం గ్రహించాడు. తిలకమే అతన్ని అతనిదగ్గరనుంచి కాపాడుతుంది. తిలకం ఎక్కడ?

అప్పుడే టెలిఫోను మ్రోగింది.

**(సమాప్తం)**